




ESTD: 1999
www.voodayam.com

# వుదయం

ఆదిలాబాద్ 07-10-2026 బుధవారం సంపుటి : 14 | సంచిక : 28
SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar, Guntur & Warangal
Follow us on






## రూ.200 కోట్లతో గడ్డిపల్లిలో
# యంగ్ ఇండియా పాఠశాల

**సూర్యాపేట, అక్టోబర్ 6 (వుదయం) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల పేద పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం భారీగా నిధులను వెచ్చిస్తోందని స్పష్టం చేశారు.

సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో అత్యాధునిక సాంకేతికతతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి మంగళవారం వారు భూమిపూజ చేశారు. అనంతరం గడ్డిపల్లి గ్రామంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులతో కలిసి పురోగతిపై సమీక్షించారు.

**ప్రతిరోజూ 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం:**
మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు నిత్యం బలవర్ధకమైన అల్పాహారాన్ని అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రంలో ఆహార తయారీ నుంచి పాఠశాలలకు చేరవేసే వరకు ఆధునిక వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నారు.

కోదాడ శాసనసభ్యురాలు ఎన్. పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల సామాజిక బాధ్యత నిధులను మంజూరు చేసింది.




ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడాన్ని ఉచిత పథకంగా చూడకూడదని, ఇది మానవ వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి అని వ్యాఖ్యానించారు. పేద కుటుంబాల ఆర్థిక మూలాలను బలోపేతం చేయడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

**ఆరోగ్యకరమైన ఆహారంతోనే మెరుగైన అభ్యసనం:**
తరగతి గదిలో బోధనతో పాటు శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం అత్యంత కీలకమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కిచెన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ కూడా అందిస్తామని వివరించారు. రాబోయే రోజుల్లో అవసరాన్ని బట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్వహణ, ఆహార నాణ్యతను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

**నిర్ణీత గడువులోగా గడ్డిపల్లి పాఠశాల పూర్తి:**
గడ్డిపల్లి వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాల పనులను రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణకు వారాంతపు ప్రణాళికను రూపొందించుకోవాలని, నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల విద్యార్థులు ఒకేచోట కలిసి చదువుకునేలా 105 సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు ఎన్. పద్మావతిరెడ్డి, శాసనమండలి సభ్యుడు శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు



### కేసీఆర్ కుటుంబానికి రెవెన్యూ నోటీసులు
### ఎర్రవల్లి భూముల్లో తెలంగాణ అమరవీరుల కాలనీ
### జూన్ 2 నాటికి పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, అక్టోబర్ 6 (వుదయం) :** ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూములకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు ప్రాంతాల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎర్రవల్లి సర్వే నంబరు 325లో మొత్తం 388 ఎకరాల భూమి నమోదు కాగా, భూమి కొలతల సర్వేలో మాత్రం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలిందని అధికారులు వివరించారు. ఈ వ్యత్యాసంపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి, మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడికి పోయిందో సమగ్రంగా విచారించి తేల్చాలని అధికారులను ఆదేశించారు. భూమి సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో త్వరలోనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భూములకు సంబంధించిన అధికారిక రెవెన్యూ రికార్డులను సమర్పించాల్సిందిగా కేసీఆర్ కుటుంబ సభ్యులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. మరోవైపు, వివాదాస్పదంగా మారిన సర్వే నంబరు 325 పరిధిలోని భూమిలో తెలంగాణ అమరవీరుల కాలనీని నిర్మించాలని, రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు ఇక్కడ నివేశన స్థలాలు కేటాయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమగ్ర కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ సంస్థకు అప్పగించాల్సిందిగా సూచించారు. ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నాటికి ఈ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించినట్లు తెలిసింది.

## ఒమన్ తీరంలో మళ్లీ క్షిపణి కలకలం

**న్యూఢిల్లీ:** ఒమన్ తీర సమీపంలోని హర్మూజ్ జలసంధి గుండా పనామా పతాకంతో పయనిస్తున్న ఒక వాణిజ్య నౌకపై క్షిపణి దాడి జరిగింది. ఈ ప్రమాదంలో 11 మంది భారతీయ నావికులు గాయపడినట్లు భారత విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించింది. సదరు నౌకలో ఉన్న మొత్తం 19 మంది సిబ్బందిలో 17 మంది భారతీయులే ఉన్నారని తెలిపింది.

## దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ఎఎంఎస్) :** ప్రభుత్వాధినేతగా పాతికేళ్ల సుదీర్ఘ పాలనా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేంద్ర మంత్రిమండలి ప్రత్యేక అభినందనలు తెలిపింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడుసార్లు బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, అపార ప్రజాదరణతో వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధించి దేశ ప్రధానిగా సేవలు అందిస్తున్నారని గుర్తుచేసింది. 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే ప్రాథమిక సూత్రంతో ఆయన ముందుకు సాగుతున్నారని కొనియాడుతూ కేంద్ర క్యాబినెట్ ఈ మేరకు ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి నమూనాల స్ఫూర్తితోనే, మోదీ నేడు



దేశవ్యాప్తంగా వినూత్న దార్శనికతతో పాలన సాగిస్తున్నారని మంత్రివర్గం పేర్కొంది. చిన్నతనంలో పేదరికాన్ని, తన తల్లి పడిన శ్రమను స్వయంగా అనుభవించిన నాయకుడిగా.. ఆ క్షేత్రస్థాయి అనుభవాల ఆధారంగానే పేదలు, మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రభుత్వ స్థాయిలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని వెల్లడించింది. ప్రధాని ధైర్యంగా చేపడుతున్న ఆర్థిక సంస్కరణల ఫలితంగానే మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే వ్యవస్థల ఆధునికీకరణ అత్యంత వేగంగా జరుగుతున్నాయని తెలిపింది. ఆయన పాలనలో డిజిటల్ సేవల రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రశంసించింది. ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక, సామాజిక అస్థిరతలు నెలకొన్న సమయంలో కూడా తన అద్భుత నాయకత్వ పటిమతో దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తున్నారని, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్టను మరింత పెంచారని పేర్కొంది. సరిహద్దుల్లో నిర్వహించిన మెరుపు దాడులు (సర్జికల్ స్ట్రైక్స్), బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న రాజీపడని కఠిన వైఖరికి నిదర్శనాలని స్పష్టం చేసింది.

# బ్లాక్ స్పాట్ల గుర్తింపే కాదు..

### శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలి
### రహదారి భద్రతలో విప్లవాత్మక మార్పులు అవసరం
### గుజరాత్‌లో మంత్రి కోమటిరెడ్డి కీలకోపన్యాసం



**ఎక్తానగర్ (గుజరాత్), అక్టోబర్ 6 (వుదయం) :** రహదారుల భద్రతకు సంబంధించి కేవలం నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందిస్తే సరిపోదని, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి సురక్షిత ప్రయాణాన్ని అందించడమే అసలైన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఎక్తానగర్‌లో గల స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో నిర్వహించిన 'చింతన్ శివిర్-2026' రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. "సురక్షిత రహదారుల రూపకల్పన - ప్రమాణాల నుంచి అమలు వరకు" అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు మంత్రి అధ్యక్షత వహించి కీలకోపన్యాసం చేశారు.

ఈ చర్చా వేదికను కేటాయించినందుకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, కేంద్ర మంత్రిత్వ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రాజావత్, జాయింట్ సెక్రటరీ సీహెచ్. సింగ్, భారతీయ రహదారుల కాంగ్రెస్ కార్యదర్శి జనరల్ రాహుల్ గుప్తా, కాన్పూర్ భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీ) డీన్ ప్రొఫెసర్ నితిన్ సక్సేనా, మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ వెంకటేశ్ బాలసుబ్రమణియన్, జాతీయ రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ సంచాలకులు అమరేంద్ర కుమార్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఐడీసీఎల్) ఛైర్మన్ సంతోష్ యాదవ్, కేంద్ర కార్యదర్శి ఉమాశంకర్ పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

**అంతర్జాతీయ ఉత్తమ విధానాల అధ్యయనం:**
ప్రపంచ దేశాలు రహదారి భద్రతను ఒక ప్రత్యేక వృత్తిపరమైన విభాగంగా పరిగణిస్తున్నాయని మంత్రి తెలిపారు. స్వీడన్‌లోని 'విజన్ జీరో', ఆస్ట్రేలియాలోని 'సేఫ్ సిస్టమ్', అమెరికా ఫెడరల్ హైవే విధానాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ దశల్లో స్వతంత్ర నిపుణుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర భద్రతా తనిఖీల కోసం స్వతంత్ర 'రహదారి భద్రత లోక్‌పాల్' (అంబుడ్స్‌మన్) లేదా భద్రతా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు.

**భూసేకరణ, శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు:**
రహదారుల నిర్మాణంలో భూసేకరణ, రహదారి హక్కు (రైట్ ఆఫ్ వే) కేటాయింపులు అత్యంత కీలకమని, ఇవి సరిగ్గా ఉంటేనే సర్వీసు రోడ్లు, జంక్షన్ల వద్ద స్పష్టమైన వీక్షణ సదుపాయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) కేవలం గుర్తించడమే కాకుండా, శాశ్వత ఇంజినీరింగ్ మార్పుల ద్వారా ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిఘా కెమెరాలు, డ్రోన్లు, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ప్రమాదాల తీవ్రతను ముందే అంచనా వేయాలని తెలిపారు.

**హైదరాబాద్ - విజయవాడ రహదారి విస్తరణ అత్యవసరం:**
హైదరాబాద్ విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై విపరీతంగా పెరిగిన వాహనాల రాకపోకల దృష్ట్యా, దీనిని 6+2 లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, త్వరలోనే కేంద్ర మంత్రిమండలి ఆమోదం పొంది పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

**2030 నాటికి 50 శాతం మరణాల తగ్గింపే లక్ష్యం:**
2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలన్న జాతీయ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. 2023లో దేశవ్యాప్తంగా 1,72,890 మంది ప్రాణాలు కోల్పోగా, తెలంగాణలో 7,660 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎన్ని కిలోమీటర్ల రోడ్డు నిర్మించామన్నది కాకుండా, ఎంతమంది ప్రాణాలను కాపాడామన్నదే ప్రామాణికం కావాలని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జాతీయ రహదారుల ప్రధాన ఇంజినీరు ధర్మారెడ్డి, ప్రాంతీయ రింగ్ రోడ్డు ప్రధాన ఇంజినీరు వసంత్ నాయక్, రాష్ట్ర రహదారుల ప్రధాన ఇంజినీరు బి. వెంకటేశ్వరరావులతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






## ఇంతే కదా...!




# కేంద్ర ఎన్నికల సంఘం ముందు మహాధర్నా

### ఢిల్లీలో ఉద్రిక్తత, రాహుల్, ప్రియాంకల అరెస్ట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ఎఎంఎస్) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయడంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ విపక్ష కూటమి నాయకులు దేశ రాజధానిలో చేపట్టిన నిరసన ప్రదర్శన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో ఉదయం నుంచే తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు తొమ్మిది గంటల పాటు అక్కడే నిరసనగా బైఠాయించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేడాతో పాటు పలువురు నాయకులను, కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 50 మంది పార్లమెంట్ సభ్యులతో సహా మొత్తం 250 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.



bమంగళవారం ఉదయం పార్లమెంట్ మకర ద్వారం నుంచి విపక్ష కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యలో ఆకాశవాణి భవన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ రోడ్డుపైనే ఉపవేశించి నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ బారికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండాను చేతపట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి వెళ్లిన రాహుల్, ప్రియాంకలతో పాటు పలువురు ఎంపీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ నిరసనను కొనసాగించారు.



# వీధి కుక్కల నియంత్రణకు ఏబీసీ కార్యక్రమం



**కోహీర్, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):** కోహిర్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టుకొని సంగారెడ్డి అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రానికి తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు.వీధి కుక్కల నియంత్రణలో భాగంగా చేపడుతున్న అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమంలో కుక్కలను శాస్త్రీయ పద్ధతిలో పట్టుకొని, పశువైద్యుల పర్యవేక్షణలో జనన నియంత్రణ శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) నిర్వహించడంతో పాటు యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

**పూర్తిగా కోలుకున్న తర్వాత పట్టుకున్న ప్రాంతంలోనే విడుదల**

చికిత్స, వ్యాక్సినేషన్ అనంతరం కుక్కలను కొంతకాలం పర్యవేక్షణలో ఉంచి, పూర్తిగా కోలుకున్న తర్వాత అవి పట్టుబడిన ప్రాంతంలోనే తిరిగి వదిలివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వీధి కుక్కల సంఖ్యను క్రమంగా నియంత్రించడంతో పాటు రేబీస్ వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ప్రజలు ఈ కార్యక్రమాన్ని అపార్థం చేసుకోకుండా, వీధి కుక్కల నియంత్రణ కోసం మున్సిపాలిటీ చేపడుతున్న ఏబీసీ, యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సహకరించాలని అధికారులు కోరారు.వీధి కుక్కలకు హాని కలిగించడం లేదా వాటిని స్వయంగా ఇతర ప్రాంతాలకు తరలించడం చేయవద్దని సూచించారు. కుక్కల వల్ల ఇబ్బందులు ఎదురైతే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ అన్నాన్ జావీద్ అనిమల్ బర్త్ కంట్రోల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దేవీ ఉపాసనకు ఆలంపూర్ సిద్ధం

- 11 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు!
- అష్టాదశ శక్తిపీఠంలో నవదుర్గల శోభ.. తొమ్మిది రోజుల పాటు జోగులాంబ క్షేత్రంలో ఆధ్యాత్మిక మహోత్సవం



**అలంపూర్, అక్టోబర్ 06 (వుదయం కరస్పాండెంట్)**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచి, ప్రపంచ వ్యాప్త ఆధ్యాత్మిక ప్రియులను విశేషంగా ఆకట్టుకునే ఐదవ అష్టాదశ శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పవిత్ర తుంగభద్రకృష్ణా సంగమ తీరాన ఆధ్యాత్మిక తేజస్సుతో విరాజిల్లుతున్న ఈ దివ్యక్షేత్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దీప్తి వెల్లడించారు. నవరాత్రుల వేళ విశ్వజనని జోగులాంబ అమ్మవారు రోజుకో విభిన్న రూపంలో 'నవదుర్గ'లుగా భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. శక్తిస్వరూపిణిగా జగన్మాత.. అలంకారాల సమాచారం: వేద పండితుల ఉచ్చైఃస్వర మంత్రోచ్చారణలు, చండీయాగాలు, విశేష అర్చనల నడుమ తొమ్మిది రోజుల పాటు దేవి అలంకారాలు కంటికి విందు చేయనున్నాయి: నవంబర్ 11 (ప్రథమి): శ్రీ శైలపుత్రీ దేవి అవతారం నవంబర్ 12 (ద్వితీయ): శ్రీ బ్రహ్మచారిణీ దేవి అవతారం నవంబర్ 13 (తృతీయ): శ్రీ చంద్రఘంటా దేవి అవతారం నవంబర్ 14 (చతుర్థి): శ్రీ కూష్మాండా దేవి అవతారం నవంబర్ 15 (పంచమి): శ్రీ స్కందమాతా దేవి అవతారంనవంబర్ 16 (షష్ఠి): శ్రీ కాత్యాయనీ దేవి అవతారం నవంబర్ 17 (సప్తమి): శ్రీ కాళరాత్రి దేవి అవతారం నవంబర్ 18 (అష్టమి): శ్రీ మహాగౌరీ దేవి అవతారంనవంబర్ 19 (నవమి): శ్రీ సిద్ధిదాత్రి దేవి అవతారం భక్తజన సంద్రానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు పవిత్ర శరన్నవరాత్రుల వేళ అమ్మవారి ఆశీస్సుల కోసం రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ, అత్యవసర వైద్యం, ట్రాఫిక్ నివారణ తదితర అంశాలపై ఆలయ యంత్రాంగం, పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాయి. ఆధ్యాత్మిక శోభతో తుంగభద్ర తీరం ఉప్పొంగిపోతోంది.

# గర్భిణీలు, కిశోర బాలికలు పోషకాహారంపై అవగాహన



**అందోల్ వుదయం :** 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ జోగిపేట ఆధ్వర్యంలో మంగళవారం 16వ వార్డు అవుసలి సంఘంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అధికారులు విపులంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ఆందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), 16వ వార్డు కౌన్సిలర్ పట్లోల శ్రీనివాస్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ మధులత, మెప్మా టీఎంసీ బిక్షపతిగౌడ్ తదితరులు హాజరయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.



# అంగన్వాడీ టీచర్ పోస్టుకు ఎలిజిబుల్ జాబితా

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ ప్రక్రియలో భాగంగా మంగళవారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులతో ఎలిజిబుల్ జాబితాను రూపొందించారు. ఎలిజిబుల్ అయిన ప్రతి అభ్యర్థికి ఇంటర్వ్యూకు సంబంధించిన కాల్ లెటర్లను అందజేశారు. ఈనెల 15న రామయంపేట ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం,మహిళలు పాల్గొన్నారు.

# కోహీర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాల

- గేట్ వద్ద గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు.. ప్రయాణికుల తీవ్ర అవస్థలు
- ఆర్ఓబీ లేదా అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్

**కోహీర్, అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి):**



కోహీర్ రైల్వే గేట్ వద్ద వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందస్తుగా రైల్వే గేట్ మూసివేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. రైలు వచ్చేవరకు గేట్ తీసే అవకాశం లేకపోవడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో రోడ్డుపై దాదాపు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంటోంది.రైలు రాకపోకల సమయంలో గేట్ మూసివేయడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు తదితర వాహనాలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేట్ మూసివేత కారణంగా అంబులెన్సులు, అత్యవసర పనులపై వెళ్లే వాహనాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నారు.

**తరచూ ట్రాఫిక్ సమస్యలు.. ప్రయాణికుల్లో ఆందోళన**

రైల్వే గేట్ మూసివేయడంతో వాహనాలు నిలిచిపోవడమే కాకుండా, ఇతర వాహనాలు రోడ్డుపై ఉండి వేచి చూడాల్సి వస్తోంది. రైల్వే గేట్ మూసివేయడం వల్ల గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు ఆలస్యమవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతి రోజు రైళ్ల రాకపోకల సమయంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహీర్ రైల్వే గేట్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**ఆర్ఓబీ లేదా అండర్‌పాస్ నిర్మించాలి**

కోహీర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ (ఆర్ఓబీ) లేదా అండర్‌పాస్ నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ట్రాఫిక్ కష్టాల నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని కోరుతున్నారు. రైళ్ల సమయపాలనను పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, గేట్ మూసివేత సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సుదీర్ఘ నిరీక్షణతో నరకయాతన అనుభవిస్తున్నామని, ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. కోహీర్ ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ లేదా అండర్‌పాస్ నిర్మాణానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ట్రాఫిక్ సమస్యలు పునరావృతం కాకుండా తగిన ప్రణా

# గద్వాలలో 9న కిసాన్ మేళా

- ఆధునిక సాంకేతికతపై రైతులకు ప్రత్యక్ష అవగాహన.. డ్రోన్ టెక్నాలజీ నుంచి అధిక దిగుబడుల వరకు
- శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులతో ముఖాముఖి.. ప్రభుత్వ పథకాలు, రాయితీలపై ప్రత్యేక మార్గదర్శనం

**గద్వాల అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**

సాగులో ఆధునికతను అందిపుచ్చుకుని.. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి.. దిగుబడు లను పెంచి.. వ్యవసాయాన్ని లాభసాటి బాట పట్టించేందుకు గద్వాలలో ఈ నెల 9న కిసాన్ మేళా నిర్వహించనున్నారు.రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడుల సాధన, పంటల సంరక్షణ తదితర అంశాలపై నిపుణుల సూచనలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని కేఎస్ ఫంక్షన్‌హాల్‌లో కిసాన్ మేళా జరగనుంది. వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక విప్లవాన్ని రైతులకు చేరువ చేయడమే లక్ష్యంగా మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్రోన్ నుంచి యంత్రాల వరకు..ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన సాగు యంత్రాలు, డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. పంటలపై మందుల పిచికారీ, సాగు పనుల్లో యాంత్రీకరణ, సమయంతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక పద్ధతుల వినియోగం తదితర అంశాలను నిపుణులు వివరించనున్నారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో రైతులకు ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన పంటల ఎంపిక, సాగులో పాటించాల్సిన మెలకువలు, తెగుళ్ల నివారణ, పంటల సంరక్షణ, అధిక దిగుబడికి అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై సూచనలు ఇవ్వనున్నారు. రైతులు తమ సందేహాలను నేరుగా నిపుణులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం ఉండనుంది నాణ్యమైన విత్తనాలు.. శాస్త్రీయ ఎరువుల వినియోగం పంటల దిగుబడిలో విత్తనాల నాణ్యత, ఎరువుల వినియోగం కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన హైబ్రిడ్ విత్తనాల ఎంపిక, నూతన రకాల ఎరువుల వినియోగం, అవసరానికి అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.



**ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక సమాచారం**

రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రాయితీలు, వ్యవసాయ పథకాలు, అందుబాటులో ఉన్న ప్రయోజనాలు, వాటిని పొందేందుకు అర్హతలు, దరఖాస్తు విధానంపై అధికారులు వివరించనున్నారు. పథకాల ప్రయోజనాలను రైతులు సులభంగా పొందేలా అవసరమైన మార్గదర్శకాలను అందించనున్నారు. లాభసాటి సాగు దిశగా.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కిసాన్ మేళా ద్వారా అందించే శాస్త్రీయ సమాచారం, నిపుణుల సూచనలు రైతులకు ఉపయోగ కరంగా ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీరప్ప కోరారు.

# పిరమిల్ కాలుష్యంతో ప్రజల ప్రాణాకుముప్పు?

**గాలి, నీరు, భూమి కలుషితమవుతున్నాయంటూ స్థానికుల ఆందోళన**
**కెమికల్ వాసనలు.. శ్వాసకోశ సమస్యలపై ఫిర్యాదులు**
**శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి నిజానిజాలు తేల్చాలని డిమాండ్**

**కోహిర్, అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని పిరమిల్ పరిశ్రమ చుట్టూ కాలుష్యంపై ఆందోళనలు తీవ్రతరం అవుతున్నాయి. పరిశ్రమ కార్యకలాపాల వల్ల గాలి, నీరు, భూమి నాణ్యతపై ప్రభావం పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కెమికల్ వాసనలు, వ్యర్థాల నిర్వహణ, కలుషిత నీటి అంశాలపై అధికారులు సమగ్రంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**కాలుష్యం నిజమేనా? అధికారుల పరీక్షలతో తేలాలి!**

పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఉందా? ఉంటే ఏ స్థాయిలో ఉంది? ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ భూములు, భూగర్భ జలాలపై దాని ప్రభావం ఎంత మేరకు ఉంది? అనే అంశాలపై శాస్త్రీయంగా పరీక్షలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం ఆరోపణలు, అనుమానాలతో కాకుండా శాస్త్రీయ నివేదికల ఆధారంగా వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

**బోర్లు, బావుల నీటిపై కాలుష్యం పై అనుమానాలు**

పరిశ్రమ పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావులు, ఇతర నీటి వనరుల నీటి కాలుష్యం పై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భ జలాలు కలుషితమై భవిష్యత్తులో తాగునీరు, వ్యవసాయంపై తీవ్రగా ప్రభావం పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న బోర్లు, బావులు, నీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి రసాయన పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

**గాలిలో కెమికల్ .. శ్వాసకోశ వ్యాధుల సమస్యలపై ఫిర్యాదులు**

పరిశ్రమ పరిసరాల్లో కెమికల్ వాసనలు వస్తున్నాయని, దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోగ్య సమస్యలకు పరిశ్రమ కాలుష్యమే కారణమా అనే విషయాన్ని వైద్యపరమైన, శాస్త్రీయ పరీక్షల ద్వారా నిర్ధారించాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

**వ్యర్థాల నిర్వహణపై స్పష్టత ఏది?**

పరిశ్రమలో ఉత్పత్తి అయ్యే కెమికల్ వ్యర్థాలను ఎలా నిర్వహిస్తున్నారు? వ్యర్థ జలాలను ఏ విధంగా శుద్ధి చేస్తున్నారు? పరిశ్రమ నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. కాలుష్య నియంత్రణ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది సంబంధిత శాఖలు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి**

పరిశ్రమ చుట్టుపక్కల గాలి, నీరు, భూమి నుంచి శాస్త్రీయ పద్ధతిలో నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. పరీక్షల నివేదికలను బహిరంగంగా వెల్లడించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించాలని అంటున్నారు. కాలుష్యం లేదని పరీక్షల్లో తేలితే ప్రజల్లో ఉన్న భయాలు తొలగిపోతాయని, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రజల ఆరోగ్యమే ప్రథమం**

పరిశ్రమల వల్ల ఉపాధి, అభివృద్ధి అవకాశాలు పెరగాలని కోరుకుంటున్నామని, అదే సమయంలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి ముప్పు వాటిల్లకూడదని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.పిరమిల్ పరిశ్రమకు సంబంధించి వస్తున్న కాలుష్య ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, గాలి-నీరు-భూమి నాణ్యతపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని దిగ్వాల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ బరిలో బీజేపీ బిగ్ ప్లాన్!

- బూత్ నుంచే కదనరంగం.. పట్టభద్రుల ఓటు నమోదుపై ప్రత్యేక గురి

**ఐజ: అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ సమర సన్నద్ధమవుతోంది. బూత్ స్థాయి నుంచే పటిష్టమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ఆ పార్టీ జిల్లా ఎమ్మెల్సీ కన్వీనర్ రామచంద్రరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించి.. ఎన్నికల కార్యాచరణను మరింత ఉధృతం చేయాలని సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రామచంద్రరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఓటరు నమోదే తొలి అడుగు' ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని రామచంద్రరెడ్డి అన్నారు. అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్‌కు స్పష్టమైన బాధ్యతలు కేటాయించుకుని, ఓటరు నమోదుతో పాటు ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై గళమెత్తాలికాంగ్రెస్, బీఆర్ఎస్ విధానాలపై విద్యా వంతులు తమ అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలవాలని అన్నారు. విద్యావంతుల్లో బీజేపీకి మద్దతు కొనసాగుతోందని రామచంద్రరెడ్డి పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి ఎవరైనా.. పార్టీ శ్రేణులంతా ఒక్కతాటిపై నిలిచి పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత భేదాలకు తావులేకుండా సమష్టి కృషితో ఎన్నికలను ఎదుర్కోవాలని సూచించారు. రెండు స్థానాల్లోనూ విజయం సాధిస్తాం' ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందని రామచంద్రరెడ్డి తెలిపారు. తెలంగాణ ఆకాంక్షల పరిరక్షణకు, ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యపరమైన సందేశాన్ని అందించేందుకు ఈ ఎన్నికలు పట్టభద్రులకు ఒక కీలక అవకాశమని అన్నారు. పట్టభ ద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ గళాన్ని వినిపించాలని ఆయన కోరారు. కదనానికి సిద్ధమవుతున్న కేడర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఐజ మండలంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో కార్యాచరణను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్ స్వామి, ఐజ మండల ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, రజక నర్సింలు, గడిగే రఘు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థినిపాఠశాలలో చేర్పించిన సర్పంచ్ అబ్దుల్ రషీద్

- చదువు జీవితాన్ని మార్చేస్తుంది ఏదైనా సాధించగల పట్టు చదువు ఒకటే

**ఊర్కొండ న్యూస్ 7 వుదయం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు ఊరుకొండ పేట గ్రామంలో పాఠశాలకు రాకుండా ఊర్లలో తిరుగుతుండగా సర్పంచ్ అబ్దుల్ రషీద్ చూసి తన బైక్ పైకి ఎక్కించుకొని పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించాడు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతలు ఉండాలని చదువుని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు . Irregular student అరవింద్ ను ..



పాఠశాలకు తీసుకొస్తున్న.. ఊరుకొండ పేట సర్పంచ్ శ్రీ అబ్దుల్ రషీద్ మరియు ఉపసర్పంచ్ఆర్ శ్రీనివాస్ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్.. వారి తల్లిదండ్రులకు.. చదువు.యొక్క విలువను గురించి తెలియజేయడం జరిగింది.

# గ్రామ అభివృద్ధికి సామాజిక, వనరుల పటాలు



- గ్రామ ప్రజల భాగస్వామ్యంతో సోషల్, రిసోర్స్ మ్యాపింగ్

**కోహీర్, అక్టోబరు 6 (వుదయం ప్రతినిధి):**

కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామం లో గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ ప్రణాళికల తయారీలో భాగంగా సోషల్ మ్యాప్ (సామాజిక పటం), రిసోర్స్ మ్యాప్ (వనరుల పటం) తయారీ కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వీబి జి రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్), గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (వీజీపీపీ )లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, ఇళ్లు, సామాజిక వర్గాలు, మౌలిక సదుపాయాలు, ప్రజల అవసరాలను గుర్తిస్తూ సోషల్ మ్యాప్ రూపొందించారు. గ్రామంలో సామాజిక అవసరాలు, సమానత్వం, మౌలిక వసతుల పరిస్థితిని గుర్తించి భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ఈ మ్యాప్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామ పరిధిలోని సహజ వనరులు, భూములు, నీటి వనరులు, వృక్షసంపద తదితర అంశాలను గుర్తిస్తూ రిసోర్స్ మ్యాప్ రూపొందించారు. స్థానిక రైతుల భాగస్వామ్యంతో సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

**గ్రామస్తుల భాగస్వామ్యంతో ప్రణాళికలు**

గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడంలో సోషల్, రిసోర్స్ మ్యాపింగ్ కీలకంగా ఉంటుందని సిబ్బంది వివరించారు.ఈ కార్యక్రమంలో , గ్రామ పంచాయతీ కార్యదర్శి అమరేశ్వరి, టీఏ పావని, టీఏ ఎండి గని, ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్, సతీష్ పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# చిన్నారుల్లో పోషకాహర లోపం లేని జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దడమే లక్ష్యం

**వనపర్తి అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి)**

**: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లాలో మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను పూర్తిగా నివారించి, రక్తహీనత లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాల్ని చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ లో భాగంగా, 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,**

మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. రక్తహీనత నివారణ కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

వనపర్తి జిల్లాను సామ్, మ్యామ్(ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, పోషకాహార లోపం) పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. గతేడాది జిల్లాలో 438 మంది సామ్ పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 106 మందికి తగ్గిందని తెలిపారు. మిగిలిన పిల్లలకు కూడా అవసరమైన పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా సామ్, మ్యామ్ పిల్లలు ఉన్నట్లు గుర్తించిన వెంటనే వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, పోషక పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్సీ) తరలించాలని సూచించారు. అక్కడ వారికి మెరుగైన పోషకాహారం, వైద్య చికిత్స అందించి సాధారణ ఆరోగ్య స్థితికి తీసుకురావాలని తెలిపారు.

**అంగన్వాడీల సేవలు అభినందనీయం**

జిల్లాను సామ్, మ్యామ్ పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు. బిఎల్వోలుగా తమ విధులను నిర్వహించడంతో పాటు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బందిని అభినందించారు.
అప్పుడే పుట్టిన శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన పోషక పదార్థాలు, రోగనిరోధక శక్తిని పెంచే అంశాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం**

పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్ నాయక్, డీపీఆర్ఓ సీతారాం, ఇతర అధికారులు, సీడీపీఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## ట్రాక్‌పై విస్ఫోటనం: గద్వాల సంచలనం!




- **శ్రీ సరస్వతీ టాలెంట్ విద్యార్థుల సంచలన ప్రదర్శన.. ఆసిఫాబాద్**
- **సమరానికి ముగ్గురు క్రీడాకిశోరాలు!**

**గద్వాల అక్టోబర్ 06**
**(వుదయం కరస్పాండెంట్ )**

పరుగుల మైదానంలో వారి వేగం పవన చలనాన్ని తలపించింది! ప్రత్యర్థులకు కనీస అవకాశం కూడా ఇవ్వకుండా, విద్యుత్ వేగంతో లక్ష్యాన్ని ముద్దాడి గద్వాల క్రీడా వినీలాకాశంలో విజయ పతాకాన్ని రెపరెపలాడించారు శ్రీ సరస్వతీ టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు. జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో (ఈ నెల 4న) హోరాహోరీగా సాగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈ క్రీడా మణులు తిరుగులేని ఆధిపత్యం చలాయించి రాష్ట్ర స్థాయి బెర్తులను సొంతం చేసుకున్నారు. పరుగుల వేట.. స్వర్ణాల బాట! పాఠశాల కరస్పాండెంట్ మాకం భీమపల్లి వెల్లడించిన వివరాల ప్రకారం.. అరవింద్ (9వ తరగతి): అండర్14 విభాగం 300 మీటర్ల పరుగు పందెంలో ప్రత్యర్థుల ఊహలకు అందని వేగంతో దూసుకెళ్లి ప్రథమ స్థానంలో నిలిచాడు. రోహిత్ నాయక్ (7వ తరగతి): అండర్12 విభాగంలో డబుల్ ధమాకా సృష్టించాడు. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందేలలో తనదైన దూకుడుతో విజృంభించి ద్వంద్వ విజయాలు నమోదు చేశాడు. సేవా నాయక్: అండర్ 10 విభాగం 60 మీటర్ల స్ప్రింట్‌లో చిరుతలా దూసుకెళ్లి ప్రత్యర్థులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచాడు. లక్ష్యం: ఆసిఫాబాద్ పీఠం! జిల్లా స్థాయి బరిలో సంచలన విజయాలు నమోదు చేసిన ఈ ముగ్గురు క్రీడా రత్నాలు.. ఈ నెల 8, 9 తేదీల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు సమరశంఖం పూరించారు. క్రీడా కిశోరాలపై ప్రశంసల జల్లు! రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాల కీర్తిని నలుదిశలా చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. వెంకటయ్య గౌడ్, ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు) వేణు, ఆనంద్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల్లోని సహజసిద్ధమైన క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, వారిని భావి ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని యాజమాన్యం స్పష్టం చేసింది. రాష్ట్ర స్థాయిలోనూ వీరు పతకాల పంట పండించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించింది

## గణేష్‌నగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం

**శంకర్ పల్లి**
**అక్టోబర్ 06 (వుదయం)**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ రెండవ వార్డు గణేష్ నగర్ లో మంగళవారం మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ రూ. 5.50 లక్షల నిధులతో నిర్మిస్తున్న భూగర్భ మురుగు నీటి కాలువ, సిసి రోడ్ పనులను,

**4 వ వార్డు బుల్కాపురంలో రూ. 6.30 లక్షల మునిసిపల్ నిధులతో నిర్మిస్తున్న భూగర్భ,**

మురుగు నీటి కాలువ పనులను కొబ్బరికాయ కొట్టి లాంచనంగా ప్రారంభించారు.



**ఈ సందర్భంగా చైర్మన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ**

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో పట్టణాలను అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు.

**వార్డు ప్రజలు ఎమ్మెల్యే, చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.**

ఈ కార్యక్రమంలో

**వైస్ చైర్మన్ జాలకంటి శ్వేత పాండురంగారెడ్డి,**

కౌన్సిలర్లు సంధ్యారాణి అశోక్ కుమార్,లలిత మోహనరెడ్డి, డిఈ జగదీష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం.. మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

**-తల్లి బిడ్డ క్షేమం**

**జిన్నారం**
**అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి )**

పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ మహిళకు 108 అంబులెన్స్‌లోనే సిబ్బంది ప్రసవం చేయగా, ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. జిన్నారం మండలం అండూర్ గ్రామానికి చెందిన శివాని (20) మంగళవారం బాధపడటంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. దీంతో గుమ్మడిదల మండలానికి చెందిన 108 సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ కుమారి అంబులెన్స్‌లోనే శివానికి ప్రసవం చేయగా, ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ బిడ్డలను జిన్నారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 పైలట్ అక్షయ్ కుమార్ తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు.

## మాదిగ విద్యార్థుల జాతీయ సమరభేరి

- **రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ**
- **మండల అధ్యక్షులు లింగం సాయి కుమార్ మాదిగ**
- **మున్సిపల్ అధ్యక్షులు కటికే మోహన్ మాదిగ.**

**శంకర్ పల్లి**
**అక్టోబర్ 06(వుదయం)**



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించనున్న

**ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సభకు శంకర్ పల్లి నుండి మాదిగ విద్యార్థి నాయకులు బయలుదేరారు.**

విద్యార్థుల విద్యా, సామాజిక, రాజకీయ సమస్యలపై చర్చించడంతో పాటు, భవిష్యత్‌లో విద్యార్థుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన

**కార్యాచరణపై ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు నాయకులు తెలిపారు.**

యలుదేరిన మాదిగ విద్యార్థి నాయకులు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ శంకర్ పల్లి మండల

**ఇన్చార్జి మండల అధ్యక్షులు లింగం సాయి మాదిగ, శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షులు కటికే మోహన్**

లు మాట్లాడుతూ, విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతూ, విద్యా రంగంలో సమా న అవకాశాలు, సామాజిక న్యాయం,

**నాణ్యమైన విద్య కోసం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.**

జాతీయ స్థాయి ప్రతినిధులతో జరిగే ఈ సదస్సు విద్యార్థి ఉద్యమానికి మరింత దిశానిర్దేశం చేయడంతో పాటు, తెలంగాణలో విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపించేందుకు ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

**శంకర్ పల్లి మండల విద్యార్థి నాయకుల భాగస్వామ్యం విద్యార్థి ఉద్యమానికి నూతన ఉత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.**

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శేరిగూడం అక్షయ్, జి. కిరణ్, అజయ్, రాహుల్, నవీన్, తేజస్, తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట సీఐని కలిసిన అవినాష్

**రామన్నపేట, అక్టోబర్ 6:**
**యాదాద్రి భువనగిరి జిల్లా**

రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ 10వ వార్డు (రంగమ్మగూడెం) కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ వంగాల అవినాష్ సోమవారం రామన్నపేట పోలీస్ స్టేషన్ లో సీఐ మలుగూరి రవి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంగాల అవినాష్ మాట్లాడుతూ, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్ కు న్యాయం కోసం వచ్చే ప్రతి బాధితుడికి, ముఖ్యంగా పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.రామన్నపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజా ప్రతినిధిగా తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వంగాల అవినాష్ అన్నారు.



## ఉమ్మడి మండల కార్యవర్గం ఎన్నిక



**జిన్నారం**
**అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి)**

ఉమ్మడి జిన్నారం మండల శ్రీ వీరభద్ర సౌండ్ అండ్ డెకరేషన్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా దర్గా వీరేశం, ఉపాధ్యక్షులుగా డీజే సతీష్, తలారి శ్రీశైలం, క్యాషియర్‌గా కంజర్ల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా మ్యాదరి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు యూనియన్ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. సౌండ్, డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మున్ని నర్సింలు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ భద్రతపై దృష్టి

**రంగారెడ్డి జిల్లా**

రాజేంద్రనగర్ లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. సాధారణ పరిశీలన కార్యక్రమంలో భాగంగా గోడౌన్ లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గోడౌన్ కు ఏర్పాటు చేసిన సీల్‌స్‌ను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు (BU), కంట్రోల్ యూనిట్లు (CU), వీవీ ప్యాట్ (VVPAT) యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని నిబంధనల ప్రకారం భద్రపరిచిన విధానాన్ని పరిశీలించారు. ఎన్నికల సామగ్రి నిల్వ, నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.గోడౌన్ పరిసరాల్లో భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సీసీటీవీ నిఘా, పోలీసు బందోబస్తు తదితర భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మహిళలు, బాలికల భద్రతపై అవగాహన అవసరం

- **చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షీ టీమ్స్ కార్యక్రమం**

**చేవెళ్ల,అక్టోబర్ 06 (వుదయం)**

మహిళలు, బాలికల భద్రతతో పాటు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చేవెళ్ల షీ టీమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**కళాశాల ప్రిన్సిపాల్ డా.సి. కాంచనలత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు**

అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ హక్కులు, భద్రతా చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**ముఖ్యఅతిథిగా హాజరైన షిటీ టిమ్స్ చేవెళ్ల ఎస్ఐ రాథోడ్ మహిళల భద్రత, వేధింపుల నివారణ,**

అవసరమైన సమయంలో పోలీసుల సహాయం పొందే విధానాలను వివరించారు.

**హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,**

ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించారు.అదేవిధంగా షీ టీమ్ సభ్యురాలు గీత సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత,సైబర్ వేధింపులు,వ్యక్తిగత

**సమాచార రక్షణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.**

సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.




## కొంగరకలాన్‌లో అఖిలపక్ష మహా ధర్నా



- **పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామెన భీమ్ భరత్**

**చేవెళ్ల,అక్టోబర్ 06 (వుదయం)**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీగిరింత పారిజాత నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కొంగర కలాన్‌లోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన అఖిలపక్ష మహా ధర్నా కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామెన భీమ్ భరత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమంలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపు విషయంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినట్లు భీమ్ భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శులు రామ్‌రెడ్డి ,రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు ,మున్సిపల్ అధ్యక్షులు,మాజీ సర్పంచ్‌లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహేందర్ రెడ్డికి రఘునందన్ రావు నివాళులు

**కుటుంబానికి అండగా ఉంటానని హామీ**

**దుబ్బాక, అక్టోబర్ 06, వుదయం:**

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు వెంటనే ఆయన స్వగృహానికి చేరుకున్నారు. మహేందర్ రెడ్డి భౌతికకాయంపై బీజేపీ జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ కోసం మహేందర్ రెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేసుకున్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని, అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మహేందర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

## సిద్దిపేట రెడ్డి జాగృతి కార్యదర్శిగా సంపత్

**నంగనూరు,**
**అక్టోబర్ 6: వుదయం**

సిద్దిపేట జిల్లా రెడ్డి జాగృతి ప్రధాన కార్యదర్శిగా నంగనూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కి రెడ్డి సంపత్ రెడ్డి నియమితులయ్యారు. రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తింగారి మాధవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నాడు. అనంతరం అతడు మాట్లాడుతూ రెడ్డి జాగృతి అభివృద్ధికి, సమాజ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంస్థను మరింత బలోపేతం చేస్తూ, జిల్లాలోని సభ్యులను సమన్వయం చేసుకొని సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని సంపత్ రెడ్డి పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తెంగారి మాధవరెడ్డి కి, నాయకులకు, సభ్యులకు అతను కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ జక్కి రెడ్డి సంపత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## మణిదీప్ గారికి నరేష్ కుమార్ కృతజ్ఞతలు

- **శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం**
- **రూ.60 వేల విలువైన గ్రానైట్‌ను అందించిన మణిదీప్**
- **పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ, అభిషేక పూజలు, అన్నప్రసాద వితరణ**

**శంకర్‌పల్లి,**
**అక్టోబర్ 6 (వుదయం)**

శంకర్‌పల్లి మండల పరిధిలోని సనాతన కాలం నాటి కృష్ణగిరి పాదాల గుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలనే సంకల్పంతో ఆలయ పరిసరాల్లో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

**ఇందులో భాగంగా ఆలయం చుట్టూ విలువైన గ్రానైట్ పనులకు**

మంగళవారం శ్రీకారం చుట్టారు.

**ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నరేష్ కుమార్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.**

ఆలయ అభివృద్ధిలో భాగంగా గుడి చుట్టూ గ్రానైట్ ఏర్పాటు చేయడం ద్వారా ఆలయ పరిసరాలు మరింత సుందరంగా, భక్తులకు సౌకర్యవంతంగా మారనున్నాయి.ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్**

కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్ మిత్రులు, బీజేపీ ఎండోమెంట్ స్టేట్ గౌరవ సభ్యులు మణిదీప్ ఆలయ అభివృద్ధికి రూ.60 వేల విలువైన గ్రానైట్‌ను అందజేశారు.ఈ సహకారానికి నరేష్ కుమార్ మణిదీప్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



**ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.**

సనాతన హిందూ ధర్మ ప్రచారకర్తగా, చందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడిగా ఆర్.నరేష్‌కుమార్ ఈ ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టి ముందుకు తీసుకెళ్తున్న విషయం తెలిసిందే.

**ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి**

తీసుకురావడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమి రోజున కృష్ణగిరి పాదాలగుట్ట వద్ద గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. అలాగే స్వయంగా కృష్ణుని పాదాలకు, శ్రీ రాధాకృష్ణ విగ్రహాలకు అభిషేక పూజలు భక్తుల సమక్షంలో ఉచితంగా నిర్వహిస్తారు.

**పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.**

ఈ కార్యక్రమంలో రావులపల్లి రామలక్ష్మయ్య, ముదిరాజ్ జంగయ్య, భూపతి రెడ్డి, రావులపల్లి రాజు, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.


**IN THE COURT OF THE HON'BLE IV ADDL JUNIOR CIVIL JUDGE CUM XV ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUKATPALLY**
**O.S. No. 106 of 2026**

**Between :**
1. Sri. Deepak Gangadharan 2. Vaibhav Puthusseri Veetil
**...Plaintiff No. 1 & 2**
**AND**
1. Tahasildar, Kukatpally Mandal, Medchal Malkajgiri Dist Telangana State
2. All concerned.
**...Defendants 1 & 2**

**NOTICE**

Whereas the above-named Plaintiffs have filed the above suit seeking a declaration to declare them as the legal heirs of the late P. V. Rekha @ Rekha Puthusseri Veetal, who died on 03.11.2025, leaving behind the Plaintiffs as her sole legal heirs against you and others; and whereas the said suit is pending before this Hon'ble Court and is posted on **15-10-2026** for filing any objections:
Notice is hereby given that if any person(s) have/has any objections, he/she may appear before this Hon'ble Court on **15-10-2026 at 10:30 AM,** either in person or through an advocate, failing which the matter will be heard and decided in accordance with law in your absence

**//BY ORDER OF THE HONBLE COURT//**
**Sd/-**
**Ganne Jyothsna Devi**
**Advocate,**
**Kukatpally. # 9988363333.**



**IN THE COURT OF THE HON'BLE II ADDL. CHIEF JUDGE : CITY CIVIL COURT: : AT: HYDERABAD**
**O.S. NO. 379 OF 2026**

**Between :**
Mrs. Vennapusa Bhavani & others
**Plaintiffs**
**AND**
The Tahsildar,
Khairatabad Mandal & others
**Defendants**
To
All Concerned …
**Defendant No.5**

**NOTICE**

Please take notice that the Plaintiffs herein have filed the above suit against the Defendants for declaration to declare the Plaintiffs are legal heirs of **Late Sri. Vennapusa Koti Sankara Reddy,** S/o. Late Vennapusa Konda Reddy to the Suit Schedule of property, who died intestate on **06-09-2025,** who was the absolute owner and possessor of the below mentioned Schedule properties. The above case is posted to 27-10-2026 for any objection.
Therefore the general public are hereby informed that if anybody having objections, you may appear before the Hon'ble II Addl. District Judge, City Civil Court, at Hyderabad on 27-10-2026 at 10:30 A.M. either in person or through an Advocate, otherwise, the matter will be decided in your absence as exparte.

**SCHEDULE "A" PROPERTY**
All that part and parcel of Residential Flat No. 401, on Fourth Floor, Block-B in Premises bearing Municipal Door NO. 6-3-664/B/401, and (PTIN No. 1100630409) of "PRESTIGE RAI TOWERS" having plinth area of 1547 Sq. feet, and one Car Parking space bearing No. 29, comprising of 170 Sq. feet in Stilt Floor, together with undivided share of land admeasuring 2835.75 Sq. Yards), in premises bearing Municipal No. 6-3-664, situated at SOMAJIGUDA, Hyderabad, under Somajiguda Circle, GHMC Limits, within the Registration District: Hyderabad, Sub-District: Sanjeevareddy Nagar and bounded by:
Boundaries for Flat NO. 401 in Fourth Floor:
NORTH :: Open to Sky
SOUTH :: Open to Sky and Flat No. 402
EAST :: Open to Sky
WEST :: Lobby and Lift
BOUNDARIES FOR ENTIRE LAND
NORTH :: House of Sri Azamuddin Vakil, Door No. 6-3-665 ( presently Urvai Bar & Restaurant)
SOUTH :: Property belonging to Sri. Gilam Ghousuddin,
EAST :: Land belonging to Col Khaja Sayeed
WEST :: Panjagutta Main Road

**SCHEDULE "B" PROPERTY**
(SCHEDULE "A" PROPERTY)
All that piece and parcel of total Flat constructed on land admeasuring Ac. 15-06 guntas, comprising of Ac. 03-30 gts., in Survey No. 184 Part, and Ac. 11.16 gts., in Survey No. 185 Part Situated at NARSINGHI Village Gandipet Revenue Mandal, Ranga Reddy District, under Narsinghi Municipality, within the Registration District: Ranga Reddy District, and Sub-District: Gandipet, and bounded by:-
NORTH :: Nala and Survey No. 285 of Puppalaguda
SOUTH :: Road
EAST :: Survey No 285 of Puppalaguda and Sy. No 186 of Narsingi
WEST :: Ring Road
**(SCHEDULE "B" PROPERTY)**
All that the sell the Semi-finished Villa No. 36 consisting of Ground Floor, First Floor and Second Floor, constructed on Plot No. 36, admeasuring 445.00 Sq. yards, equivalent to 372.06 Sq. Meters, having Plinth area of 5000.00 Square Feet., with R.C.C. Roofing, in Survey Nos. 184/Part and 185/Part, Situated at NARSINGHI VILLAGE, under Narsinghi Municipality, Gandipet Revenue Mandal, Ranga Reddy District, within the Registration District: Ranga Reddy, and Sub-District, Gandipet bounded by:-
NORTH :: Plot No. 37
SOUTH :: Plot No. 35
EAST :: Proposed 12 meters Wide Road
WEST :: Plot No. 48

**SCHEDULE "C" PROPERTY**
(SCHEDULE "A" LAND)
All that piece and parcel of Vacant Land admeasuring 17544 Sq. Yards (14669 Sq. Meters) which is sub-divided into two portions, having area of 5268 sq. Yards in the Northern Portion for Commercial towers and 12,276 Sq. yards in the Southern Portion for Residential Tower Complex Situated in Sy. No. 66/2, Raidurg, Panmaktha Village, Gachibowli, Serilingampally Mandal, R.R. District and bounded by:-
NORTH BY :: Main Road
SOUTH BY:: Land of Roda Mistry College, EAST BY :: Part of Survey No. 66/2
WEST BY :: part of Survey No. 66/2
**(SCHEDULE "B" PROPERTY)**
Residential Flat bearing Flat No. 1502 in the 15th Floor, in the Residential Tower " THE FIRST" admeasuring 6666 Sft., (which is inclusive of common areas ) and proportionate undivided share of Common arrears, common amenities and undivided share of land of 122.76 Sq. Yards out of 12,1276 Sq. Yards of land for the Residential Tower Complex along with 4 number of car parking spaces in the complex and the said Flat after construction shall be bounded as follows:-
NORTH :: Flat No. 1501
SOUTH :: Flat No. 1503,
EAST :: Open to Sky
WEST :: Open to Sky

**SCHEDULE "D" PROPERTY**
(SCHEDULE "A" PROPERTY)
All that the premises bearing Municipal Nos. 7-1-222/B (Part), 7-1-222/B(Part), 7-1-222/B & C and 7-1-222/A, totally admeasuring 1329 Square yards, situated at B.K. Guda, Hyderabad and bounded by:-
NORTH :: Govt. School
SOUTH :: Road
EAST :: Road
WEST :: Pragathi Apartments
**(SCHEDULE "B" PROPERTY)**
All that the Semi-finished Flat No. 404, in Fourth Floor, admeasuring 1900 Square feet, including common areas, along with 50 Square yards of undivided share of land out of total land of 1329 Square yards, in the building complex known as " APURUPA ELEGANCE" being constructed in premises bearing Municipal Nos. 7-1-222/B ( Part), 7-1-222/B ( Part), 7-1-222/B & C and 7-1-222/A, Situated at B.K. Guda, Hyderabad bounded by:-
NORTH :: Corridor and Flat No. 405
SOUTH :: Open to sky
EAST :: Flat No. 403
WEST :: Open to Sky

**SCHEDULE "E" PROPERTY**
All that the Plot No. 97/Part ( South Eastern Part), admeasuring 604.5 Sq. yards or 505.3 Sq. Mtrs., Layout known as "Green Lands", in Survey No.115, Situated at Manchirevula Village & G.P.,Gandipet Mandal, Ranga Reddy District and bounded by:-
NORTH :: Plot No. 97/Part (N/P)
SOUTH :: Plot No. 100,
EAST :: 50' Wide Road
WEST :: Plot No. 98

**//BY ORDER OF THE HON'B LE COURT//**
**Sd/-**
**M/s. P. ANASUYA**
**Advocate,**
**R/o. H.No. 4-9-55/2, Pragathi Nagar Colony, Kuntloor Road, Hayathnagar, R.R.District-501505**
**Cell No. 9701806854.**



" ఒక వైపు ఔషధాల ధరలు ఆకాశాన్నంటుతుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయిస్తూ నీరో చక్రవర్తిలా ప్రవర్తిస్తున్నారు. నియంత్రణ లేని ఔషధ ధరలు దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. మోడీ జోలేతో సహా నిష్క్రమించే సమయం ఆసన్నమైంది. ఔషధాల వాస్తవ కొనుగోలు ధరకు, వాటిపై ముద్రించిన గరిష్ఠ ధరకు పొంతన ఉండటం లేదు. ఉత్తరప్రదేశ్ ఆహార భద్రత, ఔషధ పరిపాలన విభాగం నిర్వహించిన ఇన్‌స్పెక్షన్‌లలో ఈ విషయం వెలుగు చూసింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ఔషధ ధరలు ప్రజలకు మోయలేని భారంగా మారాయి. "

- జైరాం రమేశ్ , కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

## వేమన

అలి మాటలు విని యన్నదమ్ముల బాసి
వేరె పోవువాడు వెఱ్ఱివాడు
కుక్కతోక బట్టి గోదావరీదునా
విశ్వదాభిరామ వినురవేమ



# సంపాదకీయం

## ఓట్ల తొలగింపు రాజ్యాంగబద్ధమేనా?

స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఆ ఎన్నికలను పర్యవేక్షించే రాజ్యాంగబద్ధ సంస్థగా భారత ఎన్నికల సంఘానికి అత్యున్నత స్థానం ఉంది. అయితే, ఇటీవలి పరిణామాలు ఆ సంస్థ విశ్వసనీయతపైనే తీవ్రమైన ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారశైలిపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న సమయంలో వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కూడా ప్రజాస్వామ్య విలువలపై ఆందోళన కలిగిస్తోంది.దశాబ్దాలుగా ఓటు వేస్తున్న పౌరుల పేర్లు 'ఎస్ఐఆర్' పేరిట ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడటం అత్యంత తీవ్రమైన అంశం. ఇరవై, ముప్పై ఏళ్లుగా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగిస్తున్న వ్యక్తి ఒక్కసారిగా ఓటర్ల జాబితాలో ఎందుకు కనిపించకుండా పోయాడు? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం దొరకకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది. మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రముఖుల పేర్లు సైతం ఓటర్ల జాబితాలో కనిపించకపోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఎన్నికల వ్యవస్థలోనే ఏదైనా పెద్ద లోపం ఏర్పడిందా అనే సందేహాలకు ఇది తావిస్తోంది.మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే—ఎన్నికల సంఘంపై వస్తున్న విమర్శలకు ఎన్నికల సంఘమే నేరుగా సమాధానం ఇవ్వాల్సి ఉండగా, ఆ బాధ్యతను అధికారపక్షానికి చెందిన నేతలు తీసుకోవడం. 'ఎస్ఐఆర్' ద్వారా ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారన్న ఆరోపణలకు కూడా ఎన్నికల సంఘం నుంచి సమగ్ర, విశ్వసనీయ వివరణ రావడం లేదు. బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులను గుర్తించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని అధికారపక్ష నేతలు చెబుతున్నారు. అయితే, వాస్తవంగా ఎంతమంది అక్రమ వలసదారులను గుర్తించి ఓటర్ల జాబితాల నుంచి తొలగించారో మాత్రం స్పష్టమైన గణాంకాలు వెల్లడించడం లేదు.డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్ల తొలగింపునే ప్రధానంగా చూపిస్తున్నప్పటికీ, అలాంటి పేర్లు మొత్తం తొలగింపుల్లో రెండు నుంచి ఐదు శాతం మాత్రమేనన్న గణాంకాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకుండా కోట్లాది పేర్లను జాబితాల నుంచి తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం.అక్రమ వలసల అంశాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం అతిశయోక్తిగా ఉపయోగించకూడదు. పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి ఇచ్చిన సమాధానాల్లోనే, సరిహద్దుల్లో అక్రమంగా ప్రవేశించిన బంగ్లాదేశ్ పౌరులను వెనక్కి పంపిన సంఖ్య యూపీఏ ప్రభుత్వ కాలంలోనే ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడయ్యాయి. కాబట్టి అక్రమ వలసదారులను అరికట్టడం అనే లక్ష్యాన్ని ముందుకు తెచ్చి, ఎంతమందికి తమ పేర్లు తొలగించబడిన విషయం తెలియదు? తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు వారికి ఎలాంటి అవకాశం కల్పించారు? రాజ్యాంగం పౌరులందరినీ సమానంగా చూస్తుందని, ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ పౌరులను రెండు వర్గాలుగా విభజించలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.అయితే, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించే అధికారాన్ని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు సమర్థించిన కొద్ది నెలలకే ఈ వ్యాఖ్యలు రావడం కూడా గమనించాలి. ఎన్నికల సంఘానికి చట్టబద్ధమైన అధికారాలు ఉండటం ఒక విషయం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఓటర్ల జాబితాలో మార్పులు చేయడంపై గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఎన్నికలు సమీపించిన సమయంలో ఓటు హక్కును కోల్పోయిన పౌరుడికి న్యాయం జరిగే మార్గం ఎంతవరకు అందుబాటులో ఉంది అన్నదే అసలు ప్రశ్న.ఇదంతా ఎన్నికల కమిషనర్ల మధ్య వ్యక్తిగత విభేదాల ఫలితమేనని, వ్యవస్థలో ఎలాంటి సంస్థాగత సమస్య లేదని చెప్పే ప్రయత్నం కూడా జరుగుతోంది. కానీ ఎన్నికల సంఘంలో విభేదాలు కొత్తేమీ కావు. గతంలోనూ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ఇతర కమిషనర్ల మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలు చోటుచేసుకున్నాయి. కొత్తగా నియమితులైన కమిషనర్లు ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తి అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎన్. శేషన్ తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమను సంప్రదించకుండా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. శేషన్ తన ఆధిపత్యాన్ని సమర్థించుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, రాజ్యాంగబద్ధమైన ఈ సంస్థలోని ప్రతి సభ్యుడికీ సమాన హక్కులు ఉన్నాయని కోర్టు స్పష్టం చేసింది.

ఆ తర్వాత నుంచి మెజారిటీ నిర్ణయానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆనవాయితీగా మారింది.2006లో బెల్జియం ప్రభుత్వం నుంచి 'ఆర్డర్ ఆఫ్ లియోపోల్డ్' అందుకున్నందుకు సోనియా గాంధీకి నోటీసు ఇవ్వాలన్న అప్పటి సీఈసీ ఎన్. గోపాలస్వామి నిర్ణయాన్ని కమిషనర్లు నవీన్ చావ్లా, ఎస్.వై. ఖురేషి వ్యతిరేకించారు. చివరకు మెజారిటీ అభిప్రాయానికే ప్రాధాన్యం లభించింది. అలాగే 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఆరోపణలపై ప్రధాని, హోంమంత్రికి క్లీన్‌చిట్ ఇవ్వడంపై ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా అప్పటి సీఈసీ సునీల్ అరోరాతో విభేదించారు. తన మైనారిటీ అభిప్రాయాలను అధికారికంగా నమోదు చేయకపోతే సమావేశాలకు హాజరుకాబోనని లవాసా పట్టుబట్టడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత

వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే వన్య ప్రాణుల వారోత్సవాల ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ మొదటి వారంలో దినోత్సవాన్ని అంతర్జాతీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు దీన్ని వన్య ప్రాణుల దినోత్సవాన్ని జరుపు తున్నాయి.
వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972,



వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి.అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశంలోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యథేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ వన్య ప్రాణుల దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం.

వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్ లో ఏర్పాటు చేసింది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# ఎన్నికల సంఘంపై ప్రశ్నలు!

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు కేవలం ఓటు వేసే ప్రక్రియ మాత్రమే కాదు. ప్రజల రాజకీయ సంకల్పానికి రాజ్యాంగబద్ధమైన ప్రతిబింబం. అందుకే ఓటర్ల జాబితా స్వచ్ఛంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాథమిక అవసరం. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సుప్రీంకోర్టు తీవ్రంగా పరిశీలన జరపడం, ఆ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలపై ప్రశ్నలు తలెత్తడం సహజంగానే దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది.ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు రాజ్యాంగపరమైన ప్రాధాన్యం ఉంది. అర్హత లేని వ్యక్తుల పేర్లు తొలగించడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకరి పేరు ఒకే చోట మాత్రమే ఉండేలా చూడటం, కొత్తగా అర్హత పొందిన పౌరులను జాబితాలో చేర్చడం వంటి చర్యలు ఎన్నికల పారదర్శకతకు అవసరమే. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగించబడకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. ఎందుకంటే ఓటు హక్కును కోల్పోవడం అంటే కేవలం ఒక జాబితాలో పేరు లేకపోవడం కాదు; అది పౌరుడి ప్రజాస్వామ్య భాగస్వామ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపే విషయం.ఇక్కడే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సుప్రీంకోర్టు పరిశీలన ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఎన్నికల సంఘం తనకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను వినియోగించుకోవడంలో ఎలాంటి సందేహం లేదు
. కానీ అధికారం ఉండటం ఒక విషయం; ఆ అధికారాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నది మరో విషయం. ఎన్నికల సంఘం చర్యలు చట్టబద్ధంగా ఉండటమే కాకుండా, న్యాయబద్ధంగా, పారదర్శకంగా, పౌరులకు అర్థమయ్యే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో సంస్థలపై విశ్వాసం వాటి అధికారాల వల్ల మాత్రమే ఏర్పడదు. వాటి వ్యవహారశైలిలో కనిపించే నిష్పాక్షికత, జవాబుదారీతనం, పారదర్శకత వల్ల ఏర్పడుతుంది.ఈ ప్రత్యేక సవరణ విషయంలో ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్న ఇదే—ఓటర్ల జాబితా సవరణ నిజంగా అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడే విధంగా జరుగుతోందా? లేక పరిపాలనా ప్రక్రియలో ఏర్పడే చిన్నపాటి లోపాలు కూడా ఒక పౌరుడి ఓటు హక్కును ప్రమాదంలోకి నెడుతున్నాయా?
ఒక వ్యక్తి తన పౌరసత్వాన్ని, నివాసాన్ని లేదా ఓటు హక్కును నిరూపించుకోవడానికి పత్రాలు సమర్పించాల్సిన పరిస్థితి వస్తే, ఆ ప్రక్రియ ఎంత సులభంగా ఉందన్నది కూడా పరిశీలించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వృద్ధులు, పేదలు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు లేదా అవసరమైన పత్రాలు సక్రమంగా లేని కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నప్పటికీ ప్రతి పౌరుడికి సమానమైన సాంకేతిక సౌకర్యం ఉందని భావించడం వాస్తవికం కాదు. అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పరిపాలనా సామర్థ్యంతో పాటు మానవీయ దృక్పథం కూడా అవసరం.అర్హుడైన ఓటరు పేరు తొలగించడం అంత సులభమైన ప్రక్రియగా ఉండకూడదు. ఒకరి పేరు జాబితాలో లేకపోతే, ఆ వ్యక్తికి తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసుకునే అవకాశం ఉండాలి. పేరు ఎందుకు తొలగించబడిందో స్పష్టంగా తెలియజేయాలి. అవసరమైన పత్రాలు సమర్పించడానికి తగిన సమయం ఇవ్వాలి. అభ్యంతరాన్ని దాఖలు చేసుకునే అవకాశం, పునఃపరిశీలనకు అవకాశం, నిర్ణయంపై అప్పీలు చేసుకునే అవకాశం అందుబాటులో ఉండాలి. ఈ రక్షణాత్మక విధానాలు లేకుండా భారీ స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం ప్రజాస్వామ్య విశ్వాసానికి దెబ్బతీయవచ్చు.

మరో ముఖ్యమైన అంశం—ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజల్లో ఎలాంటి అనుమానం కలగకూడదు. ఎన్నికల సంఘం ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరిస్తోందనే భావన ఏర్పడటం సంస్థ ప్రతిష్ఠకు ప్రమాదకరం. వాస్తవానికి ఎన్నికల సంఘం నిర్ణయం చట్టబద్ధమైనదైనా, దాని ప్రక్రియలో తగినంత పారదర్శకత లేకపోతే ప్రజల్లో అనుమానాలు పెరగవచ్చు. అందువల్ల ప్రతి నిర్ణయానికి తగిన వివరణ, గణాంకాలు, ప్రక్రియకు సంబంధించిన వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండటం అత్యవసరం. ఇక్కడ సుప్రీంకోర్టు పాత్ర కూడా అత్యంత కీలకం. ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్ష పరిపాలనా బాధ్యత ఎన్నికల సంఘానిదే అయినప్పటికీ, రాజ్యాంగ పరిరక్షణకు న్యాయవ్యవస్థ చివరి కాపలాదారుగా నిలుస్తుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర

> ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు రాజ్యాంగపరమైన ప్రాధాన్యం ఉంది. అర్హత లేని వ్యక్తుల పేర్లు తొలగించడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకరి పేరు ఒకే చోట మాత్రమే ఉండేలా చూడటం, కొత్తగా అర్హత పొందిన పౌరులను జాబితాలో చేర్చడం వంటి చర్యలు ఎన్నికల పారదర్శకతకు అవసరమే. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగించబడకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. ఎందుకంటే ఓటు హక్కును కోల్పోవడం అంటే కేవలం ఒక జాబితాలో పేరు లేకపోవడం కాదు; అది పౌరుడి ప్రజాస్వామ్య భాగస్వామ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపే విషయం.

సవరణపై సుప్రీంకోర్టు ప్రశ్నలు లేవనెత్తడం ఎన్నికల సంఘం స్వాతంత్ర్యాన్ని బలహీనపరచడానికి కాదు. ఆ స్వాతంత్ర్యం రాజ్యాంగ పరిమితుల్లో, పౌరుల హక్కులను కాపాడే విధంగా వినియోగించబడుతోందా అనే విషయాన్ని నిర్ధారించడానికే. అయితే ఈ అంశాన్ని రాజకీయ కళ్లజోడుతో మాత్రమే చూడటం కూడా ప్రమాదకరం. ఎన్నికల సంఘంపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ అది ఒక రాజకీయ పార్టీకి అనుకూలం లేదా ప్రతికూలం అని ముద్ర వేయడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ఎన్నికల సంఘం చేసే ప్రతి చర్యను ప్రశ్నించరానిదిగా భావించడం కూడా ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదు. సంస్థలపై గౌరవం అంటే వాటిని విమర్శించకపోవడం కాదు; వాటి పనితీరును ఆధారాలతో, రాజ్యాంగ ప్రమాణాలతో పరిశీలించడం.ఓటర్ల జాబితా సవరణలో మరో ముఖ్యమైన అంశం—కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పౌర సమాజం మధ్య సమన్వయం. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం పెరగాలంటే అన్ని వర్గాలకు సమాచారం సమానంగా అందాలి. గ్రామం, పట్టణం, వార్డు, పోలింగ్ కేంద్రం స్థాయిలో జరిగే చర్యలు కూడా పరిశీలనకు అందుబాటులో ఉండాలి. తుది జాబితా వెలువడిన తర్వాత తొలగింపుల సంఖ్య, వాటికి గల కారణాలు, అభ్యంతరాల పరిష్కార వివరాలు వంటి అంశాలను పారదర్శకంగా వెల్లడించడం ద్వారా అనేక అనుమానాలను నివృత్తి చేయవచ్చు.ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా ఒక పరిపాలనా పత్రం మాత్రమే కాదు. అది ప్రజల రాజకీయ అస్తిత్వానికి సంబంధించిన ముఖ్యమైన పత్రం. అందులో పేరు ఉండటం ద్వారా ఒక పౌరుడు తన ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోగలుగుతాడు. కాబట్టి ఒక పేరు తొలగించేటప్పుడు చూపే జాగ్రత్త, ఒక పేరు చేర్చేటప్పుడు చూపే జాగ్రత్తకంటే తక్కువగా ఉండకూడదు.ఎన్నికల సంఘం కూడా ఈ పరిణామాలను ఒక అవకాశంగా చూడాలి. సుప్రీంకోర్టు ప్రశ్నలను సంస్థపై దాడిగా కాకుండా, ఎన్నికల ప్రక్రియను మరింత బలపరిచే సూచనలుగా స్వీకరించాలి. ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన పత్రాలు, పేర్ల తొలగింపునకు వర్తించే ప్రమాణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అవసరమైతే స్వతంత్ర పరిశీలనకు, బహుళస్థాయి పర్యవేక్షణకు కూడా అవకాశం కల్పించాలి.చివరికి, ఎన్నికల విశ్వసనీయత కేవలం ఎన్నికల రోజున జరిగే పోలింగ్‌తో నిర్ణయించబడదు. ఓటర్ల జాబితా తయారీ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం ఉండాలి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సుప్రీంకోర్టు పరిశీలన ఈ మూడు విలువలను మరోసారి ముందుకు తెచ్చింది.భారత ప్రజాస్వామ్యం ఎన్నో పరీక్షలను ఎదుర్కొని నిలబడింది. దాని బలం ఎన్నికల సంఘంలోనే కాదు
, ప్రజల్లోని విశ్వాసంలో ఉంది. ఆ విశ్వాసాన్ని కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత మాత్రమే కాదు; రాజకీయ పార్టీలు, న్యాయవ్యవస్థ, ప్రసార మాధ్యమాలు, పౌర సమాజం అందరి బాధ్యత. అర్హుడైన ఒక్క ఓటరు కూడా అన్యాయంగా తన హక్కును కోల్పోకూడదు. అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదు. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతే నిజమైన ఎన్నికల సంస్కరణకు ప్రమాణం.అందుకే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జరుగుతున్న న్యాయపరమైన పరిశీలనను వివాదంగా కాకుండా భారత ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, రాజ్యాంగబద్ధంగా తీర్చిదిద్దే అవకాశంగా చూడాలి. ప్రజాస్వామ్యంలో గెలుపు -ఓటముల కంటే గొప్పది ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసానికి ఎలాంటి అనుమానం కలగకుండా ఎన్నికల వ్యవస్థ పనిచేయడం ప్రతి రాజ్యాంగ సంస్థకు అత్యున్నత బాధ్యత.ఓటు హక్కు అనేది ఒక సాధారణ హక్కు కాదు; ప్రజాస్వామ్యంలో పౌరుడి స్వరానికి ప్రతీక. ఆ స్వరం జాబితాలోనే కనిపించకపోతే, ఎన్నికల ప్రక్రియ ఎంత సమర్థంగా జరిగినా దాని ప్రయోజనం ప్రశ్నార్థకమవుతుంది. అందువల్ల ప్రతి అర్హుడైన పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూడటం, అనర్హుల పేర్లను న్యాయబద్ధమైన విధానంలో తొలగించడం, ప్రతి నిర్ణయానికి సముచితమైన కారణాన్ని వెల్లడించడం— ఇవే ఎన్నికల సంఘం విశ్వసనీయతకు అసలు పరీక్ష. సుప్రీంకోర్టు పరిశీలన ఆ పరీక్షను మరింత కఠినతరం చేస్తే, చివరికి లాభపడేది ప్రజాస్వామ్యమే.



తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి
9948439565

# ఆత్మగౌరవమే కిరీటం

ఒక సమాజం సాధించిన
ప్రగతిని
ఆ సమాజంలో మహిళలు
సాధించిన పురోగతిని బట్టి
నేను
కొలుస్తాను .ఆత్మగౌరవమే
మనిషికి
అత్యంత అవసరమైనది.
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.
ఆకాశమంత అందం ఉన్న
ఆత్మగౌరవం లేకుంటే శూన్యం
కోట్ల ఆస్తులు కూడా పెట్టినా
ఆత్మవిశ్వాసం లేకుంటే వ్యర్థం
స్త్రీ అయినా పురుషుడైన ఒకటే
ఎవరి ఆత్మగౌరవం వారికే
మకుటం
ఒకరినొకరు
గౌరవించుకున్నప్పుడే
సంసార సాగరం అవుతుంది
అమృతం
ఇల్లాలుగా ఇంతి ఇచ్చే గౌరవం
యజమానిగా పురుషుడు
చూపే ఆదరణ ఈ రెండింటి
కలయికే సంస్కారం అదే ప్రతి
కుటుంబానికి మూలాదారం
పిల్లలకి ఆత్మ స్థైర్యం నేర్పేది ఇల్లే
ఆత్మగౌరవ పాఠాలుదిద్దేది
అమ్మ
నాన్నలే
తలవంచకుండా బ్రతకడం
నేర్పేధి
కుటుంబమే
సమాజంలో మన వ్యక్తిత్వానికి
నిలువెత్తు అద్దం ఆత్మగౌరవం
కష్టాలుఎదురైన కనులు
చెమ్మగిల్లినా
కుటుంబం అండతో నిలబడు
ధైర్యంగా ముందుకు సాగు
నీ గమ్యాన్ని చేరుకో
నీ ఆత్మ గౌరవమే నీకు
శ్రీరామరక్ష
అదే నీ ప్రగతికి అసలైన
నిర్వచనం
ధనంపోతే సంపాదించవచ్చు.
ఆత్మగౌరవం పోతే తిరిగిరాదు.
స్త్రీ పురుషుల పరస్పర గౌరవమే
కుటుంబ వ్యవస్థకు పునాది.
కుటుంబంలో ప్రతి ఒక్కరి
ఆత్మగౌరానికి విలువ
ఉన్నప్పుడే ఆ ఇల్లు ఆనందాల
హరివిల్లు.
ఎవరికోసమో నీ విలువను
తగ్గించుకోకు ఆత్మగౌరవమే
నీఅడుగులకు బలం.
నీవ్యక్తిత్వమే నీబలగం
అదే నీ కుటుంబానికి కిరీటం.
తలవంచకు సమాజంలో
నీవ్యక్తిత్వాన్ని సగర్వంగా
చాటుకో అపుడే చరిత్రలో
నూతన ఒరవడికి సారధివై
ఆత్మగౌరవమే ఆలంభణగా
వికసిత్ భారత్ లక్ష్యసాధనకు
ఉద్యమించాలి.



నేదునూరి కనకయ్య
9440245771

# జాతీయం-అంతర్జాతీయం

## రష్యా చమురు సామర్థ్యం సగానికి

**కీవ్**

పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచాన్ని చమురు సంక్షోభం చుట్టుముడుతోంది. ఇప్పటికే ఐదో వంతు చమురు, గ్యాస్ ఉత్పత్తి రవాణాకు ఆటంకం కలిగి.. ధరలు భారీగా పెరగడంతో అనేక దేశాల్లో చమురు కొరత ఏర్పడుతోంది.

**మరోవైపు కీలక చమురు ఉత్పత్తిదారు అయిన రష్యాలోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా**

ఉక్రెయిన్ (Ukraine) దాడులు కొనసాగిస్తోంది. నాలుగేళ్లుగా ఇరుదేశాల మధ్య జరుగుతోన్న యుద్ధం కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం 50 శాతం ధ్వంసమైనట్లు తాజాగా ఉక్రెయిన్ వెల్లడించింది. దీనివల్ల ఇంధన ఎగుమతిదారు అయిన మాస్కో ఇతర దేశాల



నుంచి చమురును దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తినట్లు తెలిపింది.

**నాలుగేళ్లుగా తాము కొనసాగిస్తోన్న సుదూర దాడులు సగానికి పైగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యాన్ని నిర్వీర్యం చేశాయని ఉక్రెయిన్ తెలిపింది.**

ఇతర దేశాలకు ఇంధనాన్ని సరఫరా చేసే వ్యవస్థలకు ఆటంకం కలిగించాయని పేర్కొంది. మాస్కో, యారోస్లావ్ల్, ఉస్ట్ లుగా, పెర్మ్ వంటి నగరాల్లోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఇటీవల చేసిన దాడుల వల్ల సగానికి పైగా చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతిందని వెల్లడించింది.

**ఇది తమ శత్రువు ఆర్థిక వ్యవస్థకు, దురాక్రమణ సామర్థ్యానికి కోలుకోలేని దెబ్బ అని అభివర్ణించింది.**

**ఇంధన సంక్షోభం..మాస్కోలోని అనేక చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ పదేపదే**

దాడులు చేస్తుండడంతో ఈ ఏడాది ప్రారంభం నుంచే రష్యాలో ఇంధన సంక్షోభం (Fuel crisis) తలెత్తింది. దీంతో అధికారులు గ్యాసోలిన్ అమ్మకాలను పరిమితం చేయాల్సి వచ్చింది. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజుల్లో..

**కొన్ని సంబర్భాల్లో ఇంధనం కోసం ప్రజలు కిలోమీటర్లు మేర బారులు తీరాల్సిన పరిస్థితులు తలెత్తాయి.**

అయితే యుద్ధం కారణంగా దేశ చమురు మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టం గురించి రష్యా ఎలాంటి డేటాను బహిరంగంగా వెల్లడించలేదు. ఈ దాడుల వల్ల తమ స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 1 శాతం మాత్రమే నష్టం వాటిల్లిందని గతేడాది పుతిన్ పేర్కొన్నారు. తమ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం వారికి సాధ్యం కాదని అన్నారు.

**జీవాయుధాలపై రష్యా ప్రయోగాలు? ప్లేగు బ్యాక్టీరియా లీక్‌తో భయాలుప్రభుత్వ**

సబ్సిడీ పెరుగుదలచమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు కొనసాగిస్తుండడంతో గత నెలలో రష్యా కీలక చర్యలు తీసుకుంది. దేశీయ మార్కెట్‌కు ఇంధన సరఫరా చేసే చమురు కంపెనీలకు నాలుగేళ్లలో అతిపెద్ద సబ్సిడీ (Subsidy)ని ప్రకటించింది. రష్యా ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్‌లో సబ్సిడీల మొత్తం 3.6 బిలియన్ డాలర్లుగా ఉంది. ఏప్రిల్ 2022 నాటి రికార్డు తర్వాత ఇదే అత్యధిక చెల్లింపు.

## 30 టన్నుల ఇంధనం వేస్ట్

**లండన్:**

బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. అది గాల్లో అత్యంత ప్రమాదకర స్థితిలో ప్రయాణించినట్లు అధికారులు వెల్లడించారు. విమానం లండన్ నుంచి షికాగోకు బయల్దేరిన గంట తర్వాత ఐర్లాండ్ మీదుగా గాల్లో 37,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు అందులో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు.

**దీంతో వెంటనే ఎమర్జెన్సీ కోడ్ 7700ను రిలీజ్ చేశారు.**

అప్పటికే సాంకేతిక సమస్య కారణంగా విమానం వేగంగా కిందకు దిగుతూ.. ఒక్కసారిగా 28,000 అడుగుల మేర కిందకు పడిపోయింది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం (2,722 అడుగులు) బుర్జ్ ఖలీఫా కంటే 10 రెట్లు ఎక్కువ. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్ (1,024 అడుగులు) కంటే 27 రెట్లు ఎక్కువ.విమానం వేగంగా కిందకు దూసుకురావడంతో..

**భారీ కుదుపులకు లోనైంది. ఈ ధాటికి విమానంలోని క్యాబిన్లు**





తెరుచుకొని ఆక్సిజన్ మాస్కులు ప్రయాణికులపై పడ్డాయి.

**దీంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు.**

విమానంలో ఇంధనం నిండుగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తే ప్రమాదానికి అవకాశం ఉండడంతో పైలట్లు

**వెంటనే అప్రమత్తమయ్యారు. ఇంగ్లిష్ ఛానల్‌పై 9,000 అడుగుల ఎత్తులో నాలుగు గంటల 47 నిమిషాల**

పాటు విమానం చక్కర్లు కొట్టింది. అలా 30టన్నుల ఇంధనాన్ని గాల్లోకి డంప్ చేసిన అనంతరం వెనక్కి మళ్లించి.. హీత్రూ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను దింపేసి, విమానాన్ని పరీక్షలకు తరలించారు. అయితే ఇందులో తలెత్తిన సమస్య ఏంటనే విషయాన్ని మాత్రం ఎయిర్‌లైన్స్ వెల్లడించలేదు.ఉగ్రదాడి భయం.. యూకే వీడిన అమెరికా బాంబర్లుఘటన సమయంలో

**విమానంలో 180 మంది ప్రయాణికులు, సిబ్బంది**

ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తిన విషయం తెలిసిందే.

**ఈ సమయంలో బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలోనూ అత్యవసర పరిస్థితి తలెత్తడంతో అధికారులు**

అప్రమత్తమయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## స్విట్జర్లాండ్ అధ్యక్షుడికి భారతీయ చీజ్‌లు

**స్విట్జర్లాండ్**

- **మోదీ గిఫ్ట్ ప్రత్యేకతలు తెలుసా?**

అధ్యక్షుడు గయ్ పార్మెలిన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ(Narendra Modi) ప్రత్యేక బహుమతి ఇచ్చారు. భారత్‌కు చెందిన మూడు రకాల చీజ్ (cheese)లను అందించారు. గుల్మార్గ్, కోణార్క్, యెయూర్ చీజ్‌లను దిల్లీలో జరిగిన భేటీలో అందజేశారు. ప్రపంచవ్యాప్తంగా చీజ్‌లు అనగానే మొదట గుర్తొచ్చే దేశం స్విట్జర్లాండ్(Switzerland). ఈ క్రమంలో ఆ దేశ అధ్యక్షుడికి మోదీ స్వదేశీ చీజ్‌లు అందించడం ప్రాధాన్యం సంచరించుకుంది. భారతదేశంలో అభివృద్ధి చెందుతోన్న సాంప్రదాయ చీజ్ తయారీకి ఇవి నిదర్శనమని మోదీ పేర్కొన్నారు.గుల్మార్గ్ (Gulmarg) ఫ్రెంచ్ శైలిలో ఉండే చీజ్. పాశ్చరైజ్ చేసిన ఆవు పాలతో దీనిని తయారు చేస్తారు.

**2026లో బ్రెజిల్‌లో జరిగిన పోటీల్లో దీనికి 'సూపర్ గోల్డ్' అవార్డు లభించింది.**

ఇక కోణార్క్ (Konark) ఫ్రెంచ్ టామ్ తరహా చీజ్. సహజమైన పైపొర, మృదువైన ఆకృతి,

**నిమ్మలాంటి రుచి దీని ప్రత్యేకత. 2023లో నార్వేలో జరిగిన వరల్డ్ చీజ్ అవార్డ్‌స్‌లో గోల్డ్,**



2025లో స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన పోటీల్లో సిల్వర్ అవార్డును సొంతం చేసుకుంది. మూడోది యెయూర్(Yeoor)..

**స్విస్ గ్రుయెర్ చీజ్ స్ఫూర్తితో తయారుచేసిన మౌంటెయిన్ తరహా చీజ్ ఇది.**

ఎనిమిది నుంచి తొమ్మిది నెలల పాటు దీనిని పక్వానికి ఉంచుతారు. ఇవే కాకుండా కశ్మీరీ వాల్‌నట్ చెక్కతో తయారు చేసిన గోడ ప్యానెల్‌నూ పార్మెలిన్‌కు మోదీ బహూకరించారు.

**'యాప్' ఆధారిత రవాణాలో మహిళా ప్రయాణికుల భద్రతపై జాగ్రత్తఈ నేపథ్యంలో స్విస్ అధ్యక్షుడు..**

ప్రధాని మోదీకి ఆ దేశ సాంప్రదాయ వాయిద్యమైన 'ఆల్ఫోర్న్' (Alphorn)ను బహుమతిగా ఇచ్చారు. ఈ ప్రత్యేకమైన వాయిద్యంపై భారత్, స్విట్జర్లాండ్ దేశాల జాతీయ జెండాలు ముద్రించి ఉన్నాయి. ప్రధాని మోదీ ఈ వాయిద్యాన్ని స్వయంగా ఊదారు.

## జ్ఞానేశ్ రాజీనామాకు దిల్లీ దాడి

**న్యూఢిల్లీ**

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని దిల్లీలో ఇండియా కూటమి నేతల నినాదాలు హోరెత్తాయి. మంగళవారం ఉదయం ఇండియా కూటమి నేతలు పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎన్నికల సంఘం (EC) కార్యాలయం (నిర్వాచన్ సదన్) దిశగా ర్యాలీ ప్రారంభించారు.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ.. సేవ్ డెమొక్రసీ బ్యానర్లను ప్రదర్శించారు.**

ఈ ఆందోళనల దృష్ట్యా భారీగా భద్రతాసిబ్బందిని మోహరించారు. ఆకాశవాణి భవన్ వద్ద బారికేడ్లను అడ్డుపెట్టి ఎంపీలను పోలీసులు నిలువరించారు. దాంతో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకాగాంధీ రోడ్డుపై బైఠాయించారు. ఆ తర్వాత బా





రికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండా చేతపట్టుకొని రాహుల్ గాంధీ నిరసన తెలిపారు.

**దీంతో రాహుల్, ప్రియాంకా గాంధీ సహా నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**

విపక్ష ఎంపీలను తరలిస్తోన్న బస్సును పలువురు కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో నేతలను కొద్దిదూరం తీసుకెళ్లిన తర్వాత పోలీసులు బస్సు నుంచి బయటకు పంపించారు. ప్రస్తుతం రాహుల్, ప్రియాంక ఆకాశవాణి భవన్ వద్ద ఉన్నారు.నిరసనకారులు హింసకు దిగితే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించాలా?:

**దిల్లీ హైకోర్టు"జ్ఞానేశ్ ఇక చాలు.. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది"**

అని ర్యాలీ వీడియోను రాహుల్ షేర్ చేశారు. డీఎంకే, ఆమ్‌ఆద్మీపార్టీ ఈ నిరసనల్లో పాల్గొనలేదు.

## కామాంధుడికే ప్రమోషన్

**న్యూఢిల్లీ:**

మహిళలను ఉద్ధరిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న బిజెపి ప్రభుత్వం మహిళా జర్నలిస్టును లైంగికంగా వేధించిన ఢిల్లీ ఎసిపి వివేక్ భగత్‌కు డిసిపిగా ఉద్యోగోన్నతి కల్పించింది. సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలను ప్రసారం చేస్తున్న మహిళా జర్నలిస్టును భగత్ మూడు రోజుల క్రితమే లైంగికంగా వేధించారు.

**దీంతో ఆమె ప్రజాసంఘాలు, సిజెపి మద్దతుతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసుల స్టేషన్**

వద్ద ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ధర్నా నిర్వహించారు. వీడియోలు లేకపోతే కేసు నమోదు చేయబోమని ఢిల్లీ పోలీసులు చెప్పారు.

**బాధితురాలితోసహా 16 మందిని ఆదివారం**

అదుపులోకి తీసుకున్నా రు. తాజాగా



ర్ణయాన్ని సిపిఎం, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) తీవ్రంగా తప్పుబట్టాయి.

**"వేధింపుల ఆరోపణ తర్వాత ప్రమోషన్ వచ్చే వ్యవస్థలో మనం జీవిస్తున్నామా?"**

అని సిజెపి ప్రశ్నించింది. కేంద్ర హోంశాఖ తన నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. 'ఇది మహిళా జర్నలిస్టులకు ఎలాంటి సందేశం ఇస్తోంది? ప్రభుత్వ అధికారం తన మనుషులనే కాపాడుతుందనా?" అని ప్రశ్నించింది.

## మళ్లీ ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్

**న్యూయార్క్:**

ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ సంపద మళ్లీ ట్రిలియన్ డాలర్లకు చేరింది.

**బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం సోమవారం ఒక్కరోజే మస్క్ సంపద 65 బిలియన్ డాలర్లు పెరిగి 1.04**

ట్రిలియన్ డాలర్లకు చేరింది. స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల షేర్ల విలువ పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. అక్టోబర్ ప్రారంభం నుంచి స్పేస్‌ఎక్స్ షేర్లు 13 శాతం, టెస్లా షేర్లు 6.7 శాతం మేర పెరిగాయి.

**దీంతో మూడు నెలల తర్వాత మస్క్ సంపద మళ్లీ 13 అంకెల స్థాయికి చేరింది.**

జూన్‌లో స్పేస్‌ఎక్స్ రికార్డు స్థాయి ఐపీఓతో షేర్ల విలువ భారీగా పెరగడంతో మస్క్ తొలిసారిగా.



ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచారు. **అయితే ఆ తర్వాత కంపెనీ అధిక విలువపై ఆందోళనలు వ్యక్తం కావడంతో షేర్లు క్షీణించి ఆయన సంపద తగ్గింది.**

తాజాగా స్పేస్‌ఎక్స్, టెస్లా సంస్థలపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగడంతో మస్క్ సంపదకు మళ్లీ రెక్కలొచ్చాయి. స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటెలిజెన్స్ రంగాల్లో స్పేస్‌ఎక్స్‌కు మంచి అవకాశాలున్నాయని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషకులు పేర్కొన్నారు.

**గత వారం టెస్లా మూడో త్రైమాసిక అమ్మకాలు కూడా అంచనాలను మించాయి.**

మస్క్ మొత్తం సంపదలో 98 శాతానికి పైగా స్పేస్‌ఎక్స్, టెస్లాలోని వాటాల నుంచే వస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

## ఉక్రెయిన్ జీవనాడిపై రష్యా దెబ్బ

**కీవ్**

నాలుగేళ్లుగా రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతోన్న నేపథ్యంలో ఉక్రెయిన్ తమ దేశంలో పౌర విమాన సేవలను పూర్తిగా నిలిపివేసింది. క్షిపణి, డ్రోన్ దాడులు జరిగే అవకాశం ఉండడంతో యుద్ధం మొదలైనప్పటి నుంచి రవాణా కోసం అక్కడి ప్రజలు బస్సులు, రైలు సర్వీసులనే వినియోగిస్తున్నారు. అధికారిక పర్యటనకు వచ్చే విదేశీ నేతలు సైతం రైళ్లలోనే ప్రయాణిస్తారు. దీంతో కీవ్‌లోని కీలక కర్మాగారాలు, ఓడరేవులు, వంతెనలతో పాటు రైలు సర్వీసులను కూడా మాస్కో తరచూ లక్ష్యంగా చేసుకుంటోంది.

**ఈ దాడుల్లో వందలాది లోకోమోటివ్‌లు (రైలు ఇంజిన్లు) ధ్వంసమయ్యాయి.**

దీంతో ఇప్పటికే యుద్ధంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌పై రవాణా వ్యవస్థ పరంగానూ మరింత భారం పడుతోంది.ఓడరేవులు ధ్వంసమవ్వడం వల్ల సముద్ర వాణిజ్యంపైనా ప్రభావం పడుతోంది.

**ధాన్యం, ఇనుప ఖనిజం, ఇతర సరకులను దేశంలోని ఉత్పత్తి కేంద్రాల నుంచి ఓడరేవులకు**

రవాణా చేయడానికి తగినన్ని రైళ్లు లేకపోవడంతో వ్యాపారాలు స్తంభించిపోతున్నాయి. ఉక్రెయిన్ ప్రధాన సముద్ర మార్గాలలో ఒకటైన పివ్డెన్నీ ఓడరేవు పరిసరాల్లో ఈ అత్యవసర పరిస్థితి స్పష్టంగా



కనిపిస్తోంది. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థలో నల్ల సముద్ర ఓడరేవుల పాత్ర కీలకం.

**యుద్ధం ప్రారంభమవ్వడానికి ముందు దేశంలోని అత్యధిక ధాన్యం ఎగుమతులను ఈ ఓడరేవుల నుంచే నిర్వహించేవారు.**

వాటిపై తరచూ దాడులు జరుగుతుండడంతో ఓడరేవుల మౌలిక సదుపాయాలు, వ్యవసాయ క్షేత్రాలు, పారిశ్రామిక ప్రాంతాలను తీరానికి కలిపే మార్గాలు ధ్వంసమయ్యాయి.

**దీంతో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు తగ్గిపోవడంతో రైతులు,**

ఎగుమతిదారులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. రష్యా దాడులకు భయపడి దేశంలోని పలు కీలక మైనింగ్, ఉక్కు కర్మాగారాలు

**తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నాయి.**

దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఉపాధి కోల్పోతున్నారు.రష్యా చమురు శుద్ధి సామర్థ్యం 50 శాతం ధ్వంసం: ఉక్రెయిన్‌సరిహద్దుల్లోనే కాకుండా నగరాలలో కూడా రైళ్లను రష్యా వదలట్లేదని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. కదులుతున్న రైళ్లపై దాడులు చేసేందుకు జెట్‌పవర్డ్ డ్రోన్‌లను మోహరిస్తున్నట్లు తెలిపింది. తమ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు వాటిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ సాధ్యం కావట్లేదని పేర్కొంది. రష్యా దాడుల్లో తమ కంపెనీ టెర్మినల్ పరిసరాల్లో మూడు లోకోమోటివ్‌లు ధ్వంసమయ్యాయని పోర్ట్ ఆపరేటర్ టీఐఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మైకిటా ఫ్రూబోవ్ పేర్కొన్నారు.

**ప్రతినెలా డజన్ల కొద్దీ లోకోమోటివ్‌లను కోల్పోతున్నామని ఉక్రెయిన్ రైల్వే వెల్లడించింది.**

దీంతో మరిన్ని అదనపు లోకోమోటివ్ ఇంజిన్ల కోసం ఉక్రెయిన్ యూరప్ దేశాలతో చర్చలు జరుపుతోంది.

## సిఇసి తక్షణ రాజీనామా... 'ఇండియా' బలోపేతం!

- **వెనకబడిన వర్గాల ఓట్లు**
- **తొలగించేందుకే ఎస్ఐఆర్**
- **హిందూ ఇంటర్వ్యూలో ఎం ఎ బేబీ**

**న్యూఢిల్లీ :**

ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ సోమవారం డిమాండ్ చేశారు. ఆ పదవినే పట్టుకుని వేలాడడం వల్ల ఆయన 'బాస్‌లకు' కూడా నష్టం కలుగుతుందని వ్యాఖ్యానించారు.

**వామపక్షాలు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐతో సహా వాటి ప్రజా సంఘాలు,ఇంకా ఇతర పార్టీలు,**

సంఘాలు విస్తృతంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ ఇప్పటికే రాజీనామా చేసి వుండాల్సిందని బేబీ పేర్కొన్నారు. ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎస్ఐఆర్ ముసుగులో ఓటు హక్కును లాక్కున్నారు..

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముసుగులో 13కోట్ల మంది**

ఓటింగ్ హక్కులను జ్ఞానేష్ కుమార్ లాక్కున్నారని బేబీ విమర్శించారు. మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబాటు వర్గాలకు చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించేందుకే ఈ ఎస్ఐఆర్ ఉద్దేశించిందని ఆయన విమర్శించారు.

**"ఓటు వేసే హక్కు ఏ ప్రజాస్వామ్యంలోనైనా పవిత్రమైన హక్కు.**

ఓటు వేసే హక్కును సాధించుకున్నపుడే ఆ పౌరుడు సంపూర్ణ పౌరుడుగా మారతాడు.

**దాన్ని తిరస్కరించడమన్నది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా చేసే నేరం వంటిది." అని బేబీ వ్యాఖ్యానించారు.**

"ఇవిఎంలను తారుమారు చేయవచ్చని, ప్రజా తీర్పును నాశనం చేయడానికి అటువంటి పద్ధతులకు పాల్పడతారని ప్రజల్లో ఒక నమ్మకం నెలకొని వుంది.

**ఈ సమయంలో వంద శాతం వివిపిఎటి (ఓటర్ ధృవీకరించిన**

పేపర్ ఆడిట్ (ట్రయల్) ఒక పరిష్కార మార్గాన్ని అందచేస్తుందని గుర్తించదని. కానీ దాన్ని సక్రమంగా చేయడం లేదు.'' అని ఆయన పేర్కొన్నారు.

**పశ్చిమ బెంగాల్‌లోనూ, దేశంలోని**



**ఇతర ప్రాంతాల్లోనూ సిపిఎం మళ్ళీ బలాన్ని పుంజుకోగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.**

"పశ్చిమ బెంగాల్‌లో కోలుకునే క్రమంలో వున్నాం. త్వరలో ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, పంజాబ్, గోవాలపై కూడా దృష్టి సారించనున్నాం. ఆయా రాష్ట్రాల్లో బిజెపిని ఓడించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో సిపిఎం చర్చలు జరుపుతుందని చెప్పారు.

**"ప్రస్తుతమున్న పరిస్థితుల్లో, ఇండియా బ్లాక్‌ను బలోపేతం చేయడం, క్రియాశీలం చేయడం ముఖ్యం.**

దేశంలో వయోజన ఓటు హక్కు వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు భావసారూప్యతా పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు చేతులు కలపాలి.

**ప్రజా రంగంలోని మేథావులు, కళాకారులు, రచయితలు, ఇతర ప్రముఖుల మద్దతు**

కూడా ఈ లక్ష్యసాధనకు అవసరమని ఇండియా బ్లాక్ భావిస్తోంది.'' అని బేబీ పేర్కొన్నారు.

## సూపరింటెండెంట్ అగ్రహం: విద్యార్థులకు సగం గుండు

**ముంబయి :**

మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో హెయిర్ కట్ సమయంలో విద్యార్థులు ఆడుకునేందుకు వెళ్లడంతో ఆగ్రహించి గుండు చేయించారు. శిక్షగా సుమారు 82 మంది విద్యార్థులకు సగం గుండు చేయించినట్లు సమాచారం.

**ఈ ఘటన శనివారం చిమూర్ తాలూకాలోని జంబుల్‌ఘాట్‌లోని ప్రభుత్వ సెకండరీ ఆశ్రమ పాఠశాలలో జరిగింది.**

వివరాల ప్రకారం.. ఆ సమయంలో కొంతమంది పిల్లలు ఆడుకుంటుండటంతో, పరింటెండెంట్, క్రమశిక్షణా చర్యగా విద్యార్థులకు సగం గుండు చేయమని ఆదేశించారు.

**ట్రిమ్మర్‌ను ఉపయోగించి విద్యార్థుల జుట్టులో కొంత భాగాన్ని కత్తిరించడంతో,**

హెయిర్ అసమానంగా తయారైంది. జుట్టుతో ఉన్న విద్యార్థుల ఫొటోలు బయటకు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.**

11.00 గంటల సమయంలో కొందరు విద్యార్థులు నిద్రించడానికి సిద్ధమవుతున్న వేళ హెయిర్ కట్ చేశారు.

**ఆదివారం తెల్లవారుజామున 4.00 గంటల వరకు కొనసాగినట్లు సమాచారం.**

సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు మెష్రామ్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ గిరి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే ఆయన చర్యలను సమర్థించుకున్నారు.

**వర్షా లు, ఇతర కారణాల రిత్యా కొంతకాలంగా విద్యార్థులు సరిగా హెయిర్ కట్ చేయించుకోవడం లేదని, మరికొందరు హెయిర్**

ఎటువంటి దురుద్దేశం లేదని అన్నారు. ఈ ఘటనపై సమగ్రమైన, నిష్పక్షపాతమైన దర్యాప్తు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## రెండు దశాబ్దాల వివాదం.. క్షణాల్లో ముగింపు!

**న్యూఢిల్లీ :**

రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న విశేషాధికారంvs భావప్రకటనా స్వేచ్ఛ కేసును సుప్రీంకోర్టు మంగళవారం అరగంటలో పరిష్కరించింది.

**2004లోనే వార్తాపత్రికకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఉపసంహరించుకున్నట్లు తమిళనాడు**

అసెంబ్లీ సీనియర్ అడ్వకేట్ రాజు రాచంద్రన్ వెల్లడించిన తర్వాత..ఈ కేసులో సుదీర్ఘ విచారణలోకి వెళ్లడం వలన ప్రయోజనం లేదని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.

**ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకున్న విషయం సుప్రీంకోర్టు దృష్టికి రాలేదని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.**

పిటిషనర్ల సూచన మేరకు, చట్టపరమైన విస్తృత, కీలకమైన అంశాలను భవిష్యత్తులో తగిన కేసు సందర్భంలో పరిశీలించేందుకు వాటిని అలాగే ఉంచనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

**అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితను విమర్శిస్తూ 'ది హిందూ' పత్రిక ప్రచురించిన**



సంపాదకీయంపై ఆ పత్రిక ఎడిటర్ సహా పలువురు

**జర్నలిస్టులను అరెస్టు చేయాలని 2003లో తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది.**

ఈ చర్యను సవాలు చేస్తూ జర్నలిస్టులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**శాసనసభ విశేషాధికారాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ మధ్య సంబంధానికి**

సంబంధించిన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఈ కేసులో తలెత్తాయి. దాదాపు 23 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసును సుప్రీంకోర్టు

**ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నిష్ఫలమైనదిగా పేర్కొంటూ ముగించింది.**

అయితే విశేషాధికారాలు, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ప్రధాన రాజ్యాంగపరమైన ప్రశ్నలను భవిష్యత్తులో తగిన కేసులో పరిశీలించేందుకు ఉంచినట్లు తెలిపింది.

వుదయం



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్హులైన పట్టభద్రులు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి.**
**ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి**
**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**మహబూబాబాద్, అక్టోబర్5 (వుదయంప్రతినిధి):**

అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై జిల్లాస్థాయి అధికారులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి లో పాల్గొన్న అధికారులకు క్లుప్తంగా వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్ట భద్రులు నిర్ణీత గడువులోగా ఫారం18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు. 01112023 నాటికి కనీసం 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి అర్హత కలిగిన అభ్యర్థులు Form18 దరఖాస్తును AEROలకు (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ [https://ceotelangana.nic.in/]ను సందర్శించవచ్చని తెలిపారు. పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## తొర్రూరు మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఆకస్మిక తనిఖీలు



జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**తొర్రూరు అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి):**

తొర్రూరు మండల కేంద్రంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో ఆకస్మికంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న సౌకర్యాలు విద్య బోధనలు, డైట్ మెనూ, యూనిఫామ్, నోట్ బుక్స్, తదితర అంశాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు, ప్రతి క్లాస్ రూమ్ తిరుగుతూ విద్య బోధనలను పరిశీలించారు.స్టోర్ గదిని పరిశీలించి నిత్యవసర వస్తువుల యొక్క నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు, స్టోర్ రిజిస్టర్ ను చెక్ చేశారు, ప్రభుత్వం కల్పిస్తున్న పక్క డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నాణ్యమైన ఆహార పదార్థాలతో వేడివేడి ఆహారాన్ని అందించాలని, వంట సిద్ధం చేసే సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ వంటలు సిద్ధం చేయాలన్నారు, కిచెన్ షెడ్యూలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులలో నిరంతరం విద్యుత్, స్వచ్ఛమైన త్రాగునీరు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు.పిల్లలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తుగా వారిని గమనిస్తూ ఉండాలని మానసిక స్థితిగతులను శిక్షణ తరగతుల నివారి నిర్వహించాలని తెలిపారు, నూతన విద్యా విధానం టెక్నాలజీ డిజిటల్ తరగతులు నిర్వహించి అత్యుత్తమ ఫలితాలను సాధించడం కోసం కృషి చేయాలని తెలిపారు, ప్రతి సబ్జెక్టు తోపాటు ఇంగ్లీష్ సబ్జెక్టు పై ప్రావీణ్యత వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు, పిల్లలకు షెడ్యూలు ప్రకారం తరగతులు నిర్వహించాలని టెస్ట్ , నోట్స్ బుక్కులు, యూనిఫార్ములు అందించాలని, సూచించారు. వసతి గృహం ప్రాంగణంలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని అట్టి తాళపు చెవి ప్రత్యేక అధికారి వద్ద ఉండాలని తెలిపారు,

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని నాగలక్ష్మి, తొర్రూరు ఆర్డీవో గణేష్, తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ ఓటర్ల జాబితా తయారీ**
**ఫారం-18 దరఖాస్తులకు నవంబర్ 6 చివరి గడువు**
**అర్హులైన ప్రతి పట్టభద్రుడికి సమాచారం అందేలా విస్తృత ప్రచారం**



**ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్-06:**

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నందున, అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి పట్టభద్రులైన వారు అర్హులుగా, 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2027 మార్చిలో శాసనమండలిలో ఏర్పడ నున్న ఖాళీ నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఫారం18 సమర్పించాలి :

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదుకు అర్హత ఉన్న పట్టభద్రులు ఫారం18లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత ఏఈఆర్‌ఓ/అధికారికి ఫారం18ను నేరుగా కూడా అందజేయవచ్చని తెలిపారు. అవసరమైన ఆధార పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. ఫారం18 దరఖాస్తులు సమర్పించేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని కలెక్టర్ స్పష్టం చేశారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అర్హులైన పట్టభద్రులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవంబర్ 20 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి, నవంబర్ 25న ప్రచురిస్తారని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తారని, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యాసంస్థలు, బ్యాంకుల్లో ప్రచారం చేయాలి :

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, సర్వీస్ అసోసియేషన్లు, ఇతర సంస్థల అధికారులు తమ పరిధిలోని అర్హత కలిగిన పట్టభద్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిగ్రీ, పీజీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు సమాచారం పంపించి అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ అన్ని బ్యాంకులకు సమాచారం అందించి అర్హులైన ఉద్యోగులు, పట్టభద్ర ఖాతాదారులకు విషయం తెలియజేయాలని తెలిపారు. తహసీల్దార్లు, ఏఈఆర్‌ఓలు తమ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో టామ్‌టామ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రతిరోజూ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అర్హులైన పట్టభద్రులకు ఫారం18 ఎలా సమర్పించాలి, చివరి తేదీ నవంబర్ 6 అనే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. స్థానిక సిబ్బంది ద్వారా కూడా సమాచారాన్ని ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నిరాధార ఆరోపణలతో పరిశ్రమలు మూతపడకుండా చూడాలి

**ఫార్మా కంపెనీల ఉద్యోగుల వినతి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 06**

నల్లగొండ పట్టణ కేంద్రంలో నిరాధార ఆరోపణలతో ఫార్మా పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడితే తమతో పాటు వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఫార్మా కంపెనీల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలపై వచ్చే ఫిర్యాదులను వాస్తవ పరిస్థితుల ఆధారంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మాత్రమే చర్యలు తీసుకోవాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా దోతి గూడెం, అంతమ్మగూడెం గ్రామాల పరిధిలోని సెజ్‌లో ఉన్న హేజలో ల్యాబ్స్, బృందావన్ లేబరేటరీస్, వీజే సాయి కెమ్, ఎస్‌వీఆర్ లేబరేటరీస్ తదితర ఫార్మా కంపెనీలకు చెందిన ఉద్యోగులు మంగళవారం నల్లగొండలోని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ప్రాంతీయ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. కొంతమంది వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం గత కొంత కాలంగా ఫార్మా కంపెనీలపై నిరాధార ఆరోపణలు చేస్తూ విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటై, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. వాస్తవాలు పరిశీలించాలి ఫార్మా కంపెనీలపై వచ్చే ప్రతి ఫిర్యాదును పీసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలు మూతపడే పరిస్థితి వస్తే సుమారు 6 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, నిరాధార ఫిర్యాదుల కారణంగా నిబంధనలు పాటిస్తున్న పరిశ్రమలు, ఉద్యోగులు నష్టపోకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు గోవర్ధన్, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్, సంగీత్‌కుమార్, రాంగోపాల్, రసూల్ శ్రీనివాస్, శంకర్, ఎం.రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, హనుమాన్, రవి, శ్రీశైలం పాల్గొన్నారు



## ప్రమాణాలకే పరిమితం కాకుండా సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

**2030 నాటికి ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలి**
**బ్లాక్‌స్పాట్లకు శాశ్వత ఇంజనీరింగ్ పరిష్కారాలు చూపాలి**
**హైదరాబాద్–విజయవాడ ఎన్‌హెచ్–65ను 6+2 లేన్లుగా విస్తరించాలి**
**జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 06**

ఎక్తానగర్ రహదారి భద్రతకు సంబంధించి ప్రమాణాలు, మార్గదర్శకాలు రూపొందించడం మాత్రమే సరిపోదని.. వాటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి సురక్షిత రహదారులను నిర్మించడమే లక్ష్యంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఎక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చింతన్ శివిర్-2026లో రెండో రోజు 'సురక్షిత రహదారుల రూపకల్పన-ప్రమాణాల నుంచి అమలు వరకు' అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రహదారి భద్రత ఆడిట్లను డిజైన్ దశ నుంచి నిర్మాణం, ప్రారంభానికి ముందు, ప్రారంభించిన తర్వాత కూడా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు.

బ్లాక్‌స్పాట్లకు శాశ్వత పరిష్కారాలు

ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించడం మాత్రమే పరిష్కారం కాదని మంత్రి అన్నారు. వాటికి శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలని సూచించారు.భూసేకరణ కీలకం రహదారుల నిర్మాణంలో భూసేకరణ, రైట్ ఆఫ్ వే అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని మంత్రి తెలిపారు. సరైన జంక్షన్లు, విజిబిలిటీ, సర్వీస్ రోడ్లు, పాదచారుల సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన మేర భూమి అందుబాటులో ఉండాలన్నారు. అనియంత్రిత మీడియన్ ఓపెనింగ్‌లు, ఇళ్లకు, వాణిజ్య సంస్థలకు నేరుగా ఇచ్చే రహదారి యాక్సెస్‌లు, సరిగా డిజైన్ చేయని కూడళ్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు. ఎన్‌హెచ్-65పై ఆందోళన హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ రహదారి డిజైన్ సురక్షితంగా ఉన్నప్పటికీ నిర్మాణ నాణ్యత లోపిస్తే ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు. నాణ్యత, పర్యవేక్షణ, రోడ్ మార్కింగ్స్, సైన్‌బోర్డులు, క్రాష్ బ్యారియర్లు, డ్రైనేజీ, పేవ్‌మెంట్ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. నిర్మాణ సమయంలో వర్క్‌జోన్ భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీసీటీవీలు, ఇన్సిడెంట్ డిటెక్షన్, స్పీడ్ మానిటరింగ్, జీఐఎస్ ఆధారిత సేఫ్టీ మ్యాపింగ్, డ్రోన్లు, డిజిటల్ రోడ్ ఇన్వెంటరీ వంటి సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఐదు అంశాలపై దృష్టి రోడ్డు భద్రత కోసం ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.

* భద్రతను దృష్టిలో పెట్టుకుని రహదారుల రూపకల్పన
* నిర్మాణంలో భద్రతకు ప్రాధాన్యం
*నిర్వహణలో భద్రతను నిర్ధారించడం
* డేటా, సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం
* నిరంతరం సమీక్షిస్తూ మెరుగుపరచడం

'ఎన్ని కిలోమీటర్ల రహదారి నిర్మించామన్నది కాదు.. ఎన్ని ప్రాణాలను కాపాడామన్నదే ముఖ్యం' అని మంత్రి అన్నారు. వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు, సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులు, హైవేల వెంట నివసించే ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా రహదారులు నిర్మించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతి కిలోమీటరు రహదారి భవిష్యత్ తరాలకు కూడా సురక్షితంగా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్, చీఫ్ ఇంజినీర్లు ధర్మారెడ్డి, వసంత్‌నాయక్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జిల్లా ,అక్టోబర్6(వుదయంప్రతినిధి):**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు మంగళవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని న్యూ రాంనగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ అంగన్వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో నమోదైన వారిలో ఎంతమంది ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న గుడ్లు, పాలు, పప్పు ధాన్యాలు తదితర పోషకాహారాన్ని ప్రతి నెలా సక్రమంగా అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పోషకాహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల్లో తీవ్ర పోషకాహార లోపం (SAM), మోస్తరు పోషకాహార లోపం (MAM) ఉన్న పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి పిల్లలకు బాలామృతం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సూచించారు.చిన్నారులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం గుడ్డు, పప్పుతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు పిల్లలకు ఇస్తున్న గుడ్ల నాణ్యతను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమం లో జిల్లా శిశు, సంక్షేమ అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**



**జయశంకర్ భూపాలపల్లి: అక్టోబర్ 06(వుదయం జిల్లా ప్రతినిధి):**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు.అక్టోబర్ 11 నుంచి 17 వరకు పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఐడీఓసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు సమయపాలన పాటించి, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో డీఈఓ లలిత, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు

## పలిమెల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

**పలిమెల, అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి):**




పలిమెల పోలీస్ స్టేషన్‌లో వార్షిక ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మంగళవారం కాటారం సబ్‌డివిజన్ డీఎస్పీ ఏ. సూర్యనారాయణ పలిమెల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, పచ్చదనం మరియు పరిశుభ్రతను పెంపొందించేందుకు సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల దర్యాప్తు పురోగతి మరియు పెండింగ్ కేసులను పరిశీలించారు. సిబ్బంది కిట్ బాక్సులు, విధి నిర్వహణ సామగ్రిని తనిఖీ చేసి, వాటిని ఎల్లప్పుడూ సక్రమంగా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అసాంఘిక కార్యకలాపాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, ప్రజలతో సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, అప్రమత్తత మరియు బాధ్యతాయుతమైన వైఖరిని పాటించాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, పలిమెల ఎస్ఐ సాయి శశాంక్ తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం.. ప్రపంచంలో ఎక్కడా లేదు

**సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**సూర్యాపేట జిల్లా మునగాల : అక్టోబర్ 06**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మునగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్ ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజుల పాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. .నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా: ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రవేశపెడతామని ప్రకటించారు. కుటుంబ యజమానికి ప్రమాదం జరిగితే రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పిస్తామని చెప్పారు.

రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్:

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల విద్యార్థులంతా ఒకే పాఠశాలలో ఒకే కుటుంబంలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యను అభ్యసించేలా తీర్చిదిద్దుతున్నామని వివరించారు.బీఆర్ఎస్ కు గతమే తప్ప భవిష్యత్తు లేదని, వారు మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలని విమర్శించారు. సుమారు 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

## రూ. 20.52 కోట్లతో 57వ డివిజన్ ప్రగతి పరుగులు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 57వ డివిజన్ (సమ్మయ్యనగర్, గోకుల్‌నగర్) ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన డివిజన్‌లో రూ.2.52 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానాంశాలను వెల్లడించారు. వరద ముంపునకు శాశ్వత విముక్తి, అంబేద్కర్ విగ్రహం, సుబేదారి ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీరు గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద కలవడం వల్ల ఏటా వరద ముంపు ఏర్పడుతోందని, సమగ్ర డ్రైనేజీ నిర్మాణం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

రూ. 18 కోట్లతో రహదారి విస్తరణ: అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నామని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. దీనితో పాటు గోకుల్‌నగర్, వడ్డేపల్లి చౌరస్తాలను సుందరీకరిస్తామని వెల్లడించారు.ప్రజల సహకారం కోరిన ఎమ్మెల్యే: రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనుల్లో స్వల్ప ఇబ్బందులు

ఎదురైనా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు, ఇంటి యజమానులు అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి మిత్రపక్షాల పార్టీల ఆధ్వర్యంలో సీఈసీజ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం



యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి. 6 అక్టోబర్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియకు వ్యతిరేకంగా ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఇండియా కూటమి మిత్రపక్షాల పార్టీల ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, సిపిఎం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ సిపిఐ జిల్లా yకార్యదర్శి దామోదర్ రెడ్డి న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు బిక్షపతి గోదా శ్రీరాములు పిసిసి కార్యదర్శి పాలకుర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పడిగెల ప్రదీప్ కేసగల్ల చందు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఓటు హక్కును పరిరక్షించడంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. SIR ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులను అరెస్ట్ చేయాలని కోరారు. SIR ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.SIR ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలను పూర్తి పారదర్శకంగా రూపొందించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## కరీంనగర్ ఆర్టీసీ వర్క్ షాప్ యూనియన్ అధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక



**కరీంనగర్ ఆక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి):** కరీంనగర్ ఆర్టీసీ వర్క్ షాప్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ను కాంగ్రెస్ అనుబంధ సంస్థలు అయిన INTUC, SWU, TWU, SWF యూనియన్ నాయకులు జక్కుల మల్లేశం గౌడ్ మరియు యూనియన్ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఽఈ సందర్భంగా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాము అని అంతేకాకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ రెడ్డి రాజు, పొన్నం శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, అంజన్న మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే

**ధర్మపురి నవదుర్గా సేవా సమితి శరన్నవరాత్రుల కరపత్ర ఆవిష్కరణ**

**మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి, అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి):** అమ్మవారి దయ ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. ధర్మపురి పట్టణంలోని న్యూ టి.టి.డి కళ్యాణ మండపం వేదికగా నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యం లో అక్టోబర్ 11 నుండి అక్టోబర్ 20 వరకు నిర్వహిం చనున్న 13వ సంవ త్సర దేవి శరన్నవరాత్రో త్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం మంత్రి క్యాం ప్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించి, అమ్మ వారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజ లందరిపై ఉండాలని కోరారు.

## సీసీఐ బకాయిలు వెంటనే చెల్లించాలి

**- రూ.4.44 కోట్ల బకాయిలపై కలెక్టర్‌కు కౌన్సిలర్ల వినతి**



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబరు 6:** సీసీఐ కర్మాగారం తొలగించిన నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీకి రావాల్సిన రూ.4.44 కోట్ల బకాయిలను వెంటనే చెల్లిం చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. సీసీఐ కర్మాగారం తొలగించినప్పటికీ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.4 కోట్ల 44 లక్షల బకాయిలు ఇంకా అందలేదని తెలిపారు. మున్సిపాలిటీకి రావాల్సిన నిధులు సకాలంలో అందేలా సీసీఐ అధికారులను ఆదేశించాలని కోరారు. బకాయిలు వెంటనే చెల్లించేలా సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీసీఐ బకాయిల విషయమై గతంలో పలు మార్లు ఢిల్లీ స్థాయి అధికారులతో మాట్లాడినట్లు కలెక్టర్ వివరించారని కౌన్సిలర్లు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సీసీఐ నిర్వాహకులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ సీసీఐ అధికారులు స్పందించలేదని కలెక్టర్ పేర్కొన్నారని తెలిపారు. మరోసారి ఢిల్లీ స్థాయి అధికారులతో మాట్లాడి బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు రోహిత్, మాజీ మున్సిపల్ పక్ష నాయకుడు బండారి సతీష్, పర్వేజ్ మహబూబ్, నాక్సన్, కిషోర్, సలీం, రషీద్, రిజ్వాన్, బబ్లు, అన్నపూర్ణతో పాటు టీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

**రోగులతో ఓర్పుగా, మర్యాదగా వ్యవహరిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి**

**రోగుల రద్దీ పెరిగినా వైద్య చికిత్స నాణ్యత, సిబ్బంది వ్యవహార శైలిలో మార్పు రాకూడదు**

**పాఠశాలల్లో విద్యార్థుల హాజరుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు ఉండేలా చూడాలి**



**పెద్దపల్లి, అక్టోబర్-06 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో, రోగుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రోగుల సంఖ్య పెరిగినప్పటికీ వైద్య చికిత్స నాణ్యతలో, వైద్యులు, సిబ్బంది రోగులతో వ్యవహరించే తీరులో ఎలాంటి మార్పు రాకూడదని స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల రద్దీ, వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఓర్పుతో, మర్యాదగా పలకరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పేద ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రోగుల సంఖ్య పెరిగినప్పటికీ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రోగులతో మాట్లాడే విధానంలో ఎలాంటి మార్పు రాకూడదని స్పష్టం చేశారు. ప్రతి రోగి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, వారి అవసరాలను ఓర్పుతో అర్థం చేసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.పెరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరంపెద్దపల్లి మండలంలోని పెద్ద బొంకూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలను పరిశీలించారు.విద్యార్థుల హాజరుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాథమికపాఠశాల విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వెనుకబడినవిద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.

పదో తరగతివిద్యార్థులకు నిర్దేశిత సమయంలోగా సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. బోధించిన పాఠ్యాంశాలపై సమగ్ర పునశ్చరణ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పరీక్షల సన్నద్ధత కోసం త్వరలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన అదనపు సహాయం అందించాలని తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి..



**జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇ1రోల్ అబ్జర్వర్ బి బాల మాయాదేవి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తో కలిసి ప్రత్యక్షంగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు బీఎల్ఓ లను ప్రత్యక్షంగా కలిసి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు ఓటర్ల వివరాల పరిశీలన ఇంటింటి సర్వే ఫారాల స్వీకరణ ఓటర్ల నుంచి సేకరించిన వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు అలాగే బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు ఓటర్ల వివరాల వెరిఫికేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న అంశాలు తదితర విషయాలపై అబ్జర్వర్ ఆరా తీశారు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ఓటర్లకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ మండల తహసీల్దార్ హకీమ్ స్థానిక ప్రజాప్రతినిధులు బీఎల్ఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేధింపులపై మౌనం వద్దు.. ఫిర్యాదు చేయండి

**-- ఆకతాయిలపై రెండు నెలల్లో 4 ఎఫ్ఐఆర్‌లు.. 5 పెట్టి కేసులు**

**-- హాట్‌స్పాట్లలో మఫ్టీలో నిఘా.. మహిళల భద్రతకు షీ టీమ్ భరోసా: – జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 07 (వుదయం ప్రతినిధి) :**

మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు మౌనంగా భరించకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే షీ టీమ్ రక్షణగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలో గడిచిన రెండు నెలల్లో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదులపై చర్యలు చేపట్టి 4 ఎఫ్ఐఆర్‌లు, 5 పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన హాట్‌స్పాట్ల వద్ద షీ టీమ్ సిబ్బంది మఫ్టీలో నిరంతరం నిఘా ఉంచుతున్నారని తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు.విద్యా సంస్థలు, మహిళలు పనిచేసే ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, సోషల్ మీడియా మోసాలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.అపరిచిత వ్యక్తులతో మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యాసంస్థల్లో, రోడ్డుపై వెళ్లేటప్పుడు లేదా పని చేసే ప్రదేశాల్లో ఎవరైనా అసభ్యంగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మహేష్ బి. గితే కోరారు. ఫిర్యాదు అందిన వెంటనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధి ప్రోత్సాహం...

**ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం ద్వారా 50 వేల రూపాయల చొప్పన చెక్కులు అందజేత...**

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



**జగిత్యాల అక్టోబర్ 06 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల అర్బన్ మండలంలోని మోతే దరూర్ గ్రామాలకు చెందిన ముస్లిం మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం 2025–26 కార్యక్రమంలో భాగంగా స్వయం ఉపాధి కల్పన నిమిత్తం మంజూరైన చెక్కులను జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మోతే గ్రామానికి చెందిన షేక్ బీబీ భర్త షేక్ బికారీ బాషాకు కిరాణా షాపు ఏర్పాటు చేసుకునేందుకు దరూర్ గ్రామానికి చెందిన షబానా భర్త షేక్ అహ్మద్కు టైలరింగ్ బోటిక్ ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు సంపన్న దేశాలలో సైతం ప్రభుత్వం అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేదని స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. మహిళా సాధికారికత ఆర్థిక అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్ సెటి ద్వారా మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసవి పాక్స్ చైర్మెన్ దామోదర్ రావు సర్పంచ్ మహేష్ నాయకులు ములసపు మహేష్ మతులాపురం శేఖర్ సంజీవ్ రఘు సంబంధిత అధికారులు నాయకులు మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

## తరంగ్ 2 అతి ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థి

**విద్యార్థి బన్నీని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి, అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి):**

రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి ఎం చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం

**భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)6 అక్టోబర్ 2026**

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. గతంలో సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మనిషికి ఆధార్ ఎలాగో ప్రతి భూ కమతానికి భూధార్ రూపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సామగ్రిని సమకూరుస్తామని తెలిపారు. యువ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. భూ సర్వేలో పనిచేయడం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి పరిపాలనపై మంచి అవగాహనతో పాటు భవిష్యత్తులో తమ సర్వీసులో ఉపయోగపడే అనుభవం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి. మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పరిపాలన ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి బలమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, సంబంధిత అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఒక గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని, నిర్దేశిత గడువులోగా సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం మార్కెట్ కమిటీ గిడ్డంగిని పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్



**నిజామాబాద్, అక్టోబర్ 06:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారంను అందించేందుకు ప్రభుత్వ భాగస్వామ్యంతో హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం నవీపేట మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గిడ్డంగిని మంగళవారం సాయంత్రం ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో కలిసి పరిశీలించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు గిడ్డంగి భవనం అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించారు. సుమారు 70వేల మంది విద్యార్థిని విద్యార్థులకు దీని ద్వారా అల్పాహారం అందించడం జరుగుతుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు.విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల స్పందన

- 'వుదయం' కథనంతో కదిలిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు




**సంగారెడ్డి/వుదయం :**

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై 'వుదయం'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు జఫ్ఫా యొద్దిన్, జలంధర్ ఫిర్యాదు మేరకు సంగారెడ్డి పట్టణంలోని 374 సర్వే నంబర్‌లో రాజంపేట వెళ్లే దారిలో గాలిపోచమ్మ గుడి సమీపంలో జరుగుతున్న నిర్మాణాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. ఏడీ సర్వే నిర్వహించి భూమి ప్రభుత్వానికి చెందినదిగా తేలితే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామని అధికారులు స్పష్టం చేశారు.అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి చర్యలకు సిద్ధమవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సర్వే నివేదిక అనంతరం ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## టీపీటీఎఫ్ తొగుట మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**





తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) తొగుట మండల శాఖ అధ్యక్షుడిగా ఏ. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా టి. అమరేందర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మండల శాఖ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. టీపీటీఎఫ్‌ను మండలంలో మరింత బలోపేతం చేసేందుకు సభ్యుల సహకారంతో ఐక్యంగా ముందుకు సాగుతామని వారు వెల్లడించారు.

# జూరాలకు 3 టీఎంసీలు.. జాడేది?

- కర్ణాటక హామీ నీటి విడుదలగా మారేదెప్పుడు?
- నారాయణపూర్ నుంచి జూరాలకు ప్రస్తుతం చుక్క నీరు లేదు
- 4.5 టీఎంసీల నిల్వలతో వారబందీ.. పంటలపై నీలినీడలు
- చివరి దశలో నీటి కొరతతో రైతుల్లో ఆందోళన

**గద్వాల, అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**



మాట ఇచ్చారు.. నీరు వస్తుందని ఆశ కల్పించారు.. ప్రభుత్వ స్థాయిలో విజ్ఞప్తులు కూడా జరిగాయి. కానీ జూరాల ఆయకట్టు రైతుల పొలాలకు మాత్రం ఆ హామీ ఇంకా చేరలేదు. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి కోరినప్పటికీ.. ప్రస్తుతం నారాయణపూర్ నుంచి జూరాలకు కొత్తగా నీటి విడుదల జరగడం లేదు. దీంతో పంటలు కీలక దశలో ఉన్న వేళ ఆయకట్టు రైతుల్లో ఆందోళన తీవ్రతరమవుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో సుమారు 4.5 టీఎంసీల లైవ్ స్టోరేజీ మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. అందుబాటులో ఉన్న నీటిని వారబందీ పద్ధతిలో ఆయకట్టుకు సరఫరా చేస్తున్నప్పటికీ.. కొత్తగా ప్రవాహం రాకపోతే ఈ నిల్వలు మరింత తగ్గే అవకాశం ఉంది. దీంతో "పంట చేతికందే వరకు నీటి భరోసా ఏమిటి?" అన్న ప్రశ్న రైతులను వెంటాడుతోంది. హామీ.. ఆచరణలోకి ఎప్పుడు? జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ తదితర ఆయకట్టు పరిధిలో సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందం సెప్టెంబరు 24న కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మధుసూద న్‌రెడ్డి, మెఘారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు కర్ణాటక సీఎంను కలిసి జూరాల ఆయకట్టు పరిస్థితిని వివరించారు. పంటలకు నీటి అవసరం ఉందని, నారాయణపూర్ నుంచి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి విడుదల అంశాన్ని పరిశీలిస్తామని, అవసరమైన మేరకు నీటిని విడుదల చేసే విషయంపై కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలంగాణ ప్రజాప్రతినిధులు తెలిపారు. అయితే హామీకి, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న నీటి ప్రవాహానికి మధ్య అంతరం కొనసాగుతోంది "ప్రస్తుతం నీటి విడుదల లేదు" జూరాల ప్రాజెక్టు డీఈ నాగేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం జూరాలకు నీటి విడుదల జరగడం లేదు. ఎగువ ప్రాంతాల్లో గతంలో కురిసిన వర్షాల కారణంగా కొంత వరద నీరు జూరాలకు చేరిందని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 4.5 టీఎంసీల లైవ్ స్టోరేజీ ఉందని, అందుబాటులో ఉన్న నీటిని వారబందీ పద్ధతిలో రైతుల పంటలకు అందిస్తున్నామని వివరించారు.నీటి లభ్యతను బట్టి ఆయకట్టు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. 4.5 టీఎంసీలే.. ఎంతకాలం? జూరాల ప్రాజెక్టులో ఉన్న 4.5 టీఎంసీల నీటితో పంటలను ఎంతకాలం కాపాడగలమన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. సాగు చివరి దశలో పంటలకు నీటి అవసరం మరింత కీలకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ సమయంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు, పంట దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి ప్రవాహం కొనసాగితేనే పంటకు భరోసా.. నిల్వలతో మాత్రమే ఎంతకాలం నెట్టుకొస్తారు? అన్న ప్రశ్నలు వినిపిస్తు న్నాయి. 27,600 క్యూసెక్కులు.. ఆ నీరు ఎక్కడిది? సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 1 మధ్య జూరాల వైపు 27,600 క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ప్రవాహాన్ని నారాయణపూర్ నుంచి ప్రత్యేకంగా విడుదల చేసిన నీటిగా పరిగణించలేమని రైతు సంఘాలు చెబుతున్నాయి. ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వచ్చిన వరద నీరే జూరాలకు చేరిందని వారి వాదన.

**మరోవైపు జూరాల అధికారులు కూడా ప్రస్తుతం నారాయణపూర్ నుంచి నీటి విడుదల లేదని స్పష్టం చేస్తున్నారు.**

దీంతో నమోదైన ప్రవాహం వేరు.. కర్ణాటక నుంచి విడుదలైన నీరు వేరు అన్న అంశంపై స్పష్టత అవసరమని రైతులు కోరుతు న్నారు. చర్చలు సాగుతున్నా.. పొలాల్లో ఆందోళన కర్ణాటక నుంచి నీటి విడుదల అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి భవిష్యత్తులో నారాయణపూర్ నుంచి జూరాలకు నీటి విడుదల జరిగేలా చర్యలు తీసుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రైతుల పరిస్థితి మాత్రం తక్షణ పరిష్కారాన్ని కోరుతోంది. పంటలు ప్రస్తుతం పొలాల్లో ఉన్నాయి. వాటికి నీరు అవసరం. అందుకే "చర్చలు ఎప్పుడు పూర్తవుతాయి?" కంటే "నీరు ఎప్పుడు వస్తుంది?" అన్నదే తమకు ముఖ్యమని రైతులు చెబుతున్నారు.

**హామీలు కాదు.. నీటి ప్రవాహమే కావాలి**

ప్రభుత్వ స్థాయిలో జరిగిన చర్చలు, కర్ణాటక సీఎం వద్ద చేసిన విజ్ఞప్తులు, సానుకూల స్పందనపై ప్రకటనలు.. ఇవన్నీ జరిగినా జూరాల ఆయకట్టు రైతులకు కావాల్సింది మాత్రం కృష్ణా జలాల నిరంతర ప్రవాహం. పంటలు చివరి దశకు చేరిన సమయంలో నీటి లభ్యత తగ్గడం రైతుల్లో ఆందోళనకు కారణమవుతోంది. నారాయణపూర్ నుంచి కొత్తగా నీరు రాకపోతే జూరాల నిల్వలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న నీటిని వారబందీతో పొదుపుగా వినియోగిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. పంటలు పూర్తిగా చేతికందే వరకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టమైన భరోసా రైతులకు కావాలి.

**ఇప్పుడు అసలు ప్రశ్న కర్ణాటక నుంచి జూరాలకు విడుదల చేస్తామని చెప్పిన నీరు ఎప్పుడు వస్తుంది?**

జూరాల ఆయకట్టు పంటలకు చివరి వరకు నీటి భరోసా ఎలా కల్పిస్తారు? ప్రస్తుతం ఉన్న 4.5 టీఎంసీలతో ఎంతకాలం సాగునీటిని కొనసాగించగలరు? ఈ ప్రశ్నలకు సమాధానం లభించే వరకు జూరాల ఆయకట్టు రైతుల ఎదురుచూపులు కొనసాగనున్నాయి.



## మట్టి పరీక్షా కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత్

**నాగర్ కర్నూల్, అక్టోబరు 6 (వుదయం బ్యూరో):**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన మట్టి పరీక్షా కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు.భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ఇప్పటి వరకు పూర్తయిన పనులు, చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్షలకు అవసరమైన పరికరాల ఏర్పాటుపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు.మట్టి పరీక్షా కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పనులకు నిధులు విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భవనంలో అవసరమైన మరమ్మతులను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు.అందుబాటులో ఉన్న స్థలాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ అన్ని సౌకర్యాలను కల్పించాలని, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి కేంద్రాన్ని త్వరగా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏం జరుగుతోంది?

- పేదల ప్రాణాలతో చెలగాటమా..?
- CAG లెక్కల్లో ఏడేళ్లలో 450 నవజాత శిశు మరణాలు.. తాజా ఘటనలతో మళ్లీ కలకలం

**వికారాబాద్ 6 (వుదయం బ్యూరో)**

తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వరుసగా వెలుగులోకి వస్తున్న మరణ ఘటనలు, వైద్య నిర్లక్ష్య ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు 200 పడకల జిల్లా ఆసుపత్రి, 150 పడకల MCH వంటి వైద్య సదుపాయాలు.. మరోవైపు ప్రసవాలు, నవజాత శిశువుల చికిత్సకు సంబంధించి వరుసగా విషాద ఘటనలు చోటుచేసుకోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ముఖ్యంగా 2025లో గర్భిణి మృతి, 2026 మేలో వైద్య నిర్లక్ష్యంపై ఆరోపణలు, సెప్టెంబర్ 24న నవజాత శిశువు మృతి, సెప్టెంబర్ 30న బాలమణి, ఆమె నవజాత శిశువు మృతి ఘటనలు తాండూరు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై మరోసారి చర్చకు తెరలేపాయి.

**CAG లెక్కల్లో 450 నవజాత శిశు మరణాలు**

తాండూరు ఆసుపత్రికి సంబంధించి గతంలో CAG పరిశీలించిన గణాంకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. 2016-17లో 114, 2017-18లో 99, 2018-19లో 73, 2019-20లో 49, 2020-21లో 41, 2021-22లో 38, 2022-23లో 36 నవజాత శిశు మరణాలు నమోదయ్యాయి. ఈ ఏడు సంవత్సరాల మొత్తం 450. అయితే ఈ మరణాలన్నింటికీ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని చెప్పలేం. తాండూరు SNCUకు ఇతర ప్రాంతాల నుంచి తీవ్ర పరిస్థితుల్లో రిఫర్ అయిన శిశువులు కూడా వస్తున్నారని CAG పేర్కొంది. అయినప్పటికీ మరణాలకు నిర్దిష్ట కారణాలను కేసులవారీగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆడిట్ స్పష్టం చేసింది. 2016-17లో 114గా ఉన్న సంఖ్య 2022-23లో 36కు తగ్గడం సానుకూల పరిణామమే అయినా, ప్రతి మరణానికి కారణం ఏమిటన్న ప్రశ్న మాత్రం మిగిలే ఉంది.

**తాజా ఘటనలు.. వరుస ప్రశ్నలు**

2025 సెప్టెంబర్‌లో ప్రసవం కోసం వచ్చిన అఖిల అనే గర్భిణి మృతి ఘటనపై కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యాన్ని ఆరోపించారు. 2026 మేలో ప్రసవం అనంతరం మహిళ కడుపులో కాటన్ మిగిల్చి కుట్లు వేశారనే ఆరోపణలు వెలువడ్డాయి. సెప్టెంబర్ 24న నవజాత శిశువు మృతి చెందగా, కుటుంబ సభ్యులు వైద్య నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. సెప్టెంబర్ 30న తాండూరు మండలం జినుగుర్తికి చెందిన 25 ఏళ్ల బాలమణి ప్రసవం అనంతరం తనకు పుట్టిన ఆడ శిశువుతో కలిసి మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ఆసుపత్రి అధికారులు స్పందించి విచారణకు హామీ ఇచ్చారు. ఈ ఘటనల్లో నిర్లక్ష్యం జరిగిందని తుది నిర్ధారణకు అధికారిక విచారణ నివేదిక అవసరం.

**ఒకే నెలలో మూడు ప్రాణాలు.. పూర్తి లెక్క ఎక్కడ?**

సెప్టెంబర్ 24న ఒక నవజాత శిశువు, సెప్టెంబర్ 30న బాలమణి, ఆమె నవజాత శిశువు మృతి చెందడంతో బహిరంగంగా వార్తల్లో నమోదైన ఘటనల్లోనే కనీసం మూడు ప్రాణాలు కోల్పోయిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఇది సెప్టెంబర్‌లో ఆసుపత్రిలో జరిగిన మొత్తం మరణాల సంఖ్య కాదు. ఆసుపత్రి అధికారిక మరణ రిజిస్టర్‌ను పరిశీలిస్తేనే అసలు లెక్క బయటపడుతుంది. గత ఏడాది మొత్తం ఎన్ని ప్రసవాలు జరిగాయి? ఎంతమంది తల్లులు, నవజాత శిశువులు మృతి చెందారు? ఎన్ని కేసులు ఇతర ఆసుపత్రులకు రిఫర్ అయ్యాయి? ఎంతమంది SNCU లో చేరారు? ఎంతమంది చికిత్స పొందారు? ఈ వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

**200 పడకల ఆసుపత్రి.. 150 పడకల MCH.. అయినా ఎందుకు ఆరోపణలు?**

తాండూరు ప్రభుత్వ వైద్య వ్యవస్థలో పెద్ద సంఖ్యలో పడకలు, MCH, SNCU వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ అత్యవసర ప్రసూతి వైద్యం, నిపుణుల వైద్య సేవలు, రక్తం, ఆపరేషన్ థియేటర్, నవజాత శిశు అత్యవసర చికిత్స, ఆక్సిజన్, వెంటిలేటర్, రిఫరల్ వ్యవస్థలు 24 గంటలు సమర్థంగా పని చేస్తున్నాయా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒక్కరోజు ఆకస్మిక తనిఖీలతో సమస్య పరిష్కారం కాదు. ప్రతి తల్లి, ప్రతి బిడ్డకు సురక్షితమైన వైద్యం అందేలా వ్యవస్థ పనిచేయాలి.

**విచారణలు కాదు.. పూర్తి నిజాలు కావాలి**

తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి తల్లి, ప్రతి నవజాత శిశువు మరణంపై డెత్ ఆడిట్ నిర్వహించాలి. మాతృ మరణాలకు Maternal Death Review, నవజాత శిశు మరణాలకు Neonatal Death Review నిర్వహించి అసలు కారణాలను వెల్లడించాలి. రిఫరల్ కేసులపై ప్రత్యేక ఆడిట్ చేయాలి. వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది మంజూరు పోస్టులు, ఖాళీలు, డ్యూటీ రోస్టర్, అత్యవసర సేవల పరిస్థితిని ప్రభుత్వం బహిర్గతం చేయాలి. ఆరోపణ నిజమైతే బాధ్యులపై చర్యలు.. ఆరోపణ తప్పైతే వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

**తాండూరు ప్రజల ప్రశ్న ఒక్కటే**

"ప్రభుత్వ ఆసుపత్రి పెద్దదిగా ఉండటం కాదు.. అక్కడికి వచ్చే పేదల ప్రాణాలకు భద్రత ఉండటమే ముఖ్యం."

ఏడేళ్లలో CAG లెక్కల్లో 450 నవజాత శిశు మరణాలు.. తాజాగా తల్లి-బిడ్డ మృతి సహా వరుస ఘటనలు.. ఇప్పుడు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి పూర్తి మరణాల లెక్క, కారణాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.




## ఆర్థిక సహాయం అందజేత



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన బిజ్జాదాసు గారు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారు ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో MSSO సభ్యుడు లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంజిరెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంజయ్య, మైసయ్య, వార్డు మెంబర్ స్వామి రాజశేఖర్, మాజీ mptc దాసు, శ్రీనివాస్ , భూషణం, కుమార్, సురేష్ ,రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను బర్తరఫ్ చేయాలి



- కలెక్టరేట్ ఏఓ కు వినతిపత్రం అందజేత

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 6(వుదయం ప్రతినిధి)**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ, ఆయనను వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.ఇండియా కూటమి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుదాం అంటూ కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి, సీపీఐ నాయకులు నర్సింహా, సీపీఐ(ఎం) నాయకులు వెంకట్రాంరెడ్డి, సీపీఐ(ఎంఎల్) నాయకులు హన్మేష్ చారి, బి. రాము, కాశీనాథ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని కోరారు. నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు తన వాదనను వినిపించే అవకాశం కల్పించాలని కోరారు.ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించే ముందు కారణాలను స్పష్టంగా తెలియజేయాలని, ఫారం6,ఫారం7 ప్రక్రియలను నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా ఓటర్ల తొలగింపులకు సంబంధించిన కారణాలను ప్రజలకు బహిరంగంగా తెలియజేయాలని కోరారు.అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకూడదని స్పష్టం చేశారు. ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యంలో పౌరుడి గొంతుక అని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు ఇండియా కూటమి ఐక్యంగా పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ధర్నా అనంతరం ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు సత్యనారాయణ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఓటు బచావో.. దేశ్ బచావో, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు.అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న కూటమి ప్రతినిధులు కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి: ఎంపీ డీకే అరుణ

- దిశ కమిటీ సమావేశంలో యు శాఖల వారీగా పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష
- ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామంలో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పైలెట్ గా చేపట్టి అమలు చేయాలి
- అమృత్ పథకం పనులు మున్సిపాలిటీ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

**మహబూబ్‌నగర్**



కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, విద్య, మార్కెటింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్, క్రీడలు, యువజన సర్వీసులు తదితర శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని శాఖల వారీగా సమీక్షించారు. పథకాల అమలు, పనుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్ట్ గా చేపట్టి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోపీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా ఇంటి పైకప్పులపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని టీజీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు సూచించారు. సర్పంచ్‌లు ముందుకు వచ్చే గ్రామాల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**అమృత్ పథకం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి**

మున్సిపాలిటీల్లో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న తాగునీటి సరఫరా పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. సంబంధిత ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలిరైతులు, మహిళా సంఘాలకు డ్రోన్ల ద్వారా పంటలకు పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వైవిధ్యమైన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

**కెజిబివిల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం**

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (KGBV) విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ సూచించారు. ఫుడ్ పాయిజన్ వంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.మిడ్జిల్ KGBVలో వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయడంతో పాటు నూతన డైనింగ్ హాల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలిపీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని 26 పాఠశాలల్లో ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యతో పాటు 8వ తరగతి నుంచే ఐఐటీ, మెడిసిన్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.టీడీ గుట్ట ఆర్ఓబీ భూసేకరణపై చర్చటీడీ గుట్ట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశాలపై సమావేశంలో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని రైల్వే అధికారులకు ఎంపీ సూచించారు. జిల్లాలో జరుగుతున్న రైల్వే ఆర్.ఓ.బి పనులు,నేషనల్ హై వే రోడ్డు పనులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆర్&బి,పంచాయతీ రాజ్ శాఖా ద్వారా చేపట్టిన రహదారుల పనులు కూడా సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.

**KGBVలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ జిల్లాలోని ప్రతి KGBVని మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**ఎం.పి.మాట్లాడుతూ**

సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భూమి కేటాయించేలా తహశీల్దార్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వి.బి.జి. రామ్ జీ నిధులతో అంగన్వాడీ భవనాలు ,వి.ఓ భవనాలు, జి.పి.భవనాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఓట్ల తొలగింపుపై హైదరాబాద్ ఎంపీ తీవ్ర హెచ్చరిక

**వనపర్తి అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి)**



భూములకు సంబంధించి వివాదాలు, సమస్యలకు భూ రీసర్వే పరిష్కార మార్గం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

భూములకు సంబంధించిన వివాదాలు, ఇతర సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపేందుకు భూముల రీసర్వే ప్రక్రియ దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండల పరిధిలోని బూడిదపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తయిన సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులతో, రైతులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో రీసర్వే ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసుకున్న తొలి గ్రామంగా బూడిదపాడు నిలిచిందని తెలిపారు. రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన గ్రామ రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక జీపీఎస్ పరికరాల ద్వారా గ్రామంలో రీసర్వే నిర్వహించినట్లు చెప్పారు.గతంలో సుమారు 125 సంవత్సరాల క్రితం నిజాం కాలంలో భూముల సర్వే జరిగిందని, సుదీర్ఘ కాలం తర్వాత ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో భవిష్యత్తులో భూములకు సంబంధించిన వివాదాలు, సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.రీసర్వే వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సంబంధిత భూ యజమానులకు నోటీసులు కూడా అందజేస్తామని చెప్పారు. రీసర్వేలో భూమి విస్తీర్ణంలో కొంతమేర ఎక్కువ లేదా తక్కువగా నమోదైన సందర్భాల్లో రైతులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని, ఇందుకోసం 60 రోజుల గడువు ఉంటుందని కలెక్టర్ వివరించారు.రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో భూములను విక్రయించే వారికి, కొనుగోలు చేసే వారికి భూమి వివరాలపై మరింత ప్రామాణికత, స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓ ఇందిరమ్మ ఇంటిని సందర్శించారు. ఇంటి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణానికి అయిన వ్యయం, ఇంటిని ఏ విధంగా నిర్మించుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులను కలెక్టర్ అభినందించారు.

**పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి**

అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయపాలనతో హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి అర్థం చేసుకునే విధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు .ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సర్వే శాఖ ఏడి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ విటోబా, ఇతర మండల అధికారులు, పాల్గొన్నారు.

# రైతుల పరిహారంపై దళారుల కన్ను పడితే కాళ్ళు విరగ్గొడతాం!

- మల్లమ్మకుంట భూబాధితులకు భరోసా.. మోసగాళ్లకు 'విజయుడు' తీవ్ర హెచ్చరిక!
- 'ఎక్కువ ఇప్పిస్తాం' అని ఎవరైనా వస్తే చెప్పు దెబ్బ తప్పదు!
- రైతుల రక్తాన్ని పీల్చే రాబందుల ఆటకట్టిస్తాం!
- పైసా దళారీకివ్వొద్దు.. పైసాతో సహా నేరుగా ఖాతాల్లోకే పరిహారం!



**అలంపూర్ అక్టోబర్ 06 (వుదయం కరస్పాండెంట్)**

మల్లమ్మకుంట రిజర్వాయర్ నష్టపరిహారం పేరుతో అమాయక రైతుల రక్తాన్ని పిండేందుకు చూసే దళారీ రాబందుల ఆటకట్టిస్తామని, వారి పీచమణుచుతామని అలంపూర్ ఎమ్మెల్యే శ్రీ విజయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఎక్కువ పరి హారం ఇప్పిస్తాం.. ఫైళ్లు త్వరగా క్లియర్ చేయిస్తాం" అంటూ మాయమాటలు చెప్పి రైతుల కష్టార్జితాన్ని దోచుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని, అలాంటి మోసగాళ్లను ఊచలు లెక్కపెట్టిస్తామని హెచ్చరించారు.

**రైతుల హక్కును దోచుకుంటే పాతరేస్తాం!**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఘాటుగా స్పందిస్తూ — "నష్టపరిహారం అనేది సర్వం కోల్పోయిన రైతులకు దక్కాల్సిన చట్టబద్ధ మైన హక్కు! అది ఏ ఒక్క దళారీ బాబు సొమ్ము కాదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రావాల్సిన చివరి పైసాతో సహా పారదర్శకంగా, నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే జమ అవుతుంది. రైతులు దళారుల కాళ్ళు మొక్కాల్సిన అవసరం లేదు, వారి చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మోసగాళ్ల మాయమాటలు నమ్మి ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇచ్చి మోసపోవద్దు" అని పిలుపునిచ్చారు.పోలీసులకు పట్టించండి.. చిప్పకూడు తినిపిస్తాం! పరిహారం ఇప్పిస్తామని చెప్పి ఎవరైనా ఒక్క రూపాయి డిమాండ్ చేసినా క్షమించేది లేదని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమ వసూళ్లకు పాల్పడే దళారుల వివరాలు, ఫోన్ నంబర్లు, ఆధారాలను అధికారులకు అందిస్తే వారిపై గూండా యాక్ట్ తరహాలో క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. రైతాంగం ధైర్యంగా ఉండాలని, దళారుల ప్రలోభాలకు గురికాకుండా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

# వట్టి వేరుతో.. వ్యవసాయానికి కొత్త వేర్లు!

- సంప్రదాయ పంటలకు స్వస్తి.. విలక్షణ సాగుతో యువరైతు దూకుడు
- ప్రకృతి వ్యవసాయంతో పంట.. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో విక్రయాలు
- ఐదు గుంటల్లో ప్రయోగం.. భవిష్యత్‌లో సాగు విస్తరణకు ప్రణాళిక

**మల్దకల్ అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**



పంట మారితే ఆదాయం మారుతుందా? మార్కెట్‌ను వెతుక్కుంటూ పోకుండా.. మార్కెట్ మన పొలం దాకా వస్తుందా? ఈ రెండు ప్రశ్నలకు ఆచరణలో సమాధానం చూపిస్తున్నారు మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన యువరైతు జయరామ్. సంప్రదాయ పంటల సాగుకే పరిమితం కాకుండా.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వట్టి వేరును ఎంచుకు న్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తూ.. పండించిన ఉత్పత్తిని ఆన్‌లైన్ వేదికగా విక్రయిస్తు న్నారు. వట్టి' కాదు.. విలువైన పంటే! వట్టి వేరు పేరు వినగానే చాలా మందికి ఇది సాధారణ మొక్కగానే అనిపించొచ్చు. కానీ దాని వినియోగాలు, మార్కెట్ అవకాశాలను గుర్తించిన వారికి మాత్రం ఇది విలువైన పంటే. ఇదే ఆలోచనతో జయరామ్ తన పొలంలో సుమారు ఐదు గుంటల విస్తీర్ణంలో వట్టి వేరును అంతర పంటగా సాగు చేస్తున్నారు.తమిళనాడు నుంచి మొక్కలను తెప్పించి సాగు ప్రారంభించారు. సుమారు తొమ్మిది నెలల పంటకాలం కలిగిన ఈ పంటను తొలుత ప్రయోగాత్మకంగా చేపట్టారు. పంట పెరుగుదల, దిగుబడి, నిర్వహణ, మార్కెట్ అవకాశాలను స్వయంగా పరిశీలిస్తూ సాగు అనుభవాన్ని పెంచుకుంటున్నారు. రసాయనాలకు దూరం.. ప్రకృతి వైపు అడుగు పంట సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంపై జయరామ్ దృష్టి సారించారు. జీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ వట్టి వేరును పెంచుతున్నారు. పంట దిగుబడితోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ముఖ్యమన్నది ఆయన ఆలోచన. తక్కువ విస్తీర్ణంలో ప్రయోగం చేయడం ద్వారా పెట్టుబడి, సాగు పద్ధతులు, మార్కెట్ స్పందనను అంచనా వేసుకుంటున్నారు.

**పొలం గడప దాటి.. ఆన్‌లైన్ బాట**

చాలామంది రైతులకు పంట పండించిన తర్వాత మార్కెట్ వెతకడం పెద్ద సవాలు. జయరామ్ మాత్రం ఆ సమస్యకు ముందుగానే పరిష్కారం వెతుక్కున్నారు. 'పంట పండించాలి.. మార్కెట్‌ను కూడా మనమే నిర్మించుకోవాలి' అన్న ఆలోచనతో ఆన్‌లైన్ విక్రయాలపై దృష్టి పెట్టారు. వట్టి వేరు మొక్కలతోపాటు వేర్లను కూడా ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. దీంతో స్థానిక మార్కెట్ పరిధిని దాటి ఇతర ప్రాంతాల్లోని రైతులు, వినియోగదారులకు చేరుకునే అవకాశం లభిస్తోంది. సువాసన నుంచి పూజా సామగ్రి వరకు.. వట్టి వేరుకు పలు రంగాల్లో వినియోగం ఉండటంతో దీనికి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని జయరామ్ తెలిపారు. సువాసన కోసం, సుగంధ ద్రవ్యాల తయారీలో వాడటంతోపాటు పూజా కార్యక్రమాల్లోనూ వినియోగిస్తారు. మాలలు, దండల తయారీలోనూ దీనిని ఉపయోగిస్తారని చెప్పారు. వినియోగ పరిధి విస్తృతంగా ఉండటమే ప్రత్యేక పంటలకు మార్కెట్ అవకాశాలను పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.ఒక్క పంట' ఆలోచనకు చెక్ వ్యవసా యంలో ఒకే పంటపై ఆధారపడటం వల్ల మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం రైతుపై పడే అవకాశం ఉంటుంది. అందుకే సంప్రదాయ పంటలతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగులోకి తీసుకురావాలని జయరామ్ సూచిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేసి.. ఫలితాలను బట్టి విస్తరించడం ద్వారా పెద్ద నష్టాల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని ఆయన తన అనుభవంతో చెబుతున్నారు.

**ఐదు గుంటల నుంచి.. పెద్ద లక్ష్యం**

ఐదు గుంటల్లో ప్రారంభమైన వట్టి వేరు సాగును భవిష్యత్‌లో మరింత విస్తరిం చాలన్న లక్ష్యంతో జయరామ్ ముందుకు సాగుతున్నారు. సాగు మాత్రమే కాకుండా మొక్కల విక్రయం, ఉత్పత్తుల మార్కె టింగ్‌ను కలిపి ఆదాయ మార్గాలను విస్తరించాలనే ప్రయత్నం చేస్తున్నారు.సంప్రదాయ సాగు నుంచి వైవిధ్యమైన పంటల వైపు.. రసాయన సాగు నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు.. స్థానిక మార్కెట్ నుంచి ఆన్‌లైన్ మార్కెట్ వైపు— జయరామ్ వేసిన అడుగులు మారుతున్న వ్యవసాయానికి కొత్త దిశను చూపిస్తున్నాయి.

# హామీలు అమలు చేయడంలో ప్రభుత్వానికి అంగవైకల్యం



- దివ్యాంగుల హామీలు అమలు చేయాలి
- హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి విమర్శ
- కన్నీటి పర్యంతమైన దివ్యాంగులు

**మిరుదొడ్డి, అక్టోబర్ 6, వుదయం:**

ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి విమర్శించారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వానికే అంగవైకల్యం సోకినట్టుగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులతో కలిసి హనుమాన్ దేవాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.

కన్నీటి పర్యంతమైన దివ్యాంగులు శారీరక వైకల్యం కారణంగా కష్టపడి పనిచేసుకునే పరిస్థితి లేకపోవడంతో కనీసం మందులు కొనుగోలు చేసుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. దివ్యాంగులు గౌరవంగా జీవించేలా రూపొందించిన చట్టాలను కూడా సమర్థవంతంగా అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల కోటాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని తోట కమలాకర్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమం అనంతరం దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల్ రాజు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు , డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, నాయకులు అంజిరెడ్డి, లింగం ,సత్యనారాయణ, దివ్యాంగుల మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఐలయ్య, ఎల్లారెడ్డి, పరశురాములు, రాజేష్ పలువురు పాల్గొన్నారు.

# గీతాంజలి కళాశాలలో ఫ్రెషర్స్ డే



**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబరు 5 (వుదయం ప్రతినిధి):**

నాగర్‌కర్నూల్ పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో సోమవారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు సీనియర్లు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. నూతన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

**ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ..**

ఇంటర్మీడియట్ విద్య భవిష్యత్ విద్యాభ్యాసానికి కీలకమైన దశ అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలని అన్నారు.

**ఫ్రెషర్స్ డే వేడుకలతో నూతన విద్యార్థుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.**

కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు తీగల వెంకటస్వామి, కరస్పాండెంట్, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, డైరెక్టర్లు మాండ్ల ప్రవీణ్ కుమార్, ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ శరత్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సౌకర్యాలపై కలెక్టర్ పరిశీలన

**దామరగిద్ద అక్టోబర్ 6 (వుదయం ప్రతినిధి)**

దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల,కళాశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల భవనాన్ని పరిశీలించిన ఆమె, నిర్మాణ పనులు తుది దశలో ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులను ఫోన్ ద్వారా ఆదేశించారు.పాఠశాల ఆవరణలో ఫర్నిచర్ నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత భవనంలో పాఠశాల, కళాశాల తరగతుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఓ స్వాతి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నూతన భవనంలోని కింది అంతస్తులో ఉన్న అదనపు గదులను తరగతుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. ఉన్నత విద్యలో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నారని ప్రశ్నించగా, విద్యార్థినులు న్యాయ విద్యను అభ్యసించాలని ఉందని తెలిపారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి కనీసం డిగ్రీ వరకు విద్యను కొనసాగించాలని, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

వొకేషనల్ తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, వారి భవిష్యత్ విద్యా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ చదవాలనుకుంటున్నామని విద్యార్థినులు తెలపగా, జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాల అందుబాటులోకి రానుందని, విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినుల వద్దకు వెళ్లిన కలెక్టర్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. మెస్ కమిటీ విద్యార్థినులతో మాట్లాడి కూరగాయలు, నిత్యావసర సరుకుల నాణ్యత, భోజన నిర్వహణను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. మెనూ బోర్డును చూశారు.

పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.

డైనింగ్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, పక్షులు లోపలికి రాకుండా షెడ్ ఎత్తును పెంచి అవసరమైన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఓను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## వేరు శనగల విత్తనాల కోసం
# రైతులుఎదురుచూపు విత్తనం అందలేదు..బతుకు పండలేదు

- మాజీ సర్పంచ్ వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు

**ఊర్కొండ న్యూస్ 7 వుదయం ప్రతినిధి**

నాగర్కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు ఊర్కొండ రైతుల ఎదురుచూపులు.పంపిణీలో తీరని అసంతృప్తివిత్తు లేకుంటే మట్టి ముద్దే.. విత్తనం లేకుంటే రైతు బతుకు బుగ్గే. సభ్యత్వ ఆధారంగా కాకుండా.. కమతాల ఆధారంగా విత్తన పంపిణీ జరగాలి.

**మాజీ సర్పంచ్ వాగుల్దాస్ నిరంజన్ గౌడ్.**

ఊర్కొండ మండల రైతుల పరిస్థితి నేడు అలాగే ఉంది.నాలుగైదేళ్లుగా వేరుశనగ ధాన్యం పంటలనే నమ్ముకుని బతుకుతున్న అన్నదాతలకు,ప్రభుత్వం ప్రకటించిన 202627 తెలంగాణ పథకం కింద విత్తనాలు వచ్చినా,అవి అందరికీ అందడం లేదు.కొందరికి కొమ్ములు ,కొందరికి దుమ్ములు గా పథకం మారింది.విత్తనాలు వచ్చాయి ,కానీ కొందరికి మాత్రమే ముట్టాయి. మిగతా రైతులు చూస్తూనే ఉన్నారు. విత్తనం కోసం తిరుగుతూనే ఉన్నారు. పంపిణీలో పక్షపాతం,రైతుల్లో నిరుత్సాహం,అన్నట్లుగా మారింది.కాలువ గట్టున,కూలీ,నాలి చేసుకునే రైతు,విత్తనం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.విత్తనం వేసే సమయం



దాటిపోతే,పంట ఆలస్యం,బతుకు అస్తవ్యస్తం.రైతుల విన్నపం ఏమిటంటే ,అందరికీ సమానంగా,అర్హులైన ప్రతి రైతుకు పరివర్తన విత్తనాలు అందజేయాలని,PACS కల్వకుర్తి ద్వారా భూసార, వ్యవసాయ విస్తరణ అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.విత్తు అందాలి..బతుకు పండాలి.. రైతు నవ్వాలి!అన్నదే వారి ఆశ.రైతుల తీవ్రమైన గోసలు విని,మండల వ్యవసాయ అధికారిణి దీప్తి,సంబంధిత జిల్లా అధికారితో మాట్లాడి, రైతులకు పంపిణీ చేసిన తర్వాతే మిగిలిన విత్తన నిల్వలు పంపిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బిజెపి

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మోతీలాల్ నాయక్

**వెల్దండ అక్టోబర్ 6 (వు దయం)**



ఎన్నికల కమిషన్ ముసుగులో దేశ వ్యాప్తంగా ప్రజల ఓట్లను గల్లంతు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి,దిశ కమిటీ జిల్లా సభ్యులు ఎం.మోతీలాల్ నాయక్ ఆరోపించారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను,ప్రజాస్వామ్య పునాదులను కూల్చే కుట్రలో భాగంగానే ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా దళిత,ఆదివాసీ, గిరిజన,బడుగు,బలహీన,ముస్లిం,మైనార్టీ వర్గాల ప్రజల ఓట్ల తొలగింపే లక్ష్యంగా నరేంద్ర మోడీ, అమిత్ షాలు కేంద్ర ఎన్నికల కమిషన్ చాటున ఓట్ల చోరీ చేస్తూ ప్రజాస్వామ్య దేశాన్ని విచ్ఛిన్నం చేసి మత రాజ్య స్థాపన కోసం కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. దేశ ఐక్యత కోసం,ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తున్న ఈ తరుణంలో మళ్ళీ ప్రజాస్వామ్య హక్కులను తుంగలో తొక్కి అధికార అహంకారంతో మత,కుల, ప్రాంత విద్వేషాలతో ఓట్ల తొలగింపుకు బిజెపి ప్రభుత్వం తెరలేపిందని ఆయన పేర్కొన్నారు.బిజెపి ప్రభుత్వం ఒక పక్క అన్ని రంగాలలో దేశాన్ని దోపిడీ చేస్తూ మరో పక్క రాజ్యాంగాన్ని తొలగించే కుటీల బుద్ధిని ప్రశ్నిస్తూ ఎన్నికల కమిషన్ చైర్మన్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్టు చేయాలని ఎన్నికల కమిషన్ కేంద్ర కార్యాలయాన్ని ప్రజాస్వామ్య యుతంగా వెళ్తున్న ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలతో పాటు పార్లమెంట్ సభ్యులను నేడు అనైతికంగా,అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డు
# అందుకున్న మునిపల్లి మండల యువకుడు

- బుసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారి మహిపాల్‌కు అరుదైన గౌరవం

**మునిపల్లి (వుదయం):**



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ ఫిలిం మేకర్ బండారి మహిపాల్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డు అందుకొని గ్రామానికి, మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ రంగాల్లో తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్న మహిపాల్‌కు ఫోటో పరివార్ ఇండియా సంస్థ ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేసింది.బండారి మహిపాల్ ఎం.కాం విద్యను 2017లో పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తన అభిరుచికి అనుగుణంగా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నారు. తన పెద్దన్న బండారి పాండు వద్ద ఫోటోగ్రఫీలో తొలి శిక్షణ పొందిన మహిపాల్, చిన్ననాటి నుంచే కెమెరా కళపై ఆసక్తి పెంచుకున్నారు. వారి అన్న చిత్రీకరించిన పలు ఛాయాచిత్రాలు, వీడియోలు తనకు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు.బండారి కుటుంబానికి ఫోటోగ్రఫీతో ప్రత్యేక అనుబంధం ఉంది. పెద్దన్న బండారి పాండు 1996లో విద్యార్థి దశలోనే ఫోటోగ్రఫీని ప్రారంభించగా, రెండో సోదరుడు బండారి సుభాష్ కూడా ఇదే రంగంలో స్థిరపడి సదాశివపేటలో జయచరణ్ డిజిటల్ స్టూడియోను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సోదరుల ప్రోత్సాహంతో మహిపాల్ కూడా ఈ రంగంలో ప్రవేశించి, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడి పలువురు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

తెలంగాణ జానపద సంస్కృతి, వెడ్డింగ్ ఫిల్మ్స్, సినీమాటిక్ వీడియోలు, డాక్యుమెంటరీలు, ఫోక్ కల్చర్ చిత్రీకరణలో తనదైన శైలిని కనబరుస్తూ మహిపాల్ ప్రత్యేక గుర్తింపు పొందారు. వివిధ గురువుల వద్ద శిక్షణ పొంది ఆధునిక చిత్రీకరణ పద్ధతులను అవలంబిస్తూ అనేక ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభినందించారు.ఈ సందర్భంగా బండారి మహిపాల్ మాట్లాడుతూ, తనకు ఈ అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందని, తన విజయానికి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పెద్దన్న బండారి పాండు మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని తెలిపారు. తన ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డుతో సత్కరించిన ఫోటో పరివార్ ఇండియా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, తెలంగాణ ఫోటోగ్రఫీ సంక్షేమ సంఘం కోశాధికారి మునగాల శైలేందర్, రాష్ట్ర ఫోక్ ఫోటోగ్రఫీ సంఘం ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, ఫోటో టెక్ అభిమన్యరెడ్డి, ఎడిట్ పాయింట్ ఇప్పలపల్లి రమేష్, చారి, కరిపే రాజు తదితరులు పాల్గొని మహిపాల్‌ను అభినందించారు.రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడంతో బుసారెడ్డిపల్లి గ్రామ ప్రజలు, మునిపల్లి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తూ మహిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# గుంతపల్లి కుంటలో వెలిసిన వెంచర్‌పై హైడ్రాకు పిర్యాదు

- పిర్యాదు చేస్తానంటున్న మున్సిపల్ ప్రజలు

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 6 (వుదయం) :**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట్ రోడ్డుకు అనుకోని వెలిసిన వెంచర్ నిర్మాణంపై ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వెంచర్ నిర్మాణం గుంతపల్లి కుంట కాల్వను ధ్వంసం చేసి ఉన్న కాల్వను తీసివేసి మరోక చోట కాల్వను తవ్వేరాని ఈ విషయంపై ఈ వెంచర్ నిర్మాణంపై హైడ్రాకు పిర్యాదు చేస్తామని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలు జలమోని రవీందర్ , చంద్రపూరి కాలనీ వాసులు రాజీరెడ్డి , అమరేందర్‌రెడ్డి, రఘుమారెడ్డి, భాషయ్య , మల్లికార్జున్ హైడ్రాకు, ఇరిగేషన్ శాఖ మంత్రికి పిర్యాదు చేస్తామని వుదయం పత్రికతో తెలిపారు. ఇలా గుంతపల్లి కుంట కాల్వ ధ్వంస చేయడం అమానుషమని గుంతపల్లి కుంటలో నీళ్లు ఉంటే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలకు తాగు నీటి సమస్య ఉండదని ఇలా కాల్వలు ధ్వంసం చేస్తే ఊరుకోబోమని ఆ వెంచర్‌పై ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.





# విద్యా ప్రమాణాలపై కఠిన పర్యవేక్షణ

- ధరూర్ మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి విస్తృత తనిఖీలు
- విద్యార్థుల హాజరు నుంచి రికార్డుల వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- బాలికల విద్యాలయంలో భోజనం, నిల్వల నాణ్యతపై ఆరా.. ప్రాథమిక పూర్వ విద్యలో ఆటల ఆధారిత బోధనపై సమీక్ష

**ధరూర్ అక్టోబర్ 06 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, పారదర్శకతపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి కె. విజయలక్ష్మి ధరూర్ మండలంలోని పలు విద్యాసంస్థలను సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు.పాఠశాలల పనితీరును కేవలం రికార్డుల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తూ విద్యార్థుల అభ్యసన, హాజరు, మౌలిక వసతులు, భోజన నాణ్యత, బోధన విధానాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు. బాలికల విద్యాలయంలో సమగ్ర తనిఖీ ధరూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి.. తరగతి గదుల్లో విద్యార్థినులు రాస్తున్న సమ్మేటివ్ అంచనా పరీక్షలను పరిశీలిం చారు. విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశాలను గమనించారు. అనంతరం నిల్వ గదిని తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉన్న వస్తువుల నాణ్యత, వినియోగ గడువు, నిల్వ విధానం తదితర అంశాలను పరిశీలించారు. వస్తువుల వినియోగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన ఆమె.. పాఠశాలలో అందిస్తున్న ఆహార పట్టిక, భోజనం నాణ్యత, రుచిపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనంపై వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేశారు.ప్రాథమిక పూర్వ విద్యపై ప్రత్యేక సమీక్షతదుపరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ధరూర్ ప్రాథమిక పూర్వ విద్యా విభాగాన్ని సందర్శించిన జిల్లా విద్యా శాఖాధికారి.. చిన్నారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. ప్రాథమిక పూర్వ విద్యా బోధకుడితో మాట్లాడి బోధనా విధానం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హాజరు పట్టికలతో పాటు ఆటల సామగ్రి నమోదు పుస్తకాన్ని పరిశీలించారు. చిన్నారుల అభ్యసనలో ఆటల సామగ్రిని నిరంతరం, సక్రమంగా, ఉద్దేశ్యపూర్వకంగా వినియోగిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఆటల ఆధారిత అభ్యసనం ద్వారా చిన్నారుల్లో ప్రాథమిక నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా బోధన కొనసాగించాలని సూచించారు. ఫీజు వివరాలపై స్పష్టమైన ఆదేశాలు ధరూర్‌లోని శ్రీ లక్ష్మి కాన్సెప్ట్ పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి.. పాఠశాలలో ఫీజు నిర్మాణాన్ని నిబంధనల ప్రకారం బహిరంగంగా ప్రదర్శించారా లేదా అని పరిశీలించారు. ఫీజు వివరాలు ప్రదర్శించలేదని గుర్తించిన ఆమె.. విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టంగా తెలిసే విధంగా ఫీజు నిర్మాణాన్ని తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కు సూచించారు. పాఠశాల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యా సమాచార నమోదు వ్యవస్థలోని తొలగింపు ప్రక్రియకు సంబంధించిన పురోగతిని పరిశీలించారు. పాఠశాల హాజరు పట్టికలను తనిఖీ చేసి, పాఠశాలలో వాస్తవంగా ఉన్న విద్యార్థుల సంఖ్యను విద్యా సమాచార వ్యవస్థలో నమోదైన విద్యార్థుల సంఖ్యతో సరిపోల్చి ధ్రువీకరించారు. పాఠశాల రికార్డులు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా చూడాల్సిన అవసరాన్ని సూచించారు. నాణ్యత.. పారదర్శకత.. బాధ్యత జిల్లా విద్యా శాఖాధికారి పర్యటనలో విద్యార్థుల అభ్యసన ప్రమాణాలు, హాజరు, పాఠశాల రికార్డుల నిర్వహణ, నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాలు, పారదర్శకత, ప్రాథమిక పూర్వ విద్యలో ఆటల ఆధారిత బోధన వంటి కీలక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందాల్సిన విద్యా, సంక్షేమ సేవలు నాణ్యతతో అమలవుతున్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా బాధ్యతాయుతమైన పాఠశాల నిర్వహణకు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి పర్యటన స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు యోగేందర్, సంక్లిష్ట వనరుల వ్యక్తి నర్సింహులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## పిల్లుల్లో క్యాన్సర్ అధ్యయనం ద్వారా మనుషుల్లో చికిత్స..

పిల్లుల్లో వచ్చే క్యాన్సర్‌కు సంబంధించిన జన్యుపరమైన మార్పులపై శాస్త్రవేత్తలు ఇప్పటివరకు పెద్దగా తెలియని అంశాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ అధ్యయనంలో దాదాపు 500 పెంపుడు పిల్లుల్లోని క్యాన్సర్ కణితుల నమూనాలను పరిశీలించారు. ఐదు దేశాలకు చెందిన పిల్లుల



నుంచి సేకరించిన కణితి నమూనాల్లో క్యాన్సర్ ఏర్పడడానికి, పెరగడానికి కారణమయ్యే జన్యు మార్పులను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ పరిశోధన ద్వారా పిల్లుల్లో క్యాన్సర్‌ను మరింత కచ్చితంగా గుర్తించి చికిత్స అందించేందుకు మార్గం సుగమం కావడంతో పాటు, మనుషుల్లో క్యాన్సర్ ఎలా అభివృద్ధి చెందుతుంది, మందులకు ఎలా స్పందిస్తుంది అనే అంశాలపై కూడా కొత్త అవగాహన లభించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. పిల్లుల్లో క్యాన్సర్ అనారోగ్యం, మరణానికి ప్రధాన కారణాల్లో ఒకటైనా, మనుషులు లేదా కుక్కల్లో వచ్చే క్యాన్సర్‌తో పోలిస్తే పిల్లుల కణితుల్లోని జన్యు మార్పులపై ఇప్పటివరకు పరిమిత సమాచారం మాత్రమే ఉంది. కణాల పెరుగుదల, విభజన, దెబ్బతిన్న కణాల మరమ్మత్తు, కణాల

మరణాన్ని నియంత్రించే కొన్ని జన్యువుల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు క్యాన్సర్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి క్యాన్సర్‌ను ప్రేరేపించే జన్యువులను క్యాన్సర్ డ్రైవర్ జీన్స్ గా పిలుస్తారు. పిల్లుల్లో గుర్తించిన అనేక డ్రైవర్ జన్యువులు మనుషులు, కుక్కల్లో కనిపించే క్యాన్సర్లలోనూ ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ముఖ్యంగా రొమ్ము కణజాలంలో ఏర్పడే దూకుడు స్వభావం కలిగిన కణితుల్లో ఎఫ్‌బీఎక్స్‌డబ్ల్యూ7 జన్యు మార్పు ఎక్కువగా కనిపించింది. పరిశీలించిన పిల్లుల రొమ్ము కణితుల్లో 50 శాతానికి పైగా ఈ జన్యువులో మార్పు ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా కణాల పెరుగుదల, విభజనకు సంబంధించిన ప్రోటీన్లను నియంత్రించడంలో ఈ జన్యువు సహాయపడుతుంది. ఇందులో మార్పులు వచ్చినప్పుడు కొన్ని వృద్ధిని ప్రోత్సహించే ప్రోటీన్లు పేరుకుపోయి క్యాన్సర్ కణాలు జీవించి, వ్యాప్తి చెందేందుకు సహాయపడే అవకాశం ఉంటుంది. మనుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్‌లో ఈ జన్యు మార్పులు అధ్వాన్నమైన ఫలితాలతో సంబంధం కలిగి ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. పిల్లులు మనుషులతో ఒకే వాతావరణంలో జీవించడం వల్ల ఈ పరిశోధనకు మరో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంట్లో ఉపయోగించే కొన్ని రసాయనాలు, వాయు కాలుష్యం, పొగ వంటి పర్యావరణ ప్రభావాలకు పిల్లులు కూడా గురవుతాయి. అందువల్ల సహజంగా పిల్లుల్లో ఏర్పడే క్యాన్సర్‌ను అధ్యయనం చేయడం ద్వారా జన్యువులు, పర్యావరణం కలిసి క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఎఫ్‌బీఎక్స్‌డబ్ల్యూ7 జన్యువులో మార్పు ఉన్న పిల్లుల రొమ్ము కణితుల కణజాల నమూనాల్లో కొన్ని కీమోథెరపీ మందులు మెరుగ్గా పనిచేసినట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ ఫలితం కేవలం కణజాల నమూనాలపై మాత్రమే కనిపించింది. జీవించి ఉన్న పిల్లులు లేదా మనుషుల్లో ఇదే విధంగా పనిచేస్తుందని నిర్ధారించడానికి మరిన్ని పరిశోధనలు అవసరం. అయినప్పటికీ, కణితిలోని జన్యు లక్షణాల ఆధారంగా సరైన చికిత్సను ఎంచుకునే ప్రెసిషన్ ఆంకాలజీ విధానానికి ఇది ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ పరిశోధన మనుషులు, జంతువుల వైద్య రంగాల మధ్య పరస్పర సహకారానికి కూడా ఉపయోగపడుతుందని

శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. పిల్లుల్లో సహజంగా ఏర్పడే క్యాన్సర్లను అధ్యయనం చేయడం ద్వారా లభించే సమాచారం భవిష్యత్తులో మనుషుల్లో క్యాన్సర్ పరిశోధనకు ఉపయోగపడుతుంది. అదే విధంగా మనుషుల్లో అభివృద్ధి చేసిన కొన్ని క్యాన్సర్ చికిత్సలను సహజంగా కణితులు ఏర్పడిన జంతువుల్లో పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది. ఈ విధానాన్ని వన్ మెడిసిన్ గా పేర్కొంటారు. పరిశోధకులు రూపొందించిన పిల్లుల క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు సమాచార వనరు ఇతర శాస్త్రవేత్తలకు కూడా అందుబాటులో ఉండనుంది. దీని ద్వారా భవిష్యత్తులో పిల్లుల్లో క్యాన్సర్‌ను మరింత ముందుగానే గుర్తించడం, కణితి లక్షణాలకు అనుగుణంగా చికిత్సను ఎంచుకోవడం వంటి వ్యక్తిగతీకరించిన వైద్య విధానాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని పరిశోధకులు ఆశిస్తున్నారు.

## ఉదయం అల్పాహారంగా ఇవి తింటే కడుపు ఉబ్బరానికి చెక్..!

రోజులో తొలి భోజనం అల్పాహారం. అయితే ఉదయం పూట ప్లేట్‌లో తీసుకునే ఆహారం ప్రభావం గంటల తరబడి జీర్ణాశయంపై ఉంటుంది. జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పట్టే కొన్ని సాధారణ అల్పాహార పదార్థాలు కడుపు ఉబ్బరానికి కారణమవుతాయి. తేలికగా ఉండే ఆహారాన్ని ఉదయం తీసుకోవడం ద్వారా కడుపుపై భారం తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ నిపుణుడు సౌరభ్ సేథి ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో కడుపు ఉబ్బరాన్ని నివారించేందుకు సహాయపడే ఏడు రకాల అల్పాహారాలను సూచించారు. కడుపు ఉబ్బరాన్ని నివారించేందుకు చియా గింజలు, బ్లూబెర్రీలతో తయారు చేసిన ఓవర్ నైట్ ఓట్స్ ఒక మంచి ఎంపిక. ఓట్స్, చియా గింజల్లో పీచు పదార్థం సమృద్ధిగా ఉంటుంది. బ్లూబెర్రీలను తక్కువ మోతాదులో తీసుకుంటే సాధారణంగా సులభంగా జీర్ణమవుతాయి. మరో ఎంపికగా గుడ్లతోపాటు సవర్‌డో బ్రెడ్‌ను తీసుకోవచ్చని సూచించారు. గుడ్లలో జీర్ణ సమస్యలకు కారణమయ్యే పులియబెట్టగలిగే కార్బొహైడ్రేట్లు దాదాపుగా ఉండవు. సాంప్రదాయ పద్ధతిలో తయారయ్యే సవర్‌డో బ్రెడ్ కూడా కొన్ని ఇతర రకాల బ్రెడ్‌లతో పోలిస్తే సులభంగా జీర్ణమయ్యే అవకాశం ఉంది. ఉదయం అల్పాహారంగా సాదా దోసెను కూడా తీసుకోవచ్చని సౌరభ్ సేథి సూచించారు. పులియబెట్టిన బియ్యం, పప్పు పిండితో తయారయ్యే సాదా దోసె సాపేక్షంగా సులభంగా జీర్ణమయ్యే అల్పాహారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దోసెలో వేసే పూరణను సాదాగా ఉంచడంతో పాటు, పక్కన సాంబార్‌ను తీసుకోవచ్చని తెలిపారు. లాక్టోస్ లేని గ్రీక్ యోగర్ట్‌తో స్ట్రాబెర్రీలను కలిపి తీసుకోవడం కూడా మరో మంచి ఎంపిక. ఈ కలయిక ద్వారా ప్రోటీన్, ఇతర పోషకాలు లభిస్తాయి. ఇందులో లాక్టోస్ ఉండదు. లాక్టోస్‌ను సరిగ్గా జీర్ణించుకోలేని వారికి అది కడుపు ఉబ్బరానికి కారణమయ్యే అవకాశం ఉంటుంది. కివీతో చియా పుడ్డింగ్‌ను కూడా అల్పాహారంగా తీసుకోవచ్చని సూచించారు. కివీ పండ్లు పేగుల కదలికలను క్రమబద్ధం చేయడంలో సహాయపడతాయి. నానబెట్టిన చియా గింజల్లో కరిగే పీచు పదార్థం ఉంటుంది. అలాగే అరటి పండు, వాల్‌నట్స్‌తో ఓట్‌మీల్‌ను తీసుకోవచ్చని సూచించారు. ఈ కలయిక ద్వారా పీచు పదార్థంతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. పాలకూర, గుడ్లతో తయారు చేసిన ఆమ్లెట్ కూడా సులభమైన అల్పాహార ఎంపికగా ఉంటుంది. ఇందులో ప్రోటీన్ అధికంగా ఉండడంతో పాటు, జీర్ణ సమస్యలకు కారణమయ్యే పులియబెట్టగలిగే కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఉల్లిపాయలు లేదా వెల్లుల్లి తిన్న తర్వాత కడుపు ఉబ్బరం మరింత పెరుగుతుందని ఎవరైనా గమనిస్తే, ఆమ్లెట్‌లో వాటిని ఉపయోగించకుండా ఉండవచ్చని సూచించారు.



## మొండితనం కాదు... నిద్రలేమి!

నాలుగేళ్ల అన్విత సాయంత్రమైతే చాలు..చిన్న చిన్న విషయాలకే బాగా విసిగిస్తుంది. బొమ్మలను విసిరేస్తుంది. రెండో తరగతి చదివే రిత్విక్ స్కూలుకి వెళ్లడానికే కాదు... తిరి



గొచ్చాక కూడా ఊరికే అరుస్తాడు. వీళ్లిద్దరి తల్లిదండ్రులూ మొదట తమ పిల్లలది మొండితనమే అనుకున్నారు. నిపుణుల దగ్గరకు తీసుకెళ్తే నిశితంగా గమనించి వాళ్లకి తగినంత నిద్ర లేదన్నారు. అది మొదలు కనీసం 10 గంటలు పడుకునేలా జాగ్రత్తలు తీసుకోవడం ఆరంభించారు. ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. చిన్నారులు తమకు నిద్ర సరిపోవడం లేదని స్పష్టంగా చెప్పలేరు. కానీ వాళ్లు నడుచుకునే తీరు ద్వారా ఆ విషయాన్ని మనం గుర్తించవచ్చు.

చిన్న విషయాలకే ఓపిక కోల్పోవడం, విపరీతమైన కోపం. అలసటతో నిద్రపోవడానికి బదులు హైపర్ యాక్టివ్‌గా మారడం. ఉదయం లేవడానికి కష్టపడటం, లేచాక చాలా సమయం బద్ధకంగా ఉండటం. ఆటలు, చదువు... దేనిమీదా దృష్టి సారించలేకపోవడం.. రోగనిరోధక శక్తి తగ్గి, తరచూ జలుబు, జ్వరం, ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడటం... వంటివి చాలానే ఉన్నాయి. హాయిగా నిద్రపోవాలంటే... నిద్రకు నిర్దిష్ట సమయాన్ని కేటాయించండి. పడుకునే ముందు గోరువెచ్చని నీటితో స్నానం చేయించండి. వేడి పాలు తాగించడం, కథలు చెప్పడం వంటి పనుల ద్వారా చిన్నారులను నిద్రకు సిద్ధం చేయవచ్చు. నిద్రపోవడానికి కనీసం గంట ముందు టీవీ, మొబైల్, ట్యాబ్ వంటివి వాడనివ్వొద్దు. తెర వెలుగు మెదడును మేల్కొల్పి ఉంచుతుంది. పడుకునే గది ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోండి. పిల్లలు నిద్రపోనప్పుడు కోప్పడకుండా, వారి పక్కన పడుకుని ఓదార్పునివ్వడం, తల నిమురుతూ కథలు చెప్పడం, పాటలు పాడటం వంటివి చేయండి. ఇవన్నీ వాళ్లకి అభద్రతను దూరం చేస్తాయి. సులువుగా నిద్రపోతారు. పిల్లల వయసును బట్టి నిద్ర అవసరాలు మారుతాయి కనీసం 10–12 గంటల పాటు హాయిగా నిద్రపోయేలా చూడండి. ఆటపాటల్లో చురుగ్గా, ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

## ఈ అలవాట్లు దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయట!

మరీ ఎక్కువసేపు బ్రష్ చేయకూడదన్న విషయం తెలిసిందే! అలాగని మరీ తక్కువ సమయం కూడా బ్రషింగ్‌కి సరిపోదంటున్నారు నిపుణులు. కనీసం రెండు నిమిషాలైనా దీనికి కేటాయించి.. ఈ వ్యవధిలో దంతాలు, చిగుళ్లు, పళ్ల వెనక భాగాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి



అంటున్నారు. అలాగే ఈ క్రమంలో డెంటల్ ఫ్లాస్ ప్రక్రియను పాటించడం మర్చిపోకూడదు. దీనివల్ల పళ్ల మధ్యలో ఇరుక్కున్న పదార్థాల అవశేషాలు తొలగిపోయి పాచి పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు.

కొంతమంది బ్రషింగ్ బాగానే చేస్తారు.. కానీ నాలుక సంగతి మర్చిపోతుంటారు.. ఏదో అలా పైపైన శుభ్రం చేసుకుంటుంటారు. అయితే నాలుకను సరిగ్గా శుభ్రం చేసుకోవడం కూడా బ్రషింగ్‌లో ఓ ముఖ్య భాగం అంటున్నారు నిపుణులు. లేదంటే దానిపై బ్యాక్టీరియా పేరుకుపోయి నోటి దుర్వాసనకు కారణమవుతుందని చెబుతున్నారు.

కొంతమందికి చల్లటి పదార్థాలు నోట్లో వేసుకోగానే పళ్లు జివ్వుమంటాయి.. మరికొందరికి ఏమీ అనిపించదు. కానీ ఈ అలవాటు దంత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. దీనివల్ల దంతాలపై ఉన్న ఎనామిల్‌పై కనిపించని పగుళ్లు ఏర్పడి.. క్రమంగా అది దంతాల డ్యామేజ్‌కి కారణమవుతుందంటున్నారు. కాబట్టి మరీ చల్లటి పదార్థాలు తీసుకోకపోవడమే మంచిదని చెబుతున్నారు. కొంతమందికి చిరుతిండ్లు అధికంగా తినే అలవాటుంటుంది. ఈ క్రమంలో ఎప్పుడు చూసినా ఏదో ఒకటి నములుతూనే ఉంటారు. ఇలా విరామం లేకుండా తినడం వల్ల ఆయా పదార్థాల్లోని ఆమ్లత్వాన్ని నోట్లోని లాలాజలం తటస్థీకరించలేకపోతుందట! దీనివల్ల దంతక్షయం వచ్చే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి గ్యాప్ లేకుండా తినే అలవాటును మానుకోమంటున్నారు. అలాగే దంతాల ఆరోగ్యాన్ని పెంచే ఆహారం తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఇందులోనూ ముఖ్యంగా ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు, పాలు–పాల పదార్థాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే పదార్థాలు.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ముఖ్యమంటున్నారు. ఆమ్ల గుణాలతో కూడిన కొన్ని రకాల పండ్లు, పానీయాలు, వంటకాలు.. మొదలైన వాటిని (నిమ్మ, ద్రాక్ష, కమలా.. మొదలైనవి) తిన్న వెంటనే బ్రష్ చేస్తుంటారు కొందరు. దీనివల్ల పళ్లపై ఉన్న ఎనామిల్ తొలగిపోతుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆమ్లత్వం ఎనామిల్‌ని బలహీనపరుస్తుందట! కాబట్టి ఈ పదార్థాలు తిన్న వెంటనే కాకుండా.. ఓ అరగంట ఆగి బ్రష్ చేసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే పళ్లు తోముకునేటప్పుడు కూడా బలంగా కాకుండా.. నెమ్మదిగా, మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌ని ఉపయోగించడం మేలంటున్నారు. ఈ అలవాట్లు పాటించడంతో పాటు దంతాలు, చిగుళ్లు, నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలేవైనా ఎదురైతే మాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం తప్పనిసరి అని గుర్తుంచుకోవాలి. తద్వారా సమస్య తీవ్రం కాకముందే నయం చేసుకోవచ్చు అని సూచిస్తున్నారు.

## కంటి పరీక్షలను నిర్వహించడం ద్వారా గుండె జబ్బులను ముందుగానే తెలుసుకోవచ్చు..

కంటి పరీక్ష అంటే కేవలం చూపు సమస్యలు, కంటి ఒత్తిడి లేదా ఇతర కంటి వ్యాధులను గుర్తించడమే కాదు. మన శరీరంలోని రక్తనాళాలను కోత లేకుండా, ఎలాంటి రంగు ద్రావణం ఇంజెక్షన్ అవసరం లేకుండా, నేరుగా పరిశీలించగలిగే ఏకైక ప్రదేశం కంటి వెనుక భాగంలోని రెటీనా. రెటీనా మెదడుకు ఒక విస్తరణగా ఉండడంతోపాటు, అందులోని చిన్న రక్తనాళాలు శరీరంలోని సూక్ష్మ రక్తనాళాల పరిస్థితిని ప్రతిబింబిస్తాయి. అందువల్ల సాధారణ కంటి పరీక్షల్లో కనిపించే కొన్ని



మార్పులు భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యలకు ముందస్తు సంకేతాలుగా ఉపయోగపడే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అధిక రక్తపోటు, వాపు లేదా అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు రక్తనాళాల గోడలను దెబ్బతీసినప్పుడు, ఆ ప్రభావం కంటి వెనుక భాగంలోని రెటీనాలో కూడా కనిపించే అవకాశం ఉంటుంది. రెటీనా స్కాన్‌లో రక్తనాళాలు సన్నబడడం, ధమనులు గట్టిపడటం, ధమనులు–సిరలు కలిసే ప్రాంతాల్లో మార్పులు, చిన్న రక్తస్రావాలు వంటి లక్షణాలను గుర్తించవచ్చు. అధిక రక్తపోటు కారణంగా రెటీనా ధమనుల గోడలు మందంగా మారి రక్తప్రసరణకు అందుబాటులో ఉండే స్థలం తగ్గుతుంది. అలాగే గట్టిపడిన ధమనులు వాటి కిందుగా వెళ్లే సిరలపై ఒత్తిడి కలిగించడం వల్ల ప్రత్యేకమైన మార్పులు కనిపిస్తాయి. రక్తనాళాల అంతర్గత పొర దెబ్బతినడం వల్ల చిన్న లీకేజీలు లేదా సూక్ష్మ రక్తస్రావాలు కూడా కనిపించే వీలు ఉంది. అరుదైన సందర్భాల్లో పసుపు రంగులో కనిపించే కొలెస్ట్రాల్ ముక్కలు రెటీనాలో గుర్తించబడతాయి. ఇవి కనిపిస్తే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది. సాధారణంగా గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేయడానికి వయస్సు, ధూమపానం, కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి అంశాల ఆధారంగా ప్రమాద అంచనా పద్ధతులను వైద్యులు ఉపయోగిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈ అంచనాల్లో మధ్యస్థ ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్లో భవిష్యత్తులో అకస్మాత్తుగా గుండె సంబంధిత సమస్యలు వస్తాయి. ఈ నేపథ్యంలో రెటీనా చిత్రాలను విశ్లేషించే కృత్రిమ మేధ ఆధారిత పద్ధతులు రక్తనాళాల వెడల్పు, మెలికలు, శాఖలుగా విడిపోయే విధానం వంటి అంశాలను పరిశీలించి రక్తనాళాల వయస్సును అంచనా వేయడానికి ఉపయోగపడుతున్నాయి. యూకే బయోబ్యాంక్ ఆధారంగా నిర్వహించిన పరిశోధనల్లో రెటీనా రక్తనాళాల ఆధారిత అంచనాలు గుండెపోటు, పక్షవాతం ప్రమాదాన్ని సంప్రదాయ ప్రమాద అంచనా పద్ధతులకు సమానంగా అంచనా వేయగలవని తేలింది.

## రంగు మార్చే మొరాకో లిప్ పాట్!



బ్యూటీ, ఫ్యాషన్ ట్రెండ్స్ క్షణాల్లో మారిపోతుంటాయి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల వల్ల వాటిల్లో కొన్ని తెగ వైరల్ అవుతుంటాయి. అలా ఈ మధ్యకాలంలో అమ్మాయిలను బాగా ఆకట్టుకుంటోన్న బ్యూటీ ప్రొడక్ట్ మొరాకో లిప్ పాట్. దీన్ని అక్కడ అసర్ ఫస్సీ అని పిలుస్తారు. ఎండిన ఎర్రటి గసగసాల పూల రేకలు, దానిమ్మ తొక్కల పొడిని కలిపి ప్రత్యేకమైన మట్టి పాత్రల్లో తయారు చేస్తారు. అయితే, ఈ రంగుని సాధారణ లిప్‌బామ్‌లా నేరుగా పూసుకోలేం. వేలిని లేదా చిన్న బ్రష్‌ను రోజ్‌వాటర్‌తో తడి చేసుకుని దానిపై రుద్దితే సరి. రంగు అంటుకుంటుంది. లిప్‌కలర్‌లానే కాదు... కొందరు బుగ్గలకు బ్లష్‌లానూ వాడతారు. ఇంతకీ ఈ ఉత్పత్తి ప్రత్యేకత ఏంటంటారా? పెదవుల పీహెచ్ విలువను బట్టి రంగు మారుతుంది. నేచురల్ పింక్ లేదా రోజీ గ్లోలో అధరాలు మెరిసిపోతాయి. తేమగా, తాజాగా ఉంటాయి. అందుకే, రసాయనాలు లేని ఈ ఉత్పత్తి ఇప్పుడు అందరి మనసుల్నీ దోచుకుంటోంది.

## వయస్సు పెరుగుతున్నకొద్దీ మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవాలి..

మనిషి ఆలోచించడం, జ్ఞాపకాలను గుర్తుంచుకోవడం, ఇతరులతో మాట్లాడడం, చుట్టూ ఉన్నవారితో సంబంధాలు ఏర్పరచుకోవడం వంటి ప్రతి అంశంలో మెదడు కీలక పాత్ర పోషిస్తుంది. అయితే మెదడు ఆరోగ్యంపై అవగాహన చాలాసార్లు జ్ఞాపకశక్తి తగ్గడం లేదా ఇతర మార్పులు స్పష్టంగా కనిపించిన తర్వాతే మొదలవుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరింత ముఖ్యమవుతోంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో స్వతంత్రంగా జీవించడానికి, సామాజికంగా చురుకుగా ఉండటానికి, రోజువారీ పనులను సక్రమంగా నిర్వహించడానికి మెరుగైన జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం అవసరం. వయసుతో వచ్చే జ్ఞాపకశక్తి క్షీణత కొందరిలో డిమెన్షియాకు దారితీసే అవకాశం ఉంది. అందుకే మెదడు ఆరోగ్యంపై చిన్న వయసు నుంచే దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మెదడులో జీవసంబంధమైన మార్పులు మొదటి జ్ఞాపకశక్తి లోపం కనిపించక ముందే ప్రారంభమవుతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలోని గుండె, జీర్ణవ్యవస్థ, కాలేయం ఆరోగ్యం కూడా మెదడు పనితీరుతో పరస్పరం అనుసంధానమై ఉంటాయి. జీవితాంతం మెదడును చురుకుగా ఉంచడం ద్వారా కాగ్నిటివ్ రిజర్వ్ ను పెంచుకోవచ్చు. ఇది వయసుతో వచ్చే మార్పులు, మెదడు కణాల పనితీరు తగ్గినప్పటికీ ఆలోచనా సామర్థ్యాన్ని కొంతకాలం మెరుగ్గా కొనసాగించడంలో సహాయపడుతుంది. మెదడు ఆరోగ్యాన్ని భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఆర్థిక భద్రత కోసం సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేసినట్లే, మెదడు ఆరోగ్యానికి కూడా జీవితాంతం మంచి అలవాట్లను కొనసాగించడం అవసరం. దీనికోసం ప్రత్యేకమైన లేదా కష్టమైన పద్ధతులు పాటించాల్సిన అవసరం లేదు. రోజువారీ జీవితంలో పాటించే ఆరోగ్యకరమైన అలవాట్లే మెదడుకు బలమైన, అనుకూలమైన నాడీ సంబంధాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. అదే సమయంలో మెదడు పనితీరులో మార్పులకు సంబంధించిన కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. తరచూ స్వల్పకాలిక విషయాలను మర్చిపోవడం, ఒకే ప్రశ్నను పదేపదే అడగడం, రోజువారీ వస్తువులను తరచూ ఎక్కడ పెట్టారో మర్చిపోవడం, పరిచయమైన పదాలను గుర్తు చేసుకోవడంలో ఇబ్బంది పడడం, సాధారణ పనులు చేయడంలో సమస్యలు ఎదురవడం లేదా బాగా తెలిసిన ప్రదేశాల్లోనే దారి తప్పడం వంటి లక్షణాలను వృద్ధాప్యంలో సహజమైన మార్పులుగా భావించకూడదు. ఇవి ప్రతిసారీ డిమెన్షియాకు సంకేతాలు కాకపోయినా, వైద్యుల ద్వారా కారణాన్ని తెలుసుకోవడం అవసరం. డిప్రెషన్ లేదా విటమిన్ బి12 లోపం వంటి కొన్ని కారణాలను గుర్తించి చికిత్స చేయడం ద్వారా సమస్యను పూర్తిగా తగ్గించే అవకాశం కూడా ఉంటుంది.



మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రతిరోజూ చేసే జీవనశైలి ఎంపికలు కీలకంగా ఉంటాయి. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల మెదడుకు రక్తప్రసరణ మెరుగుపడి కొత్త నాడీ సంబంధాల అభివృద్ధికి సహాయపడుతుంది. వారంలో చాలా రోజుల పాటు రోజుకు కనీసం 30 నిమిషాల వేగవంతమైన నడక కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. నాణ్యమైన నిద్ర కూడా అంతే ముఖ్యం. లోతైన నిద్ర సమయంలో మెదడు తనలో పేరుకుపోయే కొన్ని హానికరమైన ప్రోటీన్లను తొలగించే ప్రక్రియను నిర్వహిస్తుంది. క్రమంగా ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోవడం ఈ సహజ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది. సామాజికంగా చురుకుగా ఉండడంకూడా మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడడం, ఆలోచనలు పంచుకోవడం, సమాజంతో అనుబంధంగా ఉండడం ద్వారా మెదడు వివిధ సామాజిక అంశాలను నిరంతరం విశ్లేషిస్తూ చురుకుగా ఉంటుంది. అలాగే కొత్త విషయాలు నేర్చుకోవడం కూడా మెదడును సవాలు చేస్తుంది. కొత్త భాష నేర్చుకోవడం, సంగీత వాయిద్యం సాధన చేయడం లేదా కొత్త ప్రదేశాలు, మార్గాలను అన్వేషించడం వంటి అనుభవాలు కొత్త నాడీ సంబంధాల ఏర్పాటును ప్రోత్సహిస్తాయి.

### అమాంతం పెరిగిన సంపద.. మరోసారి ట్రిలియనీర్‌గా మస్క్

ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ మళ్లీ ట్రిలియనీర్ అయ్యారు . సోమవారం ఆయన సంపద ఒక్కసారిగా 65 బిలియన్ డాలర్లు పెరిగి.. 1.03 ట్రిలియన్ డాలర్లకు చేరింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. స్పేస్‌ఎక్స్, టెస్లా షేర్లు లాభాల్లో దూసుకెళ్లడమే మస్క్ సంపద గణనీయంగా పెరగడానికి ప్రధాన కారణం. అక్టోబర్ ప్రారంభం నుంచి స్పేస్ ఎక్స్ షేర్లు 13 శాతం, టెస్లా షేర్లు 6.7 శాతం ర్యాలీ అయ్యాయి. జూన్‌లో మస్క్ తొలిసారి ట్రిలియనీర్‌గా అవతరించిన సంగతి తెలిసిందే. ఆ నెలలో అమెరికా మార్కెట్లలో స్పేస్‌ఎక్స్ షేర్లు నమోదయ్యాయి. షేర్ వాల్యూ దూసుకెళ్లడంతో కంపెనీ విలువ 2.8 ట్రిలియన్ డాలర్ల మార్క్‌కు చేరువైంది.




# ఈ నెలలోనే జియో ఐపీఓ..




రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ (Jio IPO) ఈ నెలలోనే పబ్లిక్ ఇష్యూకు రానుంది. దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. అయితే, ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ (OFS) ఉండకపోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ వాటాలను పూర్తిగా లేదా పాక్షికంగా వదులుకునేందుకు ఏ ఒక్క ఇన్వెస్టరూ సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. అంటే ఈ ఇష్యూ పూర్తిగా కొత్త షేర్ల జారీ రూపంలోనే జరగనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు సంబంధించి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించగా.. మెరుగైన స్పందన వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో జియో ఐపీఓ సుమారు రూ.12 లక్షల కోట్ల మార్కెట్ విలువతో లిస్టింగ్‌కు రావొచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో టాప్-3 కంపెనీల జాబితాలో చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ పరంగా మూడు అతిపెద్ద కంపెనీలుగా ఉన్నాయి. రిలయన్స్ జియో ఐపీఓ ఈ నెల 21-23 మధ్య సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చే అవకాశం ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 19న విండో తెరుచుకోనున్నట్లు తెలుస్తోంది. మొత్తం 27 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. పబ్లిక్ ఇష్యూలో క్యూఐబీలకు 50 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం చొప్పున కోటా నిర్ణయించనున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్, దాని అనుబంధ కంపెనీల్లోని శాశ్వత ఉద్యోగులకు షేర్ల కేటాయింపులో రిజర్వేషన్ ఉంటుంది. ఐపీఓ పరిమాణం, ధరల శ్రేణి వంటి వివరాలపై త్వరలో స్పష్టత రానుంది.

# ఆసుపత్రి బిల్లులకు 'విదేశీ పెట్టుబడుల' పోటు



దేశీయ హాస్పిటల్స్‌లోకి విదేశీ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలైన బ్లాక్‌స్టోన్, కేకేఆర్, టీపీజీ, జనరల్ అట్లాంటిక్ వంటివి గత అయిదేళ్లలో సుమారు రూ.96,200 కోట్ల (10 బి.డాలర్ల) పెట్టుబడులు పెట్టినట్లు ఈవై నివేదిక వెల్లడిస్తోంది. ఈ నిధులతో ఆసుపత్రుల విస్తరణ, కొత్త పడకల ఏర్పాటు, ఆధునిక వైద్య పరికరాలు - సాంకేతికత సమకూరుతున్నాయి. పెద్ద హాస్పిటల్ చెయిన్‌లోకి చిన్న, మధ్య తరహా ఆసుపత్రులూ చేరుతున్నాయి. అయితే విదేశీ పెట్టుబడులు వచ్చాక, దేశీయ ఆసుపత్రుల్లో చికిత్సా వ్యయాలు అధికమవుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ద్రవ్యోల్బణం ఏటా 13 శాతానికి చేరిందని పార్లమెంటరీ సంఘం పేర్కొంది. ఆసుపత్రి స్వాధీనానికి ప్రారంభంలో భారీగా పెట్టుబడి పెడుతున్నా, కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాక, నిరంతర ఆదాయ ప్రవాహానికి అవకాశం ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. ఒకే సంస్థ కిందకు పలు ఆసుపత్రులను తీసుకురావడం, వైద్య సేవలను ఏకీకృతం చేయడం ద్వారా నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారు.

2021లో దేశంలో సుమారు 600 ఆసుపత్రి ప్రాజెక్టులకు 32 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్లకు పైగా) పెట్టుబడి అవసరమని గుర్తించారు. దీంతో ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పీఈ సంస్థలు భావిస్తున్నాయి.

ఆసుపత్రుల్లో పెట్టుబడులపై ప్రతిఫలానికి మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఒక ఉదాహరణ. 2017లో ఈ సంస్థలో పెట్టుబబడి పెట్టిన టెమాసెక్.. గత ఆగస్టులో జరిగిన ఐపీఓలో వాటా విక్రయించడం ద్వారా 10 రెట్ల రాబడిని పొందినట్లు వీసీ సర్కిల్ నివేదిక పేర్కొంది. భారత్‌లో ఆసుపత్రుల ఆదాయం 2026-27లో గరిష్ఠంగా 15% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేస్తోంది. ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులున్న ఆసుపత్రుల్లోని పడకలు, దేశంలోని మొత్తం ఆసుపత్రి పడకల్లో 5 శాతమే. అయినా కూడా అధిక ఆదాయం వచ్చే గుండె శస్త్రచికిత్సలు, క్యాన్సర్ వంటి చికిత్సా విభాగంలో వీటికే ప్రాధాన్యం ఎక్కువగా ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సాధారణ ఆసుపత్రులతో పోలిస్తే వీటిల్లో చికిత్స ఖర్చు సగటున 5-10 రెట్లు అధికమని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. పీఈ పెట్టుబడులున్న ఆసుపత్రులు అధిక బిల్లులను వసూలు చేస్తున్నాయని ఆరోగ్య బీమా కంపెనీలు ఆరోపిస్తున్నాయి. ఆసుపత్రి బిల్లులు పెరిగితే, క్లెయిం చెల్లింపులు పెరుగుతాయి. ఫలితంగా మున్ముందు బీమా ప్రీమియాలను పెంచాల్సి వస్తుంది. బీమా చెల్లింపులు ఆలస్యం చేస్తుండటం తమను ఇబ్బంది పెడుతున్నట్లు హాస్పిటల్స్ పేర్కొంటున్నాయి.

# ఫ్లాగ్‌షిప్ ఫోన్లకు డైమెన్సిటీ 9600

## ప్రోమీడియాటెక్ కొత్త చిప్‌సెట్ ఆవిష్కరణ




ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ల కోసం అధునాతన 2 నానోమీటర్ సాంకేతికతతో రూపొందించిన డైమెన్సిటీ 9600 ప్రో చిప్‌సెట్‌ను మీడియాటెక్ ఆవిష్కరించింది. ఢిల్లీలో నిర్వహించిన టెక్ డే కార్యక్రమంలో దీనిని ప్రదర్శించింది. కృత్రిమ మేధస్సు, గేమింగ్, కెమెరా, కంప్యూటింగ్‌లో మెరుగైన పనితీరుతో పాటు విద్యుత్ సామర్థ్యాన్ని అందిస్తుందని తెలిపింది. బహుళ కోర్ వినియోగంలో విద్యుత్ ఖర్చును 61 శాతం వరకు తగ్గిస్తుందని పేర్కొంది.కొత్త చిప్‌లోని స్థానిక కృత్రిమ మేధస్సు సాంకేతికత ద్వారా స్మార్ట్‌ఫోన్లలోనే అధునాతన ఏఐ సేవలను అందించనున్నట్లు వెల్లడించింది. ఓపో ఫైండ్ ఎక్స్10 ప్రో మ్యాక్స్‌లో డైమెన్సిటీ 9600 ప్రో తొలిసారిగా భారత్‌లో అందుబాటులోకి రానుంది.మీడియాటెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జేసీ హ్సు మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్ అనుభవంలో ఏఐ కీలకంగా మారుతోందని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పనితీరు, సామర్థ్యం, మేధస్సును పెంచేలా డైమెన్సిటీ 9600 ప్రోను రూపొందించినట్లు తెలిపారు.

### సెన్సెక్స్ 685+, నిఫ్టీ 220+

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారమూ రాణించాయి. గత సెషన్ లాభాల ర్యాలీని కొనసాగించాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. దీనికితోడు బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతూ కలిసొచ్చింది. దీంతో రెండో రోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 72,508.05 పాయింట్ల వద్ద లాభాల్లో ఆరంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. 685.34 పాయింట్లు లాభపడి 73,067.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 220.35 పాయింట్లు పెరిగి 22,776.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.43గా ఉంది. సెన్సెక్స్ 30లో ట్రెంట్, కోటక్ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్, రిలయన్స్, ఇండిగో, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్‌మహీంద్రా, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 98.64 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,151.08 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# భారత్ వృద్ధి అంచనాలను పెంచిన ప్రపంచ బ్యాంక్




భారత వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ సవరించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి 7.1 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేసింది. అంతకుముందు జూన్‌లో 6.6 శాతంగా ఉన్న వృద్ధి అంచనాలను పెంచింది. అంతర్జాతీయ అనిశ్చితులు ఉన్నా.. ఆశించిన స్థాయిలో వృద్ధి నమోదు కావడంతో అంచనాలను సవరించినట్లు తన 'ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి నమోదు చేసిన సంగతి తెలిసిందే. సబ్సిడీలు, తక్కువ ద్రవ్యోల్బణం కారణంగా గ్రామీణ వినియోగం పుంజుకోగా, ఆదాయపు పన్ను ఉపశమనాలు, జీఎస్టీ కోతల కారణంగా పట్టణ వినియోగం బలపడిందని తెలిపింది. అంతర్జాతీయ ప్రతికూలతలు ఉన్నప్పటికీ.. పారిశ్రామిక రంగం ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలను ఇచ్చిందని పేర్కొంది. నైరుతి రుతుపవనాల్లో నమోదైన లోటు వర్షపాతం వ్యవసాయ రంగాన్ని కొంత ప్రభావితం చేయొచ్చని నివేదిక అంచనా వేసింది. అయితే పారిశ్రామిక రంగం ఆ లోటును భర్తీ చేస్తుందని అభిప్రాయపడింది. సేవల రంగం మునుపటి కంటే కాస్త నెమ్మదించినప్పటికీ.. ఇప్పటికీ స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు దాదాపు 7 శాతంగా నమోదు కావొచ్చని ప్రపంచ ఏజెన్సీలైన ఎస్అండ్‌పీ, ఫిచ్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ఓఈసీడీ ఇటీవల పేర్కొన్నాయి.




### ఇక దాదాగిరే.. దిల్లీ హెడ్‌కోచ్‌గా గంగూలీ




టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ కొత్త బాధ్యతలు తీసుకున్నారు. దిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. 2027 ఐపీఎల్ (IPL) సీజన్ నుంచి జట్టును ముందుండి నడిపించనున్నారు. ఈ విషయాన్ని దిల్లీ యాజమాన్యం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ''దిల్లీ.. దాదాగిరి చేసే సమయం వచ్చేసింది'' అని పేర్కొంది. ఒక ఐపీఎల్ జట్టుకు దాదా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ఇదే తొలిసారి. ఇక దిల్లీ జట్టుతో గంగూలీకి సుదీర్ఘ అనుభవం ఉంది. 2019లో సలహాదారుగా ఈ ఫ్రాంఛైజీతో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. తర్వాత మహిళల, పురుషుల జట్లకు క్రికెట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. గత కొన్ని సీజన్లుగా దిల్లీ పేలవ ప్రదర్శన చేస్తుండటంతో జట్టు బృందంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. 'దిల్లీతో నాకు ఎన్నో సంవత్సరాలుగా బలమైన బంధం ఉంది. ఆ జట్టు యాజమాన్యం, సిబ్బంది, ఆటగాళ్లతో కలిసి పనిచేశాను. హెడ్‌కోచ్ పదవి నా బాధ్యతను మరింత పెంచింది. మా వద్ద ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు.

# ఒలింపిక్స్ 2036 ఆతిథ్య రేసులో భారత్.. ఇవి కూడానూ: IOC

ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే కలల దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. తాజాగా 2036 ఎడిషన్‌కు సంబంధించి భారత్, ఖతార్ రేసులో ఉన్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (IOC) ధ్రువీకరించింది. ఈ రెండు దేశాలు కాకుండా.. మరో ఐదు కూడా రేసులో ఉన్నాయని ఐఓసీ వెల్లడించింది. వందకుపైగా సభ్యులు కలిగిన అసోసియేషన్ 2029లో ఓటింగ్ ద్వారా ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేయనుంది. భారత్, ఖతార్ ఫేవరెట్‌గా ఉన్నట్లు ఐఓసీ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం 2036 ఎడిషన్‌ను మాత్రమే కాకుండా.. 2040, 2044 ఒలింపిక్స్ ఆతిథ్యం ఎంపిక కోసం దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, జర్మనీ, హంగరీ, తుర్కియే చర్చలు జరుపుతున్నట్లు ఐఓసీ తెలిపింది. 'ఒలింపిక్స్ ఎక్కడ జరిగినా.. ఒక్క విషయం మాత్రం ఎప్పటికీ మారదు. మారకూడదు. ఎలాంటి ఏర్పాట్లు చేసినా అథ్లెట్లే కేంద్రంగా ఉండాలి'' అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షురాలు కిర్‌స్టీ కోవెంట్రీ వెల్లడించారు. 2036 ఆతిథ్య హక్కుల కోసం బిడ్డింగ్ వేయడానికి అక్టోబర్ 31 వరకు గడువు ఉంది. ఈ క్రమంలో బిడ్డర్లను మార్గదర్శనం చేయడానికి 30 పేజీల డాక్యుమెంట్‌ను ప్రచురించింది. 2028లో లాస్ ఏంజెలెస్ (అమెరికా), 2032లో క్వీన్స్‌ల్యాండ్ (ఆస్ట్రేలియా) వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి. అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్ గేమ్స్‌ను నిర్వహించాలని భారత్ ఏర్పాట్లు చేస్తోంది. 2030లో కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం కూడా అక్కడే ఉంది. ఒలింపిక్స్ 2036 కోసం ఖతార్ పోటీ పడుతోంది. భారత్‌కు కాస్త గట్టిపోటీనిచ్చేది ఖతారే. 2022 ఫిఫా ప్రపంచ కప్‌ను నిర్వహించిన అనుభవంతోపాటు పెద్ద క్రీడల ఈవెంట్లకు ఆతిథ్యం ఇచ్చింది. సియోల్ వేదికగా దక్షిణ కొరియా కూడా ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమవుతోంది. 1988లోనే కొరియా మెగా ఈవెంట్‌కు హోస్ట్‌గా వ్యవహరించింది. 1972లో జర్మనీ ఒలింపిక్స్‌ను నిర్వహించింది. మళ్లీ ఆతిథ్య హక్కుల కోసం సిద్ధమవుతోంది. మ్యూనిచ్ వేదికగా క్రీడల నిర్వహించాలని చూస్తోంది.



ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చిన తొలి ఆఫ్రికా దేశంగా నిలవాలనేది దక్షిణాఫ్రికా ఆశయం. అందుకోసం బరిలోకి దిగింది. 2036లో రాకపోయినా.. ఆ తర్వాత ఎడిషన్ల కోసమూ పోటీ పడనుంది.

హంగరీ, తుర్కియే రాజధానులు బుడాపెస్ట్, ఇస్తాంబుల్ కూడా ఒలింపిక్స్ హోస్ట్ కోసం బరిలోకి దిగాయి.

# ఇదీ పాక్ క్రికెట్ పరిస్థితి.. సగం ధరకే ప్రసార హక్కులు




పాకిస్థాన్ క్రికెట్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇటు ఆటపరంగానూ.. అటు ఆర్థికంగానూ బేల చూపులు చూస్తోంది. సారథులను వెనువెంటనే మార్చడం, తుది జట్టు ఎంపికలో సరైన పద్ధతి పాటించకపోవడం, కోచింగ్ బృందంపై అనవసరంగా వేటు వేయడంతోపాటు బిడ్డింగ్ విషయంలో పీసీబీ నిర్ణయాలు బ్రాడ్ కాస్టర్లనూ ఆలోచనలో పడేశాయి. దీంతో ఆ జట్టు ఆడే మ్యాచులను ప్రసారం చేసేందుకూ ఆసక్తి చూపడం లేదు.

స్వదేశంలో 25 మ్యాచులను బ్రాడ్‌కాస్టింగ్ చేసేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు టెండర్లను పిలిచింది. గతంలో మాదిరిగా ఆసక్తి కలిగిన సంస్థలు ఓ కన్సార్టియంగా కలిసి బిడ్ వేయడానికి మాత్రం అనుమతించలేదని సమాచారం. దీంతో బ్రాడ్‌కాస్టర్లు విడివిడిగా పాల్గొనేందుకు ఆసక్తి చూపించలేదు. చివరికి ప్రభుత్వానికి చెందిన పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్ ఒక్కటే బిడ్డింగ్ వేసింది. అదీనూ కేవలం 350 మిలియన్ పాకిస్థాన్ రూపాయలకే హక్కులను సొంతం చేసుకుంది. రిజర్వ్ ప్రైస్ 600 మిలియన్ పాకిస్థాన్ రూపాయల కంటే దాదాపు సగం కావడం గమనార్హం. 'ఇటీవల కాలంలో పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఆటతీరు తీసికట్టుగా ఉంది. స్పాన్సర్లు, బ్రాడ్ కాస్టర్లు, ప్రకటనకర్తలు ఆసక్తి చూపించడంలేదు. బాకీలు ఉన్న కొన్ని ప్రసార సంస్థలు కూడా తమకు తామే పోటీకి దూరంగా ఉన్నాయి. గతంలో పాక్ క్రికెట్‌కు సంబంధించి చాలా వరకూ హక్కులను దక్కించుకున్న ఓ సంస్థ కూడా ఇప్పుడు ఆసక్తి చూపించలేదు'' అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# షట్లర్లకు సవాల్.. నేటి నుంచి ఆర్కిటిక్ ఓపెన్



వాంటా (ఫిన్లాండ్): ఆసియా క్రీడల్లో అంచనాలు అందుకోలేకపోయిన భారత షట్లర్లకు పరీక్ష.. మంగళవారం మొదలయ్యే ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చాటాలనే లక్ష్యంతో భారత స్టార్లు బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు.. క్వాలిఫయర్‌తో తలపడనుంది. ఆసియా క్రీడల వ్యక్తిగత విభాగంలో సింధు పతకం గెలవడంలో విఫలమైంది. సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోనే ఆమె వెనుదిరిగింది. ఈ భారత స్టార్ గాడిలో పడేందుకు ఆర్కిటిక్ ఓపెన్ మరో మంచి అవకాశం. పిన్ చియాన్ (చైనీస్ తైపీ)తో తన్వి శర్మ, లిన్ క్రిస్టోఫర్‌సెన్ (డెన్మార్క్)తో అస్మిత చాలిహా పోటీపడనున్నారు. హన్ కియాన్ (చైనా)తో ఉన్నతి హుడా తొలి రౌండ్లో ఆడనుంది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, ప్రణయ్ పోటీలో ఉన్నారు. తొలి రౌండ్లో బ్రియాన్ యంగ్ (కెనడా)తో శ్రీకాంత్.. ఆండ్రెస్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో ప్రణయ్ ఢీకొననున్నారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-ఎంఆర్.అర్జున్, కృష్ణప్రసాద్ గరగ-పృథ్వీ కృష్ణమూర్తి బరిలో ఉన్నారు. అలెక్స్ గ్రీన్-జాక్ రూస్ (ఇంగ్లాండ్) జంటతో హరిహరన్ ద్వయం.. జి టింగ్-గ్జియాంగ్ యూ (చైనా) జంటతో కృష్ణప్రసాద్ జోడీ తలపడనుంది.

# జట్టులో రొటేషన్‌కే గంభీర్ ప్రాధాన్యం: మోర్కెల్

వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్ఇండియా.. ఆ జట్టుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. నేడు తొలి మ్యాచ్ లఖ్‌నవూ వేదికగా జరగనుంది. ఈ క్రమంలో ఓపెనింగ్ భాగస్వామ్యంపై జరుగుతోన్న చర్చలపై భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పందించాడు. కొంత మంది ఆటగాళ్లకు తగిన విశ్రాంతినిచ్చేందుకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు కూర్పులో కొత్త ప్రయోగాలు చేసే అవకాశం ఉందన్నాడు. వచ్చే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఏది అత్యుత్తమంగా ఉంటుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకొని..




తుదిజట్టు ఎంపికపై సెలక్టర్లు, కోచ్, కెప్టెన్ నిర్ణయం తీసుకుంటారన్నాడు. 'గౌతమ్ గంభీర్ కచ్చితంగా జట్టులో రొటేషన్‌కే ప్రయత్నం చేస్తారని నాకు నమ్మకముంది. సెలెక్టర్లు, కోచ్, కెప్టెన్ చేతుల్లో తుది జట్టు ఎంపిక ఉంటుంది. వైభవ్ ప్రతిభ గురించి మనందరికీ తెలిసిందే. ఒకవేళ అతడికి మ్యాచ్ ఆడే అవకాశం లభించకపోయినా.. జట్టుతో కొనసాగుతూ వీలైనంత ఎక్కువగా నేర్చుకుంటాడు. అనుభవజ్ఞులైన అంతర్జాతీయ ఆటగాళ్లతో కలిసి శిక్షణ పొందడం, వారి సన్నద్ధతను గమనించడం వైభవ్ కెరీర్‌కు చాలా ఉపయోగపడతాయి' అని మోర్కెల్ పేర్కొన్నాడు.

# 'దాదా'- మైసూరులో షూటింగ్ పునః ప్రారంభం

**వుదయం సినిమా:** గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్‌బస్టర్ దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి విడుదలైన 'ఎంట్రీ ఆఫ్ యాన్ ఎరా' గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. అనంతరం విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ సినిమాలో బాలకృష్ణ రగ్డ్, స్టైలిష్, పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించనున్నారు. ఆయన లుక్, పాత్ర మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి'దాదా' సినిమా షూటింగ్ నేటి నుంచి మైసూరులో పునఃప్రారంభమైంది. ఇటీవల గాయపడిన బాలకృష్ణ కోలుకుని తిరిగి షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టారు. కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌లో ఆయన చిత్రబృందంతో కలిసి పాల్గొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో ప్రధానంగా టాకీ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. బాలకృష్ణతో పాటు పలువురు ప్రముఖ నటీనటులు ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహారెడ్డి' తర్వాత మరోసారి వస్తున్న సినిమా కావడంతో దాదాపై భారీ అంచనాలు ఉన్నాయి. గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని స్టైలిష్ కమర్షియల్ యాక్షన్ స్పెక్టకిల్‌గా తెరకెక్కిస్తున్నారు. 'ది కింగ్ ఆఫ్ కెయాస్'గా బాలకృష్ణను పరిచయం చేసిన టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పనిచేస్తోంది. అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు రాశారు.



# 'అనకాపల్లి' దసరా ధమాకాగా నిలుస్తుంది.. థాంక్యూ మీట్‌లో లగడపాటి శ్రీధర్



**వుదయం సినిమా:** భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నటిస్తూ, నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి త్రినాథ రావు నక్కిన కథ, స్క్రీన్ ప్లేని అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయగా అద్భుతమైన స్పందనతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో మంగళ వారం నాడు థాంక్యూ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ .. ''అనకాపల్లి' సినిమాకి నేను డబ్బు లేమీ పెట్టలేదు. నా పేరు పెడితే ఎవరైనా చూసేందుకు వస్తారని అలా పెట్టారు. సోమవారం వరకు రిజల్ట్ కోసం వెయిట్ చేశాను. సోమ వారమే కాదు.. మంగళ వారం కూడా మంచి ఫ్లోటింగ్ ఉంది. అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. సినిమాకు అన్ని వైపుల నుంచి రెస్పాన్స్ వస్తోంది. పర్ఫార్మెన్స్ పరంగా ఆర్టిస్టులందరికీ మంచి పేరు వస్తోంది. ఈ సినిమాని ఇలానే మరింత ముందుకు తీసుకు వెళ్లాలని మీడియా, ఆడియెన్స్‌ని కోరుకుంటున్నాను' అని అన్నారు.లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ .. ''అనకాపల్లి' సక్సెస్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. విక్రమ్ నా కొడుకు అవ్వడం, అతని మీద ఒక సినిమా తీయడానికి త్రినాథ్ రావు గారు, నాయుడు గారు ముందుకు రావడం గొప్ప విషయం.

# 'హుషారు 2' అనౌన్స్‌మెంట్

**వుదయం సినిమా:** కుర్రకారులో సరికొత్త ఉత్సాహాన్ని నింపిన ఐకానిక్ ఫ్రాంచైజీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. 2018లో విడుదలై యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసు కున్న 'హుషారు' చిత్రం ఎంతటి ఘన విజయాన్ని అందుకుందో మనందరికీ తెలుసు. ఆ సక్సెస్ తర్వాత..తాజాగా అందరిలో ఆసక్తిని పెంచుతూ దర్శకుడు శ్రీహర్ష 'హుషారు 2'ను సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు. దీని టైటిల్ అనౌన్స్మెంట్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. టైటిల్ పోస్టర్‌ను గమనిస్తే.. మొదటి భాగంలో ఐదుగురు స్నేహితులు రూపొందించిన కబూమ్ బీరు ఓ ట్రక్కులో ఉంది. ఆ ట్రక్కుకు రెండు వైపులా కొందరు పట్టుకుని బలంగా లాగుతున్నారు. వారికి తాడులా పాము కనిపిస్తోంది. పాము మధ్యలో స్నేహితులు చిక్కుకుని భయపడుతున్నారు. ట్రక్కు కింద తాబేలు ఉంది. కాస్త దూరంలో బంగారు నగలతో ఉన్న పెట్టె ఉంది. పోస్టర్ వెనుక ఫ్యాక్టరీ ఉంది. పోస్టర్‌ను చూస్తుంటే.. దేవతలు, రాక్షసులు కలిసి అమృత మథనం చేసిన కథ మనకు గుర్తుకు వస్తుంది. ఆ కథకు, ఈ సీక్వెల్‌కు ఉన్న లింకేంటి? అనే విషయం తెలియాలంటే హుషారు 2 సినిమా వచ్చే వరకు ఆగాల్సిందే. రెట్టింపు ఫన్, మ్యాడ్‌నెస్, నాన్‌స్టాప్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'హుషారు 2' తెరకెక్కనుంది.




# 'కాకా' కీలక పాత్రలో అనురాగ్ కశ్యప్

**వుదయం సినిమా:** బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి మరోసారి కలిసి చేస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా'. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. తాజాగా బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ 'కాకా' చిత్రంలోకి అడుగుపెట్టారు. సినిమాలో ఆయన కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. అనురాగ్ కశ్యప్ చిత్రంలో భాగమైన విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫొటోలో దర్శకుడు బాబీ కొల్లి అనురాగ్ కశ్యప్‌కు ఓ సన్నివేశాన్ని వివరిస్తుండగా, ఆయన ఎంతో ఏకాగ్రతతో వింటూ కనిపించారు. అనురాగ్ కశ్యప్ చేరిక సినిమాకు మరింత ఆసక్తిని తీసుకొచ్చింది. 'కాకా'పై అంచనాలను మరింత పెంచింది.ప్రస్తుతం 'కాకా' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. అనురాగ్ కశ్యప్ ఇతర ప్రధాన నటీనటులతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఆమెను 'హార్ట్ ఆఫ్ కాకా'గా పరిచయం చేస్తూ, ఆమె పాత్ర పేరు అమ్ములు పాప అని రివిల్ చేశారు. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుం డగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు. భాను–నందు డైలాగ్స్ రాస్తున్నారు.'కాకా' 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.



# 'చీన్ టపాక్ డమ్ డమ్' ఫస్ట్ క్రాకర్ ఆవిష్కరించిన హిట్ మెషీన్ అడివి శేష్..

**వుదయం సినిమా:** అల్లరి, సరదా, నవ్వులతో ప్రేక్షకులను అలరించేందుకు 'చీన్ టపాక్ డమ్ డమ్' సిద్ధమవుతోంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన ఫస్ట్ క్రాకర్‌ను హిట్ మెషీన్ అడివి శేష్ ఆవిష్కరించారు. ఈ ఫస్ట్ క్రాకర్ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచింది.గవిరెడ్డి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రానికి వై.ఎన్.లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిలేరియస్ సన్నివేశాలు, ఆసక్తికరమైన పల్లెటూరి నేపథ్యంతో ఈ సినిమా ఆద్యంతం వినోదాన్ని పంచే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. ఇక మోషన్ పోస్టర్‌లోని "కాన్ సెన్స్ క్రౌన్స్ వెన్ కామన్ సెన్స్ డ్రౌన్స్' అనే క్యాప్షన్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటూ..సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.ఆసక్తికరంగా రూపొందించిన మోషన్ పోస్టర్ జొన్నాడ గ్రామంలోని వింత ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది. ఇందులో గేదె, గ్రామ దేవత, బంగారం వంటి ఆసక్తికరమైన అంశాలతో పాటు మరెన్నో ఆసక్తిని రేకెత్తించే విషయాలు కనిపిస్తున్నాయి.



## వుదయం సినిమా MOVIE TIME!

# గరివిడి లక్ష్మి ట్రైలర్ లాంచ్ ఈవెంట్



**వుదయం సినిమా:** భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది నటిస్తున్నారు. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది.అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో అడివి శేష్, దర్శకులు బాబీ కొల్లి, హరీష్ శంకర్, మారుతి ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ .. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకలో చేసిన కళా ప్రదర్శన నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక్కడ ఆ పాటలు వింటుంటే నాకు నా బాల్యం గుర్తుకొచ్చింది. నేను వైజాగ్‌లోనే పెరిగాను. గరివిడి లక్ష్మి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న కృతి ప్రసాద్ గారికి, విశ్వ గారికి ధన్యవాదాలు. డైరెక్టర్ గారు చాలా నిజాయితీగా ఈ కథను చెప్పారు. ఆ నిజాయితీని ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. ట్రైలర్ చూసిన తర్వాత ఆనంది గారితో కలిసి నటించాలని అనిపించింది. ఈ ట్రైలర్ చూస్తున్నప్పుడు ఆ ప్రపంచంలో కలిసిపోయాను. ఈ సినిమాకు తప్పకుండా చాలా మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని నమ్ముతున్నాను. అక్టోబర్ 17న తప్పకుండా ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూడాలని కోరుకుంటున్నాను.డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. కృతి ప్రసాద్ ఈ సినిమాను చాలా ప్యాషన్‌తో తీశారు. ఇంత మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న తనకు అభినందనలు. 'మహానటి'లో కీర్తి సురేష్ గారికి సావిత్రి గారి పాత్రను ఎలా అయితే ఇచ్చారో, అలాగే ఆనందికి కూడా గరివిడి లక్ష్మి అంత మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నాను. డైరెక్టర్ గారు చాలా నిజాయితీగా ఈ సినిమా తీశారు. ట్రైలర్ చూస్తుంటే తన ఫస్ట్ సినిమా లాగా అనిపించడం లేదు. ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ కూడా చాలా మంచి పేరు వస్తుంది. అక్టోబర్ 17న అందరూ ఈ సినిమాను థియేటర్లలో చూడాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. ఆనందిని 'బస్ స్టాప్' సినిమాకు హీరోయిన్‌గా పరిచయం చేశాను. దాని తర్వాత తమిళ్‌లో దాదాపు 40 సినిమాలు చేసింది. తన పెర్ఫార్మెన్స్ చూస్తుంటే చాలా టచింగ్‌గా ఉంది. ఇలాంటి పాత్రలు చేయడం అంత ఈజీ కాదు. ఎంతో బలంగా నమ్మి తీస్తే ఎంత నిజాయితీగా వస్తుందో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. కృతి ప్రసాద్ ఈ సినిమా కోసం చాలా ప్యాషన్‌తో పనిచేసింది. ఇందులో పాటలన్నీ కూడా మనకు తెలిసినవే. అందులో పాటలు, సీన్స్ చూస్తుంటే చాలా నాస్టాల్జిక్ ఫీలింగ్ ఉంది. ఇందులో కళ్యాణ్ గారు పాడిన పాట కూడా వచ్చింది.

# "రణబాలి" ట్రైలర్ రిలీజ్




**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.ఈ రోజు "రణబాలి" సినిమా ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 8వ తేదీన ఈ చిత్ర ట్రైలర్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. "రణబాలి" ట్రైలర్ పై మూవీ లవర్స్ లో హై ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ఇప్పటికే టీజర్, సాంగ్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ రాగా...విజయ్, రశ్మిక చేస్తున్న ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ వైరల్ గా మారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ట్రైలర్ తో "రణబాలి" సినిమాపై మరింత క్రేజ్ ఏర్పడనుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ ఎదురుచూస్తున్నారు.

# 'సరిపోయారు ఇద్దరూ' టీజర్ విడుదల



**వుదయం సినిమా:** హ్యాపీ ఆక్స్ ఎంటర్టైన్మెంట్, ఎంఎస్ వారాహీ క్రియేషన్స్, శత మానంభవతి ఆర్ట్స్ బ్యానర్ల మీద సాదత్,ముని శివ నిర్మించిన చిత్రం 'సరి పోయారు ఇద్దరూ'. సతీష్ వేగేశ్న తెరకెక్కించిన ఈ మూవీలో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న, రాజేంద ప్రసాద్, సీనియర్ నటుడు నరేష్, రిద్ధి కుమార్, మేఘా చౌదరి కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. హిట్ మెషీన్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేసి టీం కు అభినందనలు తెలిపారు.టీజర్‌లో పల్లెటూరి వాతావరణం, వైజాగ్ సిటీని అందంగా చూపించారు. టీజర్ ప్రారంభంలో స్నేహితులుగా కలిసి ఉన్న నరేష్, రాజేంద్ర ప్రసాద్.. టీజర్ ఎండింగ్‌కి అలా ఎందుకు మారారు? అన్నదే కథ అన్నట్టు కట్ చేశారు. ఇక యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి ఎక్కువగా కనెక్ట్ అయ్యేలా సినిమాని సతీష్ వేగేశ్న తెరకెక్కించారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే కథ, ఎమోషన్స్, హాస్యం, ప్రేమ అన్ని రకాల అంశాలున్నాయని టీజర్‌ను గమనిస్తేనే తెలుస్తోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.